అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

పాతుకుపోయిన రాజకీయ వ్యవస్థపై నేపాల్ నవతరం తిరుగుబాటు
నేపాల్‌లో జాతీయ సంతాపదినం
యువ విప్లవం పూర్తికాలేదు, ఇప్పుడే మొదలైంది!
భద్రతామండలి సంస్కరణలకు ఏకాభిప్రాయం ఉండాలి : రష్యా 02

సంపుటి 08, సంచిక: 288 | గురువారం | 18-09-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం
# ఉద్యమాలకు ఊపిరి

**ఈ పోరాట ఫలితంగా ప్రజల్లో చైతన్యం రగిలి మెరుగైన తెలంగాణ పౌర సమాజం ఏర్పాటు**

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల ముగింపు బహిరంగ సభలో పలువురు వక్తలు**



ప్రజాపక్షం/హైదరాబాద్

నిజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించి వేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రేరణనే దేశంలో అనేక విప్లవ, సామాజిక ఉద్యమాలకు ఊపిరి పోసిందని పలువురు వామపక్ష నాయకులు, ప్రముఖులు వక్తలు అన్నారు. ఆ పోరాటం ఫలితంగానే ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం రగిలి మెరుగైన తెలంగాణ పౌర సమాజం ఏర్పడిందని వారు పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల ముగింపు బహిరంగ సభ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభకు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్యపద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి.యూసుఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కళవేణ శంకర్, అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సభలో సయ్యద్ అజీజ్‌పాషా మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో నాడు 52 శాతం తెలుగు, ఆ తర్వాత మరాఠ, కన్నడం వారు ఉంటే ముస్లింల సంఖ్య కేవలం 10 శాతమేనన్నారు. దీంతో మెజారిటీ ప్రజలకు తమ మాతృభాషలో చదువుకునేందుకు కూడా అవకాశం లేకపోయిందని,

తరువాయి 12లో

## జెండాలు.. ఎజెండాలు పక్కనపెట్టి
# రాష్ట్రాభివృద్ధికి కలిసిరండి



- చరిత్రలో లిఖించదగినది తెలంగాణ సాయుధ పోరాటం
- గత పదేళ్లలో నియంతృత్వ నిర్బంధంలోకి జారిన పాలనను ఓడించాం
- ప్రజాపాలనను తెచ్చుకున్నాం
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగిన ఘనత 'తెలంగాణ సాయుధ' పోరాటానిదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మొదలైన స్వరాష్ట్ర ప్రస్థానంలో గత ప్రభుత్వ పదేళ్ల కాలంలో మళ్లీ నియంతృత్వం, నిర్బంధంలోకి జారిందని, 'నాటి సాయుధ పోరాట స్ఫూర్తితో నిన్నటి నియంతృత్వ పాలనను ఓడించి, ప్రజా పాలనను తెచ్చుకున్నామని తెలిపారు. సాయుధ పోరాట స్ఫూర్తితో మొదలైన ప్రయాణం ప్రపంచ వేదికపైన తెలంగాణ జెండా ఎగిరే స్థాయికి చేరాలన్నారు. రాజకీయాలకతీతంగా జెండాలు, ఎజెండాలను పక్కన పెట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న తెలంగాణ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఎన్నికల్లో పోటీ చేద్దామని, అప్పటి వరకు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఒక వేళ అభివృద్ధికి కలిసి ముందుకు రాకపోతే మౌనంగా ఉన్నా పర్వాలేదని, తాము మాత్రం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తామని సిఎం అన్నారు. త్వరలోనే మెట్రో రైల్ విస్తరణను, భారత భవిష్యత్ నూతన నగరానికి చెందిన ప్రణాళికను ప్రారంభించనున్నట్లు సిఎం వెల్లడించారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన 'తెలంగాణ ప్రజా పాలన' దినోత్సవ వేడుకలకు సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు గన్‌పార్క్‌లోని అమర వీరులకు సిఎం నివాళులు అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదని, నిజాం నియంతృత్వంపై

తరువాయి 2లో

**దేశానికి దిక్సూచిలా రాష్ట్ర విద్యావిధానం**
విద్యారంగ సమూల ప్రక్షాళనే ధ్యేయం
3లో

**సాయుధ పోరాట స్ఫూర్తితో...**

నిజాం నియంతృత్వంపై సామాన్యుడు సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయం ఈరోజు మనం అనుభవిస్తోన్న ప్రజాస్వామ్యం. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిది. 1948, సెప్టెంబర్ 17.. ఈ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛాపతాకను ఎగురవేసిన రోజు. సాయుధ పోరాట స్ఫూర్తితో మొదలైన మన ప్రయాణం.. ప్రపంచ వేదికపై తెలంగాణ జెండా ఎగిరే స్థాయికి చేరాలి. ఆ బాధ్యత మాది.

— సిఎం రేవంత్‌రెడ్డి

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి**
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**పటేల్ కలలను నిజం చేయడానికి మోదీ కృషి**
కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**పటేల్‌ను అవమానిస్తున్న బిజెపి**
తెలంగాణ విలీన దినోత్సవంలో టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
3లో

**స్వగ్రామంలో సాయుధ పోరాట సేనాని విగ్రహం**


3లో

తెలంగాణ సాయుధ పోరాట సేనాని పద్మ విభూషణ్ రావి నారాయణరెడ్డి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా బొల్లెపల్లిలో ఆయన విగ్రహాన్ని బుధవారం ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు.

## పంట వ్యర్థాల దహనం
# రైతులను జైలుకు పంపండి

- కొందరిని జైల్లో వేస్తేనే ఇతరులు పద్ధతి మార్చుకొంటారు
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- పంట వ్యర్థాల దహనాన్ని నియంత్రించని పంజాబ్ ప్రభుత్వంపై సీరియస్



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలలో పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. శీతాకాలంలో కాలుష్యం స్థాయిలు సాధారణంగా పెరగడంపట్ల తీవ్ర ఆందోళ చెందుతోన్న సుప్రీంకోర్టు వాయుకాలుష్యానికి కీలక కారణమైన వ్యర్థ పదార్థాలను తగులబెట్టినందుకు కొంతమంది రైతులను ఎందుకు అరెస్ట్ చేయకూడదని పంజాబ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. 'మీరు నిర్ణయం తీసుకోండి. లేదంటే మేం మాండమస్ జారీ చేస్తాం' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై బలమైన వ్యాఖ్యలు చేసింది. ఉత్తర్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల కాలుష్య నియంత్రణ

తరువాయి 2లో

## సాయుధ పోరాటాన్ని
# తాత్కాలికంగా నిలిపేస్తున్నాం

- శాంతి చర్చలు సులభతరం చేయడానికి ఆయుధాలు వీడుతున్నాం
- మావోయిస్టు పార్టీ ప్రకటన ?
- ఒక నెలపాటు కాల్పుల విరమణ ప్రకటించాలని కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదన



**రాయ్‌పూర్ :** శాంతి చర్చలను సులభతరం చేయడానికి ఆయుధాలను వీడుతున్నామని, తమ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని నిషిద్ధ సిపిఐ మావోయిస్ట్ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే ఈ ప్రక్రియను ప్రారంభించడానికి ఒక నెల కాల్పుల విరమణను ప్రకటించాలని, భద్రతా దళాల కార్యకలాపాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరింది. కాగా, మంగళవారం సామాజిక మీడియాలో వెలువడిన మావోయిస్టుల ప్రకటన ప్రామాణికతను ధృవీకరిస్తున్నట్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. మావోయిస్టులు విడుదల చేసిన ప్రకటనలో తాము తమ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని ఇంటర్నెట్, రేడియోతో సహా ప్రభుత్వ వార్తా మాధ్యమాల ద్వారా పంచుకోవాలని మావోయిస్టు పార్టీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ ప్రకటన ఆగస్టు 15 నాటి తేదీతో మావోయిస్టుల

తరువాయి 2లో

**లేఖపై భిన్నాభిప్రాయాలు**
అభయ్ పేరిట మరో ఆడియో విడుదల
3లో

**మావోయిస్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**
2లో

## బ్రిటన్ పర్యటనలో
# ట్రంప్‌కు నిరసన సెగ

- డంప్–ట్రంప్ అంటూ వేలాదిమంది నినాదాలు
- లండన్‌లో ట్రంప్–జెఫ్రీ ఎప్స్టీన్ భారీ పోస్టర్లు




**లండన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రిటన్ పర్యటనకు ముందుగానే నిరసన ప్రదర్శకులు ఆయనకోసం కాచుకుని కూర్చున్నారు. లండన్‌లోని పార్లమెంటు స్క్వేర్ నుండి బుధవారం మధ్యాహ్నం వేలాదిమంది ప్రదర్శకులు ట్రంప్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ప్రదర్శనలు చేసేందుకు ముందు రోజు నుండే నిరసనకారులు సిద్ధమయ్యారు. ప్రదర్శకులను అదుపు చేసేందుకు దాదాపు 1600 మంది పోలీసులనులండన్‌లో, వెస్ట్‌మినిస్టర్ పరిసరాల్లో బ్రిటన్ ప్రభుత్వం మోహరించింది. దాదాపు 50 గ్రూపులు ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలకు సంసిద్ధమయ్యాయి. 2019లో ట్రంప్ బ్రిటన్ పర్యటన సమయంలో కూడా ఆయనకు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. గతంలో ప్రజల వ్యతిరేకత మధ్య ఆయన బ్రిటన్ పర్యటన జరిపారు. రెండోసారి కూడా బ్రిటన్ పర్యటనలో ఆయనకు అసాధారణ పద్ధతులలో ప్రజా నిరసన ఎదురవుతున్నది. మంగళవారం రాత్రి ప్రదర్శకులు విండ్సార్ పారిష్ చర్చివద్ద గుమిగూడి "ట్రంప్....డంప్...." అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. లండన్‌లో ఒక మహిళా

తరువాయి 2లో

## ప్రధాని మోదీకి 75 ఏళ్లు పూర్తి


దేశ విదేశీనేతల శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బుధవారంనాడు ప్రపంచదేశాల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 75 ఏళ్ళు వయసు పూర్తిచేసుకున్న నరేంద్రమోదీకి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుండి శుభాభినందనల సందేశాలు వచ్చాయి. చిరకాలం ఆయన ఆరోగ్యంగా వర్థిల్లాలని నాయకులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. 1950 సెప్టెంబరు 17వ తేదీన గుజరాత్‌లోని వద్నాగర్ అనే చిన్న పట్టణంలో మోదీ జన్మించారు. అందరికంటే ముందుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక వాణిజ్య సమస్యలు తొలగిపోగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ గొప్ప కృషి చేస్తున్నారని, ఉక్రేన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న కృషితో తనవంతు

తరువాయి 2లో

**గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్**
**ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి**
12 మంది నక్సల్స్ లొంగుబాటు
24న సిడబ్ల్యుసి భేటీ
05

చలో చండీఘడ్


భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21–25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)

ప్రధాన కార్యదర్శులు – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## శక్తిమంతమైన చైనా జెడ్–20 టి యుద్ధ హెలికాప్టర్



**బీజింగ్:** చైనా తయారు చేసిన అత్యంత శక్తిమంతమైన యుద్ధ హెలికాప్టర్లలో కొత్తతరం జెడ్–20 టి హెలికాప్టర్లను అందరిముందుకు తీసుకువచ్చింది. చాలా ఎత్తులో ఎగిరే ఈ హెలికాప్టర్ యుద్ధ సమయాల్లో అపార ప్రతాపం ప్రదర్శిస్తుంది. నౌకల నుండి కూడా ఇది కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈనెల మూడో తేదీన జరిగిన చైనా 80 వ విజయోత్సవ వేడుకలలో పాల్గొన్న ఈ యుద్ధ హెలికాప్టర్లను వచ్చేనెల 16 నుండి 19వ తేదీ వరకు తియన్‌జిన్‌లో నిర్వహించే హెలికాప్టర్ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది తియన్‌జిన్ ఎక్స్‌పోలో మొత్తం 52 రకాల హెలికాప్టర్లను, డ్రోన్లను చైనా ప్రదర్శిస్తున్నది. జెడ్–10 జెడ్ 19 జెడ్ 20 టి, జెడ్ 8ఎల్, కెవిడి 001 కెవిడి 002 హెలికాప్టర్లను ప్రదర్శించనున్నది.

## భద్రతామండలి సంస్కరణలకు ఏకాభిప్రాయం ఉండాలి:రష్యా



**మాస్కో:** దీర్ఘకాలికంగా కేవలం కాగితాలకే పరిమితమైన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సంస్కరణలకు రష్యా మద్దతు తెలియజేసింది. నూతన ప్రాపంచిక వాస్తవికతలకు అనుగుణంగా భద్రతామండలిని సంస్కరించాల్సిన అవసరం ఉందని రష్యా కేంద్ర కార్యాలయ అధికార ప్రతినిధి డ్మిత్రీ పెస్కోవ్ అన్నారు. ఈ సంస్కరణలకు అన్నిదేశాల మధ్య ఏకాభిప్రాయం అవసరమన్నారు. ప్రస్తుత భద్రతామండలిలో సభ్యదేశాలమధ్య మౌలికంగా సఖ్యత లేదన్నారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం వీటో అధికారాలను కొన్ని దేశాలకే పరిమితం చేయడం, భద్రతామండలి సంస్కరించడంపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి పెస్కోవ్ పైవిధంగా స్పందించారు. 1945 నాటి పరిస్థితులకు, ఈనాటి ప్రపంచ వాస్తవికతకు చాలా తేడాలు ఉన్నాయని ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. భద్రతామండలిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలకు మాత్రమే వీటో అధికారాలు ఉన్నాయి. గడచిన ఆగస్టునెలలో జిన్హువా వార్తాసంస్థకు పుతిన్ ఇంటర్వ్యూ ఇస్తూ, భద్రతామండలిలో సంస్కరణలకు చైనా, రష్యా రెండూ మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకించి భద్రతామండలిలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## గ్రూప్–1 విద్యార్థుల మీద కెటిఆర్ విషం కక్కుతున్నాడు : ఎంపి చామల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ 533 మంది గ్రూప్1 విద్యార్థుల మీద విషం కక్కుతున్నాడని, వారిని అవమానిస్తున్నాడని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు.గ్రూప్1 విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కో పోస్ట్ కు రూ.3 కోట్లు ఇచ్చారని కెటిఆర్ అంటుండు అసలు కెటిఆర్ ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. కెసిఆర్ అధికారంలో ఉండి తెలంగాణ ను కొల్లగొట్టారని అన్నారు. ప్రతి పక్షం లో ఉండి కూడా కూల్చాలని చూస్తున్నారని ఇక విద్యార్థుల మీద పడ్డారని అన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడికి పోయిండు అని కెటిఆర్ అంటుండు.. ఈరోజు ముఖ్యమంత్రి సచివాలయంలో ఉండు, ప్రతి పక్ష నేత మీ నాయన ఎక్కడికి పోయిండు అని కెటిఆర్ ను నిలదీశారు. కెటిఆర్ ఎనిమిది మంది ఎంపిల గురించి బేస్ లెస్ ఆరోపణలు చేస్తున్నాడని, ఇటీవల మాట్లాడిన అతని అనుచరుడు మ్యాడ అనిల్ అని తెలుసు, కానీ ఈరోజు కెటిఆర్ మాట్లాడితే ఏ మనాలి? అని వ్యంగంగా అన్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కు కెసిఆర్ గ్యాప్ విధించడం వల్లనే ఎన్నికలు లేటు అవుతున్నాయన్నారు.బిఆర్‌ఎస్ హయాంలో 1200 కోట్ల కాలేజ్ బకాయి లు ఎగ్గొట్టారని గుర్తు చేశారు. 2010 మెట్రో 2వ స్థానంలో ఉండగా ఇప్పుడు 2014 తర్వాత 20వ స్థానానికి పడి పోయిందన్నారు.

## రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాలు

ఎల్లో అలెర్ట్ జారీ చేసిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో రాగల నాలుగు రోజులు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలో వర్షాలు కొనసాగుతాయన్నారు. తెలంగాణను ఆనుకుని ఉన్న విదర్భ ప్రాంతంలో కొనసాగుతున్న మరో ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురు, శుక్ర వారాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు.

## రైతులను జైలుకు పంపండి

(మొదటి పేజీ తరువాయి)

బోర్డులలో ఖాళీలు భర్తీచేయడానికి సంబంధించి దాఖలైన సుమోటో పిటిషన్‌ను (స్వయంగా) ధర్మాసనం విచారణ చేపట్టింది. కోర్టు ఈ రాష్ట్రాలను కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూం), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి)లను మూడు నెలల్లోగా ఖాళీలను భర్తీ చేయాలని కోరింది. విచారణ జరుపుతుండగా కోర్టులో ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్ ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించిన సీనియర్ న్యాయవాది రాహుల్ మెహ్రాను ఉద్దేశించి తప్పు చేసిన రైతులను గడ్డి దహనం చేసినందుకు అరెస్ట్ చేసి శిక్ష ఎందుకు విధించకూడదు అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ధర్మాసనం ఆయన్ను ప్రశ్నించింది. 'రైతులు ప్రత్యేకమైన వారు. మనం వారివల్లే భుజిస్తున్నాం. అంటే పర్యావరణాన్ని కాపాడలేమని కాదు. కొన్ని జరిమానా నిబంధనలను ఎందుకు పాటించకూడదు?. కొంతమంది జైలులో ఉంటే , అది సరైన సందేశాన్ని పంపినట్లు అవుతుంది. రైతులపై విధించే జరిమానా నిబంధనల గురించి మీరు ఎందుకు ఆలోచించరు?. పర్యావరణాన్ని కాపాడాలనే నిజమైన ఉద్దేశం మీకు ఉంటే ఎందుకు దూరంగా ఉంటారు?' అని ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ప్రశ్నించారు. 'మట్టిని కూడా జీవ ఇంధనంగా వాడవచ్చని నేను వార్తాపత్రికలలో చదివాను. మేం దీనిని 5 సంవత్సరాలకు ఒకసారి చేసే కసరత్తుగా చేయలేం' అని ఆయన అన్నారు. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీలలో రైతులు తదుపరి విత్తనాల చక్రానికి తమ పొలాలను చదునుచేయడానికి వాడుకలో ఉన్న వ్యవసాయ వ్యర్థాలను తగులబెట్టడాన్ని నియంత్రించేందుకు పంజాబ్ ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రారంభంలో, సిజెఐ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ చెత్తను కాల్చడానికి బదులుగా జీవ ఇంధనంగా తిరిగి ఉపయోగించవచ్చని, పర్యావరణ పరిరక్షణకు నిజంగా కట్టుబడి ఉంటే రాష్ట్రం కఠినమైన నిబంధనలను పరిగణించాలని పట్టుబట్టారు. 'పంజాబ్ ప్రభుత్వం ఇప్పటికే కఠినమైన చర్యలను తీసుకున్నదని, కాలుష్యస్థాయి క్రమంగా తగ్గుతోంది. గత సంవత్సరం ఇది తగ్గింది. ఇప్పుడు మరింత తగ్గుతోంది. మూడు సంవత్సరాలలో చాలా సాధించబడ్డాయి. ఇంకా ఈ ఏడాది చాలా సాధించబడుతుంది' అని మెహ్రా చెప్పారు. ఇటీవలి సంవత్సరాలలో పంట వ్యర్థాలను తగులబెట్టిన సంఘటనలు 77,000 నుండి 10,000వరకు తగ్గిపోయాయి అని న్యాయవాది మెహ్రా చెప్పారు. ఒక హెక్టారు భూమిని సాగుచేస్తున్న చిన్న రైతులను అరెస్ట్ చేయడం వారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారిని అరెస్ట్ చేస్తే వారిపై ఆధారపడిన వారు కూడా నష్టపోతారని చెప్పారు. ఏ చట్టం కింద పంటలు కాల్చడం నిషేధించబడిందని అడిగినప్పుడు ఒక న్యాయవాది పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని (ఇపిఎ)ను ఎత్తిచూపారు. అయితే చట్టం కింద క్రిమినల్ ప్రాసిక్యూషన్ నిబంధనలను ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టు పేర్కొందని చెప్పారు. 'ఎందుకు దానికి ఉపసంహరించుకున్నారు?. అలాంటి వారిని కటకటాల వెనకకు పంపడం గట్టి సందేశం ఇవ్వడం అవుతుంది కదా' అని ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అన్నారు. మెహ్రా వ్యక్తం చేసిన ఆందోళనను గమనించిన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ అరెస్ట్‌లు నిత్యకృత్యంగా ఉండాల్సిన అవసరం లేదని ఉదాహరణగా నిలిచేందుకు అవసరమని చెప్పారు. నియంత్రణల సంస్థల తరపున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ నవీకరించబడిన నివేదికలను రికార్డులో ఉంచడానికి కొంత సమయాన్ని కోరారు. గత సంవత్సరం ఈ అంశంపై పంజాబ్, హర్యానా ప్రధాన కార్యదర్శులకు ధర్మాసనం సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

## నేపాల్‌లో జాతీయ సంతాపదినం

# యువ విప్లవం పూర్తి కాలేదు, ఇప్పుడే మొదలైంది!



**ఖాట్మండు:** జనరల్ జెడ్ ఉద్యమం (జెజెడ్ఎం) కాలం (సెప్టెంబర్ 8,9 తేదీలు)లో మరణించిన 72 మంది యువకులను స్మరించుకుంటూ నేపాల్ దేశ ప్రజలు బుధవారనాడు జాతీయ సంతాపదినం పాటించారు. ఈ సందర్భంగా విద్యాలయాలు, కార్యాలయాలను మూసివేశారు. జాతీయ సెలవుదినం పాటించారు. ప్రతిచోటా మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ ఉద్యమ సమయంలో మరో 1300 మంది గాయపడ్డారు. మరణించినవారిలో ముగ్గురు పోలీసులు కూడా ఉన్నారు. నేపాల్‌లో ప్రధానమంత్రి సుశీల కర్కి సారథ్యంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం ఈ జాతీయ సంతాపదినం నిర్వహించింది. నేపాలీలకు సంఘీభావంగా విదేశాలలో పనిచేస్తున్న వ్యవస్థలన్నీ కూడా మూతపడ్డాయి. నేపాల్ జాతీయ పతాకాన్ని కూడా అవనతం చేశారు. ఈ ఉద్యమ కాలంలో మరణించిన యువకులను త్యాగమూర్తులుగా గడచిన ఆదివారంనాడు సుశీల కర్కి ప్రకటించారు.

ఇదిలా ఉండగా నేపాల్‌లో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకుంటున్నాయి. ఇదిలా ఉండగా నేపాల్‌లో రాజకీయ వాస్తవికతను జనరేషన్ జెడ్ ఉద్యమం పునర్నిర్వచించింది. నిజానికి నేపాల్‌లో ఉద్యమం ఇంకా పూర్తి కాలేదు. కె.పి.శర్మ ఓలి ప్రభుత్వ పతనం, సుశీల కర్కి ప్రమాణస్వీకారం, కొందరు జనరేషన్ జెడ్ నాయకులు ప్రభుత్వంలో మంత్రులుగా చేరడం, పార్లమెంటును రద్దుచేయడంతోనే ఈ ఉద్యమం పూర్తికాలేదు. ఇంకా దేశంలో అవినీతి నిర్మూలన కాలేదు. యువకుల సమస్యలు పరిష్కారం కాలేదు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఇంకా సజావుగా పూర్తి కావాల్సి ఉంది. వాస్తవానికి నిజమైన విప్లవం ఇప్పుడే ప్రారంభమైంది అని నేపాలీ పత్రికలు కొన్ని ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. లక్ష్యాల సాధన దిశగా తాత్కాలిక ప్రభుత్వం అనేక సవాళ్ళను ఎదుర్కోవలసి ఉంది. విద్యార్థి యువజన ఉద్యమం నిర్దేశించిన లక్ష్యాలను గనుక తాత్కాలిక ప్రభుత్వం విస్మరించి వ్యవహరిస్తే కర్కి ప్రభుత్వం తన కాళ్ళను తనే నరుక్కున్నట్లవుతుందని పత్రిక కథనం పేర్కొంది. ఈ ఉద్యమం తర్వాత దేశంలో కొత్త రాజకీయ పరిణామాల దశ మొదలైంది. విదేశాలతో వ్యవహారాల వైఖరి ఏవిధంగా ఉంటుందనేది తెలియదు. విదేశాంగమంత్రి పేరు తెలియలేదు. ఐతే ప్రభుత్వం తాత్కాలిక విదేశీ మంత్రిత్వశాఖను అప్పగించడంతో మాజీ దౌత్యాధికారులను, దౌత్యవేత్తల పేర్లను పరిశీలిస్తున్నది. దేశంలో ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి భారత్, చైనా వంటి పొరుగుదేశాలు సహా అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్, జపాన్, కొరియా వంటి దేశాల సహాయం కూడా ఎంతో కీలకమైనదని ప్రధానమంత్రి భావిస్తున్నారు. విదేశీ పర్యవేక్షకుల మధ్య ఈ ఎన్నికలు జరగాల్సి ఉంది.

## ఇజ్రాయెల్ బహిష్కరణకు కలిసిరండి

ఇరాన్ విదేశాంగమంత్రి పిలుపు



**టెహ్రాన్:** ఇజ్రాయెల్‌ను బహిష్కరించేందుకు అన్ని దేశాలు కలిసి రావాలని ఇరాన్ విదేశాంగమంత్రి ఇస్మాయెల్ బాఘెల్ పిలుపు ఇచ్చారు. బుధవారం టెహ్రాన్‌లో పత్రికాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ ఒక ఉగ్రవాద దేశంగా మారిందని, అన్ని దేశాలనూ ఆక్రమిస్తూ, ఊచకోతలకు పాల్పడుతోందని, అందువల్ల ఆ దేశాన్ని బహిష్కరించేందుకు ఇస్లామిక్, ప్రాంతీయ దేశాలన్నీ కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలకు అంగీకరిస్తే నేరాలను, ఘోరాలను, ఊచకోతలను సమర్థించి, చట్టబద్ధం చేసినట్టే కాగలదని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌కు సమీపంలో ఉన్న దేశాలు, భౌగోళికంగా దానికి అత్యంత దూరంగా ఉన్న దేశాలూ కూడా సంబంధాలు తెంచుకుని వాణిజ్య కార్యకలాపాలను రద్దుచేసుకుంటున్నాయన్నారు. ఐక్యరాజ్యసమితి విచారణ కమిషన్ ఈనెల 15వ తేదీన విడుదల చేసిన నివేదికలో ఇజ్రాయెల్‌ను "సామూహిక హత్యాకాండ"కు పాల్పడిన దేశంగా ప్రకటించింది.



## జపాడ్–2025 మిలిటరీ విన్యాసాల్లో రష్యా, బెలారస్‌తో జత కలిసిన భారత సైన్యం

**మిన్స్క్:** బెలాసర్‌లోని బోరిసోవ్ శిక్షణా ప్రాంగణంలో రష్యా, బెలారస్, భారతదేశాల సైన్యాలు జెపాడ్–2025 వార్ గేమ్ విన్యాసాలు చేశాయి. ఈ సైనిక విన్యాసాలు ఈనెల 16వ తేదీన ముగిశాయి. 'జపా' అంటే రష్యన్ భాషలో 'వెస్ట్' పశ్చి మం అని అర్థం. నాటో కూటమికి వ్యతిరేకంగా, నాటో కూటమి దాడుల నుండి దేశాన్ని రక్షించుకోవడానికి సంకేతంగా ఈ సైనిక విన్యాసాలకు 'జపాడ్–2025 డ్రిల్స్‌గా నామకరణం చేశారు. రష్యా, బెలారస్‌లతో పాటు భారతదేశానికి చెందిన సైనికులు కూడా ఈ విన్యాసాలలో పాల్గొన్నారు. భారత సైనికులు ఈ విధంగా వీరితో కలిసి సైనిక విన్యాసాలలో పాల్గొనడం ఇదే మొదటిసారి కాదు. భారత్ తరపున 65 మంది సైనికులు ఈ విన్యాసాలలో పాల్గొన్నారు. సువిశాలమైన ఈ ట్రైనింగ్ గ్రౌండ్‌లో మూడు దేశాల సైనికులు ముందస్తు విన్యాసాలు చేశారు. విమానాల ద్వారా దాడులు చేశారు. చెక్కలతో నిర్మించిన ఇళ్ళను దాడుల్లో కూల్చివేశారు. బాంబు పొగల మధ్య మూడు దేశాల పతాకాలను ఉమ్మడిగా ఎగురవేశారు. డ్రోన్లు ఎగురవేసి, డ్రోన్ల దాడులను నిలిపివేసి విన్యాసాలు చేశారు. ఈ సందర్భంగా రష్యా సైన్యాలు ఇస్కాందర్ క్షిపణులను లోడు చేసి విన్యాసాలు జరిపాయి. ప్రదర్శన చివరిరోజున రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆకస్మికంగా ఈ విన్యాసాల ప్రాంతాన్ని సందర్శించారు. భారీసంఖ్యలో సైనికులు ఈ విన్యాసాలలో పాల్గొన్నారు. కానీ చాలా అరుదైన రీతిలో పాశ్చాత్య మీడియాను కూడా ఈ వార్ గేమ్ విన్యాసాలను చూడటానికి అనుమతించారు. ఉక్రేన్‌పై 2022 ఫిబవరి నుండి యుద్ధం చేస్తున్న రష్యా గతవారంలో ఉక్రేన్‌పై ప్రయోగించిన డ్రోన్లు దారితప్పి పోలెండ్, రుమేనియా దేశాల సరిహద్దుల్లోకి దూసుకువెళ్లడంతో నాటో కూటమి పెద్ద వివాదానికి తెరలేపింది. తాము ఉద్దేశపూర్వకంగా డ్రోన్లను పోలెండ్, రుమేనియాలపైకి పంపలేదని రష్యా వివరణ ఇచ్చినప్పటికీ నాటో దేశాలు రష్యాను తీవ్రంగా తప్పుపట్టాయి. "అసాధారణ పద్ధతులలో ఈ విన్యాసాలను మేం బహిర్గతం చేశాం, వీటివల్ల ఎవరికీ అపాయం లేదు, తాము ఎప్పుడూ సానుకూల దృక్పథంతో చర్చలకే ప్రాధాన్యం ఇస్తాం" అని బెలారస్‌కు చెందిన సీనియర్ మిలిటరీ అధికారి వాలరీ రెవెంకో చెప్పారు. ఐతే మరోవైపు పొలెండ్ దేశం ఈ విన్యాసాలు జరుగుతున్న బెలారస్ సరిహద్దుల్లో 40,000 మంది సైనికులను మోహరించి అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

## రాష్ట్రాభివృద్ధికి కలిసిరండి

(మొదటి పేజీ తరువాయి)

సామాన్యుడు సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయం ఈ రోజు తాము అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం అని గుర్తు చేసుకున్నారు. సాయుధ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛా పతాకాన్ని 1948, సెప్టెంబర్ 17న ఎగుర వేసిన రోజుగా సిఎం అభివర్ణించారు. ఈ గడ్డపై రాచరికానికి గోరీ కట్టి, ప్రజా పాలనకు హారతి పట్టిన రోజు అని, అందుకే ఇది ప్రజాపాలన దినోత్సవం అని అన్నారు. స్వేచ్ఛ తెలంగాణ జీవన విధానమని, స్వేచ్ఛా సాధనకు ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని జాతి తమదన్నారు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్ధలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు ఈ సందర్భంగా సిఎం ఘన నివాళి అర్పిస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి అని, అలాగే డిసెంబర్ 7, 2023 కూడా స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరో మైలు రాయిగా సిఎం అభివర్ణించారు.

**రైతు సంక్షేమం విషయంలో రాజీపడం:** ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినప్పటికీ రైతుల సంక్షేమం విషయంలో తాము రాజీ పడలేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని, ఈ ఏడాది 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచామన్నారు.

**నీటి వాటాలపై రాజీపడబోం :** కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ జీవనాదుల అని, ఆ నదుల్లో తమకు హక్కుగా దక్కాల్సిన నీటి వాటాలపై రాజీ పడేది లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్ట చేశారు. గత పాలకుల తప్పులను సరిదిద్ది, ప్రతి చుక్క నీటిపై పక్కా హక్కులు సాధించే దిశగా కృష్ణా జలాల విషయంలో న్యాయ పోరాటానికి సిద్ధమయ్యామని, కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన 904 టిఎంసిల వాటాను సాధించేందుకు వ్యూహరచన చేస్తున్నామన్నారు. 2027 డిసెంబర్ 9 నాటికి ఎస్‌ఎల్‌బిసిని ప్రజలకు అంకితం చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**'డ్రగ్స్, గంజాయి'లో రాజకీయ బంధువులనూ వదిలిపెట్టం..:** గంజాయి, డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, ఇందులో రాజకీయ నాయకుల బంధువులు ఉన్నా వదిలిపెట్టబోమని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రాజకీయ నాయకుల హోదాతో ఫామ్‌హౌజ్‌లు కేంద్రాలుగా మారాయని, కొందరు విదేశాల నుంచి వచ్చిన ఇక్కడ శాశ్వితంగా డ్రగ్స్ దందా నిర్వహించాలని చూస్తున్నారని, అలాంటి వారిని కటకటాలకు పంపిస్తామని స్పష్టం చేశారు.

**భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం చెల్లిస్తాం :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారాన్నిఇచ్చి, వారిని ఆదుకుంటామని, రైతులంతా అభివృద్ధికి సహకరించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. స్థలాలు కోల్పోతున్న రైతులను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకురావాలనే కొందరు చేస్తున్న ప్రయత్నాలు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటాయన్నారు. తెలంగాణ అభివృవద్ధి నిరోధకులుగా స్వార్థ రాజకీయంగా పనిచేస్తున్న కొందరి పట్ల తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోకపోతే, ప్రపంచంతో పోటీపడకపోతే భవిష్యత్ తరాల కు మనమే తీరని నష్టం చేసినవారమవుతామని తెలిపారు.

**'మూసీ' ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం**
హైదారాబాద్ మహానగరం తమ బలం, తమ బ్రాండ్ అని, ఈ బ్రాండ్ ను భవిష్యత్ లో ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబెట్టే దీర్ఘకాలిక ప్రణాళికలు రచిస్తున్నామని సిఎం తెలిపారు. మూసీ ప్రాజెక్ట్ ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మూసీ ప్రాంతంలో తెలంగాణ వైతాళికులు, గొప్ప వ్యక్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి వచ్చే వందేళ్ల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారంగా గోదావరి జలాలు తీసుకువస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమయ్యే భారత్ ఫ్యూచర్ సిటీ ఆధునిక ప్రపంచానికి గేట్‌వేగా ఉంటుందన్నారు. ప్రపంచంలోనే గొప్ప నగరం నిర్మిస్తుంటే, ఆ ప్రాంత ప్రజలను రెచ్చగొడుతున్నారని, కొందరిలో అక్కసు, అసూయ మాటలు కనిపిస్తున్నాయని, ఇలాంటి వాటిని తిప్పికొట్టాలని సిఎం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు త్వరలోనే బుల్లెట్ రైలు రాబోతుందన్నారు.

## తాత్కాలికంగా నిలిపేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో జారీ చేశారు. ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శి నంబల కేశవ్ రావు అలియాస్ బసవ రాజు హత్యకు గురైన దాదాపు నాలుగు నెలల తర్వాత ఈ ప్రకటన వచ్చింది. ఇదిలా ఉండగా, ఛత్తీస్‌గఢ్‌లో హోం శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రకటన ప్రామాణికతను ధృవీకరిస్తున్నామని, మావోయిస్టులు లొంగిపోయి పునరావాస ప్రయోజనాలను పొందడమే ఉత్తమ మార్గం అని అన్నారు. యుద్ధం లాంటి పరిస్థితి లేనందున కాల్పు విరమణ అనే పదం చాలా అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చలు షరతులతో కూడుకున్నవి కావని, అయినప్పటికీ వారు మరోసారి ముందస్తు షరతులు విధించారన్నారు. అయితే, ప్రకటనను ధృవీకరించిన తర్వాత ప్రభుత్వంలో చర్చలు జరుగుతాయనిచెప్పారు. మావోయిస్టు లు తమ ప్రకటనలో తాము ప్రభుత్వానికి కాల్పు ల విరమణను ప్రతిపాదించామని, పార్టీ అత్యున్నత నాయకత్వ సహచరులతో సంప్రదించడానికి ఒక నెల సమయం కావాలని కోరారు. కానీ దురదృష్టవశాత్తు, కేంద్ర ప్రభుత్వం దానిపై తన అనుకూల వైఖరిని వ్యక్తం చేయలేదు. బదులుగా, తన కార్యకలాపాలను మరింత తీవ్రతరం చేసిందని పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి (దివంగత బసవరాజు) చొరవతో ప్రారంభించిన శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి, మారిన ప్రపంచ, జాతీయ పరిస్థితుల దృష్ట్యా, అలాగే దేశ ప్రధాన మంత్రి, హోం మంత్రి, సీనియర్ పోలీసు అధికారులు ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని చేస్తున్న నిరంతర అభ్యర్థనల దృష్ట్యా ఆయుధాలను విడనాడాలను నిర్ణయించుకున్నామని ఆ లేఖలో తెలిపారు. భవిష్యత్తులో ప్రజా ప్రయోజనం కోసం పోరాడుతున్న అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలతో వీలైనంత వరకు భుజంభుజం కలిపి పోరాడుతామని స్పష్టం చేస్తున్నామన్నారు.

మావోయిస్టు పార్టీ కేంద్ర సర్కార్‌తో ప్రత్యక్షంగా చర్చలు జపడానికి ముందుకొచ్చిందని, ఈ అంశంపై కేంద్ర హోంమంత్రితో లేదా ఆయన నియమించిన వ్యక్తులతో లేదా ప్రతినిధి బృందంతో మాట్లాడటానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే తమ అభిప్రాయాలకు గురించి తమ పార్టీకి తెలియజేయాలని, అందువల్ల, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న తమ సహచరులతో, జైలులో ఉన్న వారితో సంప్రదించడానికి ఒక నెల సమయం ఇవ్వాలన్నది కేంద్ర ప్రభుత్వా న్ని అభ్యర్థిస్తున్నామన్నారు. ఈ విషయంపై ప్రభుత్వంతో అభిప్రాయాలను పంచుకోవడాని కి ప్రధానంగా వీడియో కాల్ ద్వారా సిద్ధంగా ఉన్నామన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే నెల పాటు అధికారికంగా కాల్పుల విరమణ ప్రకటించాలని, శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని మరోసారి స్పష్టం చేస్తున్నామని మావోయిస్టులు ఆ లేఖలో వెల్లడించారు. అయితే అనేక కారణాలవల్ల ఆలస్యంగా జారీ చేయబడిందని ప్రకటనలో ఒక గమనిక కూడా ఉంది. ఈ ప్రకటనకు ప్రతిస్పందిస్తూ బస్తర్ రేంజ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పి పిటిఐతో మాట్లాడారు. ఆయుధాలు వదులుకోవడం, శాంతి చర్చల అవకాశాలకు సంబంధించి సిపిఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ తరపున విడుదల చేసిన పత్రికా ప్రకటనను పోలీసులు గమనిస్తున్నారన్నారు. అందు లో ఉన్న సారాంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు.

### మావోయిస్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: డాక్టర్ నారాయణ

నక్సల్ గ్రూపులు ఆయుధాలను వదిలి ప్రభుత్వంతో చర్చలకు సంసిద్ధత వ్యక్తం చేయాలని తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) స్వాగ తిస్తోం దని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ తెలిపారు. నక్సల్స్ నిర్ణయం శాంతి, సయోధ్య, ప్రజాస్వామ్య చర్చలవైపు ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. విజయవాడలో బుధవారం మీడియా తో ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటాన్ని విరమించుకోవాలని నక్సల్స్ తీసుకున్న చర్య దీర్ఘకాలిక సమస్యలను ప్రజాస్వామ్య మార్గాల ద్వారా పరిష్కరించు కోవాలనే నిజాయితీగల ఆకాంక్షను ప్రతిబింబిస్తుందన్నారు. నక్సల్స్ నిర్ణయానికి సానుకూలంగా స్పందించడం, చర్చలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, విశ్వాసాన్ని పెంపొందించే చర్యలను నిర్ధారించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యమని ఆయన అన్నారు.

## నూతన విద్యాపాలసీ రూపకల్పనను స్వాగతిస్తున్నాం

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వం రాష్ట్ర నూతన విద్యాపాలసీ రూపకల్పన చేయనుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించడంఎఐఎస్‌ఎఫ్ స్వాగతిస్తోందని రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ తెలిపారు. నూతన విద్యా పాలసీ ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో విద్యారంగంలో ఉన్న లోపాలను గుర్తించి సమూల మార్పులను చేయడం ద్వారా విద్యారంగ అభివృద్ధికి ఈ పాలసీ దోహదపడుతుందని భావిస్తున్నామని వారు పేర్కొన్నారు. అయితే రాష్ట్ర విద్యా పాలసీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020 కి భిన్నంగా రాష్ట్ర పాలసీ ఉండాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఎన్ఇపి 2020 ద్వారా ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యం అయ్యే పరిస్థితులు ఉన్నాయని,బడ్జెట్ లో విద్యకు నిధుల తగ్గింపు, కార్పొరేట్ విద్యా వ్యవస్థ అనుకూలంగా, పాఠ్యాంశాల్లో మతోన్మాద చరిత్రలు పెట్టడం, ప్రభుత్వ పాఠశాలల, అంగన్‌వాడీల విలీనం చేసేలా ఉన్న ఆ నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర విద్యా పాలసీ ఉండాలన్నారు. రాష్ట్ర విద్యా పాలసీ రూపకల్పనపై విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాలు,అందరితో చర్చించి రూపకల్పన చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ కోరారు.

## ట్రంప్‌కు నిరసన సెగ

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్ ఎగ్జిక్యూటివ్ మిఛెల్లే (32) ఎఫ్‌ఎఫ్‌పి వార్తాసంస్థతో మాట్లాడుతూ, ట్రంప్ బ్రిటన్ పర్యటన తనకు ఇష్టం లేదని, ఆయన రాకతోపాటు బ్రిటన్ పాలకులకు ఆయనకు ఎర్ర తివాచీలు పరచి స్వాగతాలకు సిద్ధం కావడంపట్ల తామెంతో అసంతృప్తికి గురయ్యామని విమర్శించారు. వలసలకు వ్యతిరేకంగా మితవాద నాయకుడు టమ్మీ రోబిన్సన్ 1.10 లక్షలమందితో సెంట్రల్ లండన్‌లో ప్రదర్శన జరిపిన నాలుగురోజుల తర్వాత మిఛెల్లే ఈ వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య చర్చలు, అంతర్జాతీయ అంశాలపై చర్చల నిమిత్తం మంగళవారం రాత్రికే ట్రంప్ లండన్ చేరుకుని విన్‌ఫీల్డ్ హౌస్‌లో బసచేశారు. గాజాలో యుద్ధాన్ని పెంచిపోషించడమే కాకుండా వలస ప్రజలపట్ల ట్రంప్ అమానుష ప్రవర్తనపై బ్రిటన్‌లో తీవ్ర వ్యతిరేకత ఉంది.ఆయనను విమర్శిస్తూ పోస్టర్లు వెలిశాయి. అమెరికా సెక్స్ అఫెండర్, ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్స్టీన్, ట్రంప్ ఇద్దరి పోస్టర్లను విండ్సార్ క్యాజిల్ భవంతి గోడలకు నిరసన ప్రదర్శకులు అంటించారు. ఈ పోస్టర్లు అంటించిన కేసులో నలుగురు నిందితులను బ్రిటన్ పోలీసులు అరెస్టు చేశారు. ట్రంప్‌ను నిశితంగా విమర్శిస్తూ ప్రదర్శకులు ప్లకార్డులు ప్రదర్శించారు. ట్రంప్ బ్రిటన్‌కు రాకముందే నిరసన ప్రదర్శకులు తమ అభిప్రాయాలను ఆయన దృష్టికి తెచ్చేందుకు సిద్ధమయ్యారు. అమెరికాలో ట్రంప్ సహా పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, వ్యాపారుల రాసలీలలకు సంబంధించి జెఫ్రీ ఎప్స్టీన్ తయారు చేసిన జాబితాను విడుదల చేయకూడదని అమెరికా న్యాయశాఖ తీసుకున్న నిర్ణయం ట్రంప్ ప్రోద్బలంతోనే జరిగిందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్న తరుణంలో బ్రిటన్‌లో కూడా ఆయనకు ఈ వివాద విమర్శలే ఎదురయ్యాయి. ట్రంప్‌తోపాటు ఆయన భార్య మెలనియా ట్రంప్‌కు విండ్సార్ క్యాజిల్ వద్ద బ్రిటన్ రాజు ఛార్లీ త్రీ, రాణి కేమెల్లా, యువరాజు విలియం, యువరాణి కటేలు స్వాగతం పలకడంతో వారి బ్రిటన్ పర్యటన ప్రారంభమైంది.

## ప్రధాని మోదీకి 75 ఏళ్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ఇస్తున్నారని ప్రశంసించారు. భారత్–రష్యా దేశాలమధ్య స్నేహ బంధాన్ని పటిష్టం చేయడంలో నరేంద్రమోదీ వ్యక్తిగతంగా ఎంతో గొప్ప కృషి చేశారని పుతిన్ తన సందేశంలో పేర్కొన్నారు. "గొప్ప పరిపాలనాధిపతిగా, మీ కార్యకలాపాల ద్వారా ప్రపంచ వేదికపై మీరు గొప గౌరవాన్ని సంపాదించుకున్నారు" అని పుతిన్ క్రెమ్లిన్ వెబ్‌సైటు ద్వారా సందేశం పంపారు.
ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా అభినందనలు తెలియజేస్తూ, ఆయనను ప్రియనేస్తంగా అభివర్ణించారు. భారతదేశం కోసం మీ జీవితంలో చాలా చేశారు, భారత్,ఇజ్రాయెల్ మధ్య మనిద్దరం కలిసి ఒక ఒప్పందం చేసుకుని మైత్రి సాధించామన్నారు. రెండు దేశాలమధ్యా స్నేహాన్ని ఇంకా ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాలని తాను ఎదురుచూస్తున్నానని ఆయన పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ అభినందనలు తెలియజేస్తూ, మంచి ఆరోగ్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భారతదేశ అభివృద్ధికి, ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఆయన దోహదపడాలని కోరారు. బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి రిషి సునక్ ఒక సందేశంలో ఆయనకు అభినందనలు తెలియజేయడం తనకొక గొప్ప గౌరవమన్నారు. 2023లో జి–20 సదస్సుకు భారత్‌కు వచ్చినప్పటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. మోదీ మంత్రివర్గ సభ్యులు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఇంకా న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లగ్జన్, మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లేంగ్, గుయానా అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ, డొమినికా ప్రధానమంత్రి రూజ్వెల్ట్ స్కెరిట్ తదితరులు అభినందనలు పంపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఐక్యంగా పోరాడాలి: కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ పిలుపునిచ్చారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను కోదండరామ్ బుధవారం ఎగురవేశారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' సెప్టెంబర్ 17న' తెలంగాణ చరిత్రలో ఒక కీలక రోజు అని, ప్రజలు ఫ్యూడల్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక మార్పు కోసం సుదీర్ఘ కాలం పోరాటం సాగించారని గుర్తు చేశారు. ఆ పోరాట ఫలితంగానే నిజాం పాలన అంతమొంది, హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైందన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు గోపగాని శంకరావు, బైరి రమేష్, పల్లె వినయ్, నిజ్జన రమేష్, ఆశప్ప, ఎం. నరసయ్యగౌడ్, సర్దార్ వినోద్, హనమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట

## చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి



సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాలను తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, ఈ సమరంలో అసువులు బాసిన అమర వీరులను బిజెపి హైజాక్ చేసే ప్రయ్నతం చేస్తూ కొత్త నినాదాలతో చరిత్రను వక్రీకరించడం గర్హనీయమని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 77వ వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం జాతీయ పతాకాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, అరుణ పతాకాన్ని కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ భూస్వాములు, వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నాటి మహత్తర ఉద్యమాన్ని బిజెపి హిందూ, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని చరిత్ర క్షమించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్యపద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ల పల్లి శ్రీనివాస రావు, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గోదా శ్రీరాములు, ఆర్.అంజయ్య నాయక్, కలకొండ కాంతయ్య, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, కె.ఏసురత్నం, బి.ఆర్.ఎస్ మోహన్‌రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ కలలను నిజం చేయడానికి మోదీ కృషి

కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్థత వల్లే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలిసిందన్న రక్షణమంత్రి పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సెప్టెంబర్ 17ను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినంగా నిర్వహించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పరేడ్ మైదానంలోని అమర జవాన్‌ల స్మృతి స్థల్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సర్దార్ వల్లభాయ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. భద్రతా బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారన్నారన్నారు. నిజాం ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారని గుర్తుచేశారు. ఆపరేషన్ పోలోతో సర్దార్ పటేల్ ఎంతో ముందుచూపుతో వ్యవహరించారన్నారు. పటేల్ కలలు కన్న దేశాన్ని నిర్మించేందుకు మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ ఆదేశాలతో విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ అన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17న కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పేర్లు మార్చి వేడుకలు నిర్వహిస్తున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా చొరవ వల్లే కేంద్రం తెలంగాణ విమోచన వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపి ఈటల రాజేందర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పికెట్ పార్క్‌లో ఏర్పాటు చేసిన వాజ్‌పేయ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

## పటేల్‌ను అవమానిస్తున్న బిజెపి

తెలంగాణ విలీన దినోత్సవంలో టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏ చరిత్ర లేని బిజెపికి ఇతరుల చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ విలీనం దినోత్సవ ఉత్సవాలను బుధవారం గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మహేశ్ కుమార్ మాట్లాడుతూ ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు విలీనం దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు.తెలంగాణ రాష్ట్ర విలీనానికి కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన రామనంద తీర్థ, జమాలపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పివి నరసింహరావులతో పాటు నిజాం వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, కమ్యూనిస్టు యోధులను స్మరించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అన్నారు.1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ పోలో ద్వారా నాలుగు రోజుల్లో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. కానీ, నేడు అదే పటేల్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఆయన చేసిన విలీనాన్ని విమోచనగా పిలవడం పటేల్ ను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. బిజెపికి గాంధీ అంటే పడదని ఆయనను హత్య చేసిన గాడ్సే మాత్రం దేవుడన్నారు. ఆపార్టీ 1980లో పుట్టిందని, స్వాతంత్ర్యం, తెలంగాణ విలీన పోరాటాలకు సంబంధం లేనిదని ఎద్దేవా చేశారు. ఇప్పుడున్నది పాతబిజెపి కూడా కాదని, 2014లో పుట్టిన మోడీషా బిజెపి అన్నారు.. వీరికి చరిత్ర తెలియదు, చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసు. గాంధీని గౌరవించరని, గాడ్సేను దేవుడిగా చూసే వారి నుండి దేశభక్తి ఆశించడం వృథా ప్రయాసగా అభివర్ణించారు. బీహార్‌లో ఓటు దోపిడీ ప్రయత్నాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ నడిపిస్తున్న ఓటు చోరీ ఉద్యమం బిజెపి గుండెల్లో వణుకు పుట్టిస్తున్నదని తెలిపారు.

## దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం

విజన్ డాక్యుమెంట్ 2047లో విద్యా విధానానికి ప్రత్యేక అధ్యాయం

విద్యా రంగం సమూల ప్రక్షాళనే ధ్యేయం..

తెలంగాణ విద్యా విధానంపై సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్షేత్రస్థాయి పరిస్థితులు, అధ్యయ నం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం (టిఈపి) భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదు. జ్ఞానం ఉన్న చోట భాష లేదు. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవు. కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలి" అని సిఎం చెప్పారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై సమావేశాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. సమావేశం లో సిఎం మాట్లాడుతూ తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం, నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని, ఇప్పుడు పంపకానికి భూము లు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సిఎం అన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆ స్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణం గా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సిఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు. విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ఏ ఏటికి ఆ ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాథమిక దశ నుంచి యూనివర్సిటీల వరకు సమూల ప్రక్షాళన చేయాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని సిఎం అన్నారు.

డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని సిఎం వెల్లడించారు. ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకుని ఇందులో ఉన్న విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలని సిఎం కోరారు. తెలంగాణ విద్యా విధానం రూపకల్పన కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు మాట్లాడుతూ విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో తాము విస్తృత సంప్రదింపులు చేశామన్నారు. గణాంకాల కన్నా నాణ్యత ప్రధానమని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు. ఎఐ వంటివి ఎన్ని వచ్చినా అవి గురువుకు ప్రత్యామ్నాయం కావన్నారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు దేశ యువతలో మూడో వంతు 'ఎన్‌ఈఈటి'గా ఉన్నారని, దాని అర్థం 'నాట్ ఇన్ ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్' అని ఓ సర్వే తేల్చిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాము స్టార్టప్లను ప్రోత్సహిస్తున్నామని, ఒక్క ఏడాదిలో 180 పేటెంట్లు పొందామన్నారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ విద్యా విధానం కొలువుల సాధనకే కాకుండా అత్యుత్తమ మానవునిగా తీర్చిదిద్దేదిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఎల్‌సిలు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎ.వి.ఎన్.రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ సుబ్బారావు, సిఐఐ శేఖర్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, అక్షరవనం మాధవరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ గంగాధర్, విశ్రాంత ఐఎఎస్‌లు మిని మాథ్యూ రంజీవ్ ఆచార్య, ప్రొఫెసర్ శాంతా సిన్హా తదితరులు మాట్లాడారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సిఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, అధికారులు జయేశ్ రంజన్, శ్రీదేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## మరో నిజాంలు.. మోదీ, అమిత్‌షా, భాగవత్

తెలంగాణ పోరాట ఉత్సవాల ముగింపు సభలో సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి ఎంఎ బేబి




**ప్రజాపక్షం/జనగామ :** మరో నిజాంలు ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమీత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత భగవత్‌లు అని సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి ఎంఎ బేబి మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, హైదరాబాద్ విలీనం గురించి తెలంగాణ గడ్డపై మాట్లాడే నైతిక హక్కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాల ముగింపు సభ జనగామ జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ పాఠశాల ఆవరణలో బుధవారం జరిగింది. ఈ సభకు జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి ఎంఎ బేబి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆనా డు నిజాం జాగీర్, జమీందార్, భూస్వాములకు అనుకూలంగా ఉన్నట్లే నేడు ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమీత్‌షా, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత భగవత్‌లు అదానీ, అంబానీలకు అండగా ఉన్నారన్నారు. అస్సాం లో వేల ఎకరాల భూముల్ని అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని, ఇందు కోసం పార్లమెంట్ లోనే ఆర్‌ఎస్‌ఐఆర్ పేరుతో చట్ట సవరణ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులిమి లబ్ధి పొందాలని బిజెపి చేస్తుందని, ఆ పోరాటంతో ఏమాత్రం సంబందంలేని బిజెపి తెలంగాణ గడ్డపై ఎలా మాట్లాడుతుంది, రాజ్‌నాథ్‌కు మాట్లాడే హక్కు ఎక్కడిదని మండిపడ్డారు. నిజాం నవాబు ముస్లింలు ఆయనపై హిందువులు తిరగబడ్డారంటు ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేయడం సరియైంది కాదన్నారు. నెహ్రూ, వల్లబాయ్‌పటేల్‌లు కేంద్ర బలగాలను మోహరింపజేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచివేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి గొప్ప చరిత్ర ఉంది, ఆనాడు ప్యారిస్‌లో శ్రామికులు పోరాటం చేసి 70 రోజుల పాటు పరిపాలన సాగించారని తెలంగాణ పోరాటం ప్యారిస్‌కు మించిందని, ఇక్కడి పోరాటంలో 4వేల మంది చనిపోగా 10లక్షల ఎకరాల భూమి పంచబడిందన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున భూములు పంచిందని, అక్కడ ప్రభుత్వం పంచితే అంతకంటే గొప్పగా తెలంగాణలో కమ్యూనిస్టులే భూములు పంచారన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిన రోజు:కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి తెలంగాణ బిడ్డలు అడుగుపెట్టిన రోజు అని, దీనిని కొందరు విమోచనమని, మరి కొందరు విలీనం అని అన్నప్పటికీ వేలాది మంది ఆనాటి రాచరిక వ్యవస్థపై పోరాటం చేసి ప్రాణాలు అర్పించారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. 'సెప్టెంబర్ 17' సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కెటిఆర్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ అంటేనే త్యాగాల గడ్డ, పోరాటాల అడ్డ అని, ఆనాటి సాయుధ రైతాంగ పోరాటం నుంచి మొదలుకుని 1969 తెలంగాణ ఉద్యమం, ఆ తర్వాత జరిగిన కెసిఆర్ ఆధ్వర్యంలోని ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమం ఇలా అన్ని ఉద్యమాలను తెలంగాణ చూసిందన్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగి, రావి నారాయణరెడ్డి లాంటి అద్భుతమైన అమరవీరులను తెలంగాణ కన్నదన్నారు. ఆనాటి పోరాట యోధుల త్యాగాల సాక్షిగా తెలంగాణ బిడ్డలు మరోసారి పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.



సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవమేనని తెలంగాణ జాగృతి ఆధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధులు ఎం.కె.మొయినుద్దీన్‌ను సత్కరించారు.

### తెలంగాణ సాయుధ పోరాటసేనాని

## రావి నారాయణరెడ్డి విగ్రహావిష్కరణ




**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ సాయుధ పోరాట సేనాని నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యులు రావి నారాయణరెడ్డి స్వగ్రామం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో ఆయన విగ్రహాన్ని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ హన్మంతరావు ఆవిష్కరించారు. అనం తరం సభలో సిపిఐ ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రను బిజెపి వక్రీకరిస్తే తెలంగాణ సమాజం సహించదని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొనటువంటి బిజెపి నాయకులు ఆ చరిత్రను వక్రీకరించే విధంగా నాడు జరిగిన పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించి మతం రంగు పూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కొరకు భుక్తి కొరకు వెట్టి చాకిరి విముక్తి కొరకు భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం అని వివరించారు. విసునూరు రామచంద్రారెడ్డి, దేశ్ముకులు కొనసాగించిన ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటానికి మతం రంగు పూసి బిజెపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి నాయకత్వంలో జరిగిన సాయుధ పోరాటంతోనే తెలంగాణకు నిజాం పాలన నుంచి విముక్తి జరిగిందన్నారు. రావి నారాయణరెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ తన జీవితాన్ని పేద ప్రజలకే అంకితం చేశారని కొనియాడారు. తనకు సంబంధించిన వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికల సంక్షోభ సమయంలో కూడా నిటారుగా నిలబడి కడవరకు కమ్యూనిస్టుగా జీవించారని తెలిపారు.

## మావోయిస్టులు నిరాయుధులవుతారా..

లేఖపై సర్వత్రా చర్చ.. భిన్నాభిప్రాయాలు

అభయ్ పేరిట మరో ఆడియో

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారతదేశంలో సుదీర్ఘ కాలం సాయుధ పోరాటాన్ని నడిపిన పార్టీ సాయుధ పంథాను వీడనాడేందుకు సంసిద్ధమని ప్రకటిస్తున్నట్లు వచ్చిన లేఖపై సర్వత్రా చర్చ సాగుతుంది. కేంద్ర ప్రభుత్వ వైఖరితో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటున్న మావోయిస్టులు గత నెల 15న అభయ్ అలియాస్ మల్లోజుల వేణుగోపాల్ విడుదల చేసినట్లు చెబుతున్న లేఖ నిజమైనదేనా లేక వ్యూహ, ప్రతివ్యూహాలలో భాగమా అన్నది ముందు తేలాల్సి ఉంది. వరుస ఎదురుదెబ్బలు తగులుతుండటం, దశాబ్దాల ఉద్యమ చరిత్ర కలిగి ఉద్యమాన్ని నడిపించిన వారు, దన్నుగా నిలిచిన వారు ఎన్‌కౌంటర్లలో మరణించటమో లేక లొంగిపోవటమో జరుగుతుంది. సైనిక బలగాలు దండకారుణ్యాన్ని జల్లెడ పడుతున్న వేళ ఈ లేఖ కలకలం రేపింది. మావోయిస్టులు ఏనాడు ఫొటోతో లేఖ విడుదల చేయలేదు. మావోయిస్టులు లేఖలను గత కొంతకాలంగా నేరుగా మీడియా వ్యక్తులకు, సంస్థలకు పంపుతున్నారు. నెల రోజుల క్రితం రాసినట్లు చెపుతున్న లేఖ మంగళవారం రాత్రి ఎలా ప్రత్యక్షమైంది అన్నది ఒక ప్రశ్న. అందులో భాష కూడా మావోయిస్టుల సాంప్రదాయ భాష కాదని పరిశీలకులు భావిస్తున్నారు. ఆయుధాలు వదిలివేయాలన్న నిర్ణయం పార్టీలో జరిగి ఉంటే నెల రోజుల తర్వాత కూడా ఎందుకు సాయుధులుగా మావోయిస్టులు పోరాడుతున్నారనే ప్రశ్న తలెత్తుతుంది. ఆ లేఖలో నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రస్తావన కూడా వచ్చింది. బసవరాజు కూడా నిరాయుధికరణ వైపు ఆలోచన చేశాడని పేర్కొన్నారు. కానీ బసవరాజు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు మూడు లేఖలను విడుదల చేసినప్పటికీ ఆ లేఖల్లో ఎక్కడ నిరాయుధికరణ ప్రస్తావన లేదు. మార్చి 28న, ఏప్రిల్ 25న, మే మాసంలోనూ మావోయిస్టులు లేఖలను విడుదల చేసినప్పటికీ అందులో కూడా ఆయుధాలు వదిలేస్తామన్న ప్రస్తావన లేదు. మావోయిస్టులకు వ్యతిరేకంగా సైనిక చర్యలను నిలిపి వేయాలని తర్వాత చర్చలు జరపాలన్న డిమాండ్‌తో ఒక లేఖ విడుదలైంది. ఆ లేఖలో ప్రభుత్వం కాల్పులను నిలిపివేయాలని, షరతులు లేకుండా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆ లేఖలు రూపేష్, అభయ్ పేర్లతో విడుదలయ్యాయి. అయితే ఈ ఏడాది ప్రారంభం నుండి శాంతి చర్చలకు మావోయిస్టులు సిద్ధమన్న వార్తలు వెలువడ్డాయి. అయితే ఆయుధాలు వదిలితేనే మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.



2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను తుదముట్టిస్తామన్న ప్రకటనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఆ తర్వాత పలు ప్రకటనలు వెలువడ్డాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టుల నిరాయుధికరణ ప్రకటన లేఖ మావోయిస్టులు విడుదల చేసిన లేఖగా భావించడం లేదు. పోలీసులు సైతం ఇది మావోయిస్టులు రాసిన లేఖే అని ధృవీకరించడం లేదు. మావోయిస్టు ప్రతినిధి బృందం కేంద్ర ప్రభుత్వం పంపిన ప్రతినిధి బృందంతో చర్చించేందుకు సిద్ధమని లేఖలో ప్రకటించడం కూడా చర్చకు తావిస్తున్నది. అదేవిధంగా వెబ్‌సైట్ ప్రకటించడం మావోయిస్టు పంథా కాదని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మావోయిస్టు పార్టీ బాధ్యుడు అభయ్ పేరుతో ఒక ఆడియో విడుదలైంది. ఆ ఆడియోలోనూ నిన్న లేఖలో పేర్కొన్న అంశాలనే పేర్కొన్నారు. ముప్పేట సవాళ్లను ఎదుర్కొంటున్న మావోయిస్టు సాయుధ పోరాట కొనసాగింపు కేంద్ర బలగాల మోహరింపు నిరంతర కూంబింగ్ వీటన్నింటి పైన చర్చ సాగుతున్న వేళ మావోయిస్టులు విడుదల చేసినట్లు చెబుతున్న లేఖ మరో చర్చ మాత్రమే తప్ప మరొకటి కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: కూకట్‌పల్లి సర్కిల్-24**

Lr No. 15/GHMC/KPC-24/EE/2025-26 టెండర్ ప్రకటన తేది: 16.09.2025

**NIT No.** 15/GHMC/KPC-24/EE/2025-26; తేది: 16.09.2025. **పని పేరు:** నిర్వహణ పని, **అంచనా విలువ :** NA, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 18.09.2025న ఉ.11.30గం.ల నుండి 25.09.2025న ఉ.11.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, సెల్: 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 8220-PP/CL/ADVT/1/2025-26, Date: 17-09-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
గాజులరామారం సర్కిల్-26

**NIT No. 15/DB/EE/GJRM/CIRCLE-26/KPZ/GHMC/2025-26, తేది: 16.09.2025**

**పని పేరు:** జెసిబి వైబ్రేటరీ మినీ టెన్డం రోలర్ సేకరణ & బోర్‌వెల్ డ్రిల్లింగ్, **అంచనా విలువ :** రూ.23.80 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 18.09.2025న మ.03.30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 26.09.2025న మ.03.30గం.ల వరకు. ఇఇ **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-26, జిహెచ్‌ఎంసి. సెల్: 9849906776. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 8243-PP/CL/ADVT/1/2025-26, Date: 17-09-2025

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ ఫ్లోర్, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

పబ్లిక్ నోటిఫికేషన్ HMDA చట్టం 2008 యొక్క U/s. 15(4) ప్రకారం

**(G.O.Ms.No. 189 MA & UD Dept., తేదీ: 10.09.2025)**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 ( 2008 చట్టం నెం.8) లోని సెక్షన్ సబ్ సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం G.O.Ms. No. 33 MA & UD, తేదీ: 24.01.2013ద్వారా ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ MDP-2031 ప్రకారం ఊహించిన భూవినియోగానికి, ఆ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరమైన విధంగా ఈ క్రింది మార్పును చేస్తున్నది.

**ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్‌ప్లాన్ MDP-2031 ప్రకారం G.O Ms. No.33 MA & UD, తేదీ 24.01.2013ను ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మాస్టర్‌ప్లాన్ MDP-2031 ప్రకారం G.O.Ms.No.106 సమ్మతికి లోబడి తేదీ:06-07-2020న నీటిపారుదల శాఖ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లు జారీచేసిన NOCల ఆధారంగా సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరువు మండలం, ఇంద్రేశం గ్రామం వద్ద నెలకొని ఉన్న సర్వే నెంబర్లు 126, 129, 130/P & 132/P లను 23.34 ఎకరాల మేరకు నివాస వినియోగ జోన్‌గా రీనోటిఫికేషన్ చేయడమైనది.**

పైన పేర్కొన్న దానికి సంబంధించిన వివరాలు వెబ్‌సైట్లు http://gazette.telangan.gov.in// మరియు http://hmda.gov.in//.లో అందుబాటులో ఉన్నాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (MK) హెచ్‌ఎండిఎ

DIPR R.O. No. : 8257-PP/CL/ADVT/1/2025-26, Date: 17-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## స్పోర్ట్స్ అకాడమీలో వేడుకలు..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశం మొత్తం అందరికీ 1947 ఆగస్టు 15 నాడు స్వాతంత్రం లభిస్తే నిజాం పాలనలో ఉన్న మనకు 13 నెలల తర్వాత 1948 సెప్టెంబర్ 17న నాడు విముక్తి లభించిందని స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఎల్‌బిస్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి మాట్లాడుతూ క్రీడాకారులందరికీ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు కోచులు సిబ్బంది క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మధుయాష్కి గౌడ్‌కు సిఎం పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ అస్వస్థతకు గురై గచ్చిబౌలిలోని ఎఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నుండి ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మధుయాష్కి సచివాలయంలో అస్వస్థతకు గురైన వెంటనే సిఎం స్పందించి, ఆసుపత్రికి తరలించే వరకు తన సిబ్బందితో సమన్వయం చేశారు. అలాగే ఎఐజి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డితో మాట్లాడి ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలా సూచించారు. బుధవారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి నేరుగా మధుయాష్కికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తనపై చూపిన శ్రద్ధకు మధుయాష్కి గౌడ్ సిఎంకి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు ఫోన్ ద్వారా పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, రచయిత ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పి.వినయ్ కుమార్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరవత్రి అనిల్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజమతుల్లా, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావు తదితరులు ఎఐజి ఆసుపత్రికి వెళ్లి మధుయాష్కి గౌడ్‌ను పరామర్శించారు.



## ఇవిఎం గోదాం పరిశీలన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ బుధవారం చుడి బజార్‌లోని ప్రధాన ఈవిఎం గోదాంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాం లోపల నిల్వ ఉన్న వస్తువుల భద్రతా ఏర్పాట్లు, స్థితిగతులు, స్టాక్ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అలాగే సిసి కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థను సమీక్షించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## చేవెళ్ల విద్యుత్ ఎడిఇ ఇంట్లో ఎసిబి సోదాల కలకలం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిలాల్లోని చేవెళ్ల విద్యుత్ ఎడిఇ రాజేశాబాబు ఇంట్లో ఎసిబి సోదాల విషయంతో చేవెళ్లలో కలకం రేపింది. పది నెలల కిత్రం పదోన్నతిపై చేవెళ్ల విద్యుత్ ఎడిఇ గా వచ్చిన రాజేశాబాబు ఇంట్లో బుధవారం ఎసిబి అధికారులు సోదాలు చేశారు.ఎడిఇ ఇంట్లో ఎసిబి సోదాలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలతో చేవెళ్లలో చర్చనీయాంశంగా మారింది.రాజేశాబాబు మొయినాబాద్ మండలంలోని చిలుకూరు విద్యుత్ ఎఇ గా పనిచేస్తూండగా పదోన్నతిపై చేవెళ్ల ఎడిఇ గా వచ్చారు.ఎసిబి రైడ్ మణికొండ ఎడిఇ అంబేద్కర్ పట్టుబడటంతో ఆయన బినామిగా చేవెళ్ల ఎడిఇ రాజేశ్ బాబు ఉన్నట్లుగా ఆధారాలు లభించటంతో సికింద్రాబాద్ లోని మారేడుపల్లిలో ఆయన నివాసం ఉండే ఇంట్లో సోదాలు చేయగా బాత్రూంలో 20 లక్షలరూపాయల నగదు లభించినట్లుగా సమాచారం. ఈవిషయం బయటకు రావటంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. చేవెళ్ల విద్యుత్ కార్యాలయానికి రెండురోజులుగా రావటం లేదని తెలిసింది. చిలుకూరులో ఎఇ గా పని చేసిన సమయంలో అతనిపై అనేక ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది.అక్కడే ఎఇ గా విధులు నిర్వహిస్తున్న సమయంలోనే మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లిలో 10 గుంటల భూమి,హిమాయత్ నగర్ లో ఓప్లాటు కూడా ఆయన కొనుగోలు చేసినట్లు సమాచారం.చేవెళ్లలో కూడా అతనిపై ఆరోపణలు ఉన్నట్లుగా వినిపిస్తున్నాయి.

## హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషి

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రశ్రేణి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రజా పాలనకు నాంది పలికిందని మేయర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్లు కె. వేణుగోపాల్, గీతా రాధిక, చీఫ్ సిటీప్లానర్ కె. శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజి పిసిబి) ప్రధాన కార్యాలయం, సనత్‌నగర్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అన్నారు. ప్రజల సాధకబాధలను అర్థం చేసుకుని సమస్యలను పరిష్కరించే విధంగా అందరూ కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. హైడ్రా కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# గ్రూప్–1పై అప్పీల్‌కు..



### పదేళ్లుగా నియామకాల్లేవు.. నిరుద్యోగులకు తీరని నష్టం
### సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయండి.. తక్షణమే స్టే ఇవ్వండి
### టిజిపిఎస్‌సి అప్పీల్ పిటిషన్ దాఖలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రూప్–1 పోస్టుల భర్తీ ప్రక్రియకు న్యాయపరమైన అవరోధం తొలగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తరపున అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి (లీగల్) ఆర్.సుమతి హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 9వ తేదీన సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ బుధవారం అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన పరమేశ్ మట్టా మరో 221 మంది అభ్యర్థులను ప్రతివాదులుగా చేర్చింది. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టిక్కెట్లు ఇవ్వడం కరెక్టే. ఇది యూపీపీఎస్సీ రూల్స్‌కు వ్యతిరేకమన్న వాదన తమకు వర్తించదు. ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే చాలా మందికి ఒకే తరహా మార్కులు రావడం సహజమే. కోఠిలో మహిళా కాలేజీ పురుషులకు విడిగా టాయిలెట్స్ లేకపోవడంతో అక్కడ పూర్తిగా మహిళలకు కేటాయింపు జరిగింది. 45 సెంటర్స్‌ను 46కు పెరగడానికి కారణం ఉంది. దివ్యాంగుల కోసం ఎంపిక చేసిన కేంద్రం ఎత్తుగా ఉన్నందున మరో కేంద్రం ఏర్పాటు జరిగింది. మూల్యాంకనం రెండుసార్లు చేశాక మార్కుల్లో వ్యత్యాసం 15 శాతం కంటే ఎక్కువ ఉంటే మూడోసారి మూల్యాంకనం జరిగింది. సింగిల్ జడ్జి ఎవరూ లేవనెత్తని అంశాల్లోకి అలా ళ్లారు. తీర్పు సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకం. దీనిని రద్దు చేయాలి.. అని అప్పీల్ పిటిషన్‌లో టిజిపిఎస్‌సి కోరింది. పూర్తి వివరాలు..

గత పదేండ్లుగా గ్రూప్ 1 పోస్టు నియామకాలు జరగలేదు. లక్షలాది మంది నిరుద్యోగ యువత ఆశలు ఆవిరి కాకుండా చేయాలి. అనేకసార్లు గ్రూప్–1 నియామకాలకు వివిధ కారణాల రీత్యా కోర్టుల్లో బ్రేక్ పడుతూ వచ్చింది. దీంతో యువత అవకాశాలు కోల్పోతున్నారు. పరిపాలనలో అత్యంత కీలకమైన స్థాయిలో అధికారుల కొరత ఏర్పడి ప్రభుత్వ పనితీరు దెబ్బతింటోంది. గ్రూప్–1 అధికారుల సేవలు రాష్ట్రానికి ఎంతగానో ఉంది. 2022 నుంచి వివాదాల దారిలోనే గ్రూప్ 1 నియామకాల వ్యవహారం ఉంది. గ్రూప్–1 నియామకాలు 2011 తర్వాత జరగలేదు. అప్పటి నుంచి నిరుద్యోగులు నియామకాలు జరుగుతాయని చెకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 2022 ఏప్రిల్‌లో గ్రూప్–1 పోస్టుల భర్తీకినోటిఫికేషన్ (04/2022) వెలువడింది. 503 పోస్టుల నియామకం చేయాలని నిర్ణయించింది. తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం మరో 60 పోస్టులు చేర్చి మొత్తం 563 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. తొలి నోటిఫికేషన్ కంటే పోస్టుల సంఖ్య పెంపు చెల్లదంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టు/సుప్రీం కోర్టుల వరకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. అయితే, ఈ న్యాయ వివాదాల కారణంగా గ్రూప్–1 పరీక్షల షెడ్యూల్ వాయిదా పడింది. 2024 ఫిబ్రవరి 19న వెలువడిన తొలి నోటిఫికేషన్‌కు బదులుగా కొత్త నోటిఫికేషన్ (02/2024) ప్రకారం 563 ఖాళీల భర్తీకి టీజీపీఎస్సీ చర్యలు ఉపక్రమించింది. గత ఏడాది (2024 మధ్యలో) ప్రిలిమినరీ పరీక్షలు పూర్తి అయ్యాయి. 2025 ఏప్రిల్ 9న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, అర్హులైన అభ్యర్థుల జాబితాను కమిషన్ విడుదల చేసింది. టీజీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలను సమర్ధంగా నిర్వహించింది. మూల్యాకనం కూడా శాస్త్రీయ విధానాలతోనే నిర్వహించింది. టీజీపీఎస్సీ చర్యలు పూర్తిగా పారదర్శకంగా, చట్టపరంగానే ఉన్నాయి. నోటిఫికేషన్ దశలోనే కేసులు కొనసాగిన నేపథ్యంలో కొంతమంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షల నిర్వహణను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు గత ఏప్రిల్ 16న మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగించవచ్చని, అయితే, తుది ఫలితాలను ప్రకటించరాదంటూ మధ్యంతర ఆదేశాలను వెలువరించింది. ఇవి అమల్లో ఉండగానే హైకోర్టు, ఈ నెల 9వ తేదీన కీలక తీర్పును వెలువరించింది. తుది మెరిట్ లిస్టును రద్దు చేసింది. సమాధాన పత్రాలను మోడరేషన్ విధానంతో మళ్లీ మూల్యాంకనం చేయాలంది. ఈ మేరకు సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును రద్దు చేయాలి. ఈ తీర్పు వల్ల ఎంతోమంది ప్రతిభావంతులైన నిరుద్యోగుల ఆశలు అడిఆశలయ్యాయి. ఎన్నో వ్యయప్రయాసలతో టీజీపీఎస్సీ సమర్థంగా నిర్వహించిన పరీక్షల ఫలితాలు కార్యరూపం దాల్చి ఉద్యోగ నియామక ప్రక్రియ దశలో ఆగిపోయింది. సుమారు గత 15 ఏండ్లుగా గ్రూప్–1 నియామకాలు జరగలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత గత పది ఏండ్లలో నియామకాల కోసం జరిగిన ప్రయత్నాలన్నీ ఆగిపోయాయి. చివరిసారి 2011లో గ్రూప్–1 పోస్టుల భర్తీ జరిగింది. ఏండ్లుగా అభ్యర్థులు గ్రూప్–1 పోస్టులను సాధించాలని కసరత్తు చేస్తున్నారు. పోస్టుల భర్తీ ఉపక్రమించిన ప్రతిసారీ ఏదోక వివాదంతో ఆగిపోతున్నాయి. గ్రూప్–1 పోస్టుల భర్తీకి 2016లో వెలువడిన నోటిఫికేషన్ ఆగిపోయింది. ఆ తరువాత 2022లో వెలువడిన మరో నోటిఫికేషన్ సైతం న్యాయపరమైన కేసుల వల్ల నిలిచిపోయింది. తాజాగా గత ఏడాది వెలువడిన నోటిఫికేషన్ వరకు అభ్యర్థులకు ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. కేసులతో జరిగిన కాలయాపన వల్ల యువత తీవ్రంగా నష్టపోతోంది. అభ్యర్థుల వయసు మీరిపోతోంది. ఎంతోమంది ఉద్యోగ నియామక అర్హతలను కోల్పోయే పరిస్థితులకు చేరుకుంటున్నారు. నిరుద్యోగ యువత అవకాశాలను కోల్పోయే పరిస్థితిని తీవ్రంగా పరిగణించాలి.

నిరుద్యోగ యువతలో నిరాశ, అసహనం పెరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. ఈ జాప్యం అభ్యర్థుల భవిష్యత్‌ను సందిగ్ధంలో నెట్టే ప్రతికూల ప్రభావానికి ఆస్కారం ఉండవచ్చు. దీనికితోడు ప్రభుత్వంలోని కీలక విభాగాల్లో ఉన్నత స్థాయి పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల పాలన దెబ్బతింటోంది. గ్రూప్–1 అధికారులు రాష్ట్ర పరిపాలనకు వెన్నుముక. ఈ స్థాయి అధికారులు లేకపోవడంతో ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలు అమలులో అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీ రాజ్ రంగాల్లో అధికారుల కొరతతో పనితీరు మందగిస్తోంది. అభ్యర్థులు అనేక దశల్లో న్యాయపరమైన సమస్యలను లేవనెత్తడంతో నియామక ప్రక్రియలో స్థిరత్వం లేకుండాపోయింది. దీని ప్రభావం సమాజంపై కూడా పడుతున్నది. కాబట్టి, ప్రధాన రిట్ అప్పీల్‌పై తుది తీర్పు వెలువరించే వరకు సెప్టెంబర్ 9 హైకోర్టు సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి. నిరుద్యోగులకు మానసిక వేదనను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక్కో అభ్యర్థి గ్రూప్–1 పరీక్ష కోసం సంవత్సరాల తరబడి శ్రమించారు. వాళ్ల భవిష్యత్తు అనిశ్చితిలో పడకుండా చేయాలి. ఇదొక అభ్యర్థుల సమస్యగానో, ఉద్యోగ నియామక ప్రక్రియగానో చూడకూడదని, పాలనపై ప్రభావం ఎంతగా ఉందో కూడా చూడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వానికి, అభ్యర్థులకు న్యాయం జరగాలంటే సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు ఇవ్వాలి.. అని టీజీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్ ద్వారా హైకోర్టును కోరింది. ఈ అప్పీల్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేయనుంది.

## తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్రభాగం

### అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం
### ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్రభాగంలో నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొంగర్ కలాన్ లోని జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయన జాతియ పతాకాన్ని ఆవిష్కరించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి,రోడ్లు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి,డిసిపి సునీతా రెడ్డి,గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితమే నాటి హైదరాబాద్ రాష్ట్రం నేటి తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావమన్నారు.నిరంతర పోరాటం ద్వారానే ప్రజల ఆకాంక్ష నెరవేరిందని ఆయన చెప్పారు. అమరవీరుల త్యాగాల పునాదులపై నిర్మించ బడిన తెలంగాణా రాష్ట్రంలో వారసత్వంగా వచ్చిన సంపాదనను పరిరక్షించుకోవడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ముందున్న కర్తవ్యమన్నారు. అందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నింటిని అమలులోకి తెచ్చిందన్నారు.అందులో భాగంగానే 202425 ఆర్థిక సర్వే ప్రకారం యావత్ భారతదేశంలోనే రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిసిచింది అంటే అది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందని ఆయన గుర్తు చేశారు.గుర్గ్రాగామ్ జిడిపి 9.05 లక్షలు,బెంగుళూరు అర్బన్ 8.93 లక్షలు,గౌతమబుద్ధ నగర్,నోయిడా 8.40 లక్షలు,సంలేనా 8.10 లక్షలు,గోవా 7.63 లక్షలు,సిక్కిం 7.46 లక్షలు,దక్షిణ కన్నడ 6.69 లక్షలు,ముంబై 6.57 లక్షలు,అహ్మదాబాద్ 6.54 లక్షలు ఉండగా అన్నింటికీ మించి 11.46 లక్షల జిడిపి తో రంగారెడ్డి జిల్లా అభివృద్ధి పథంలో దూసుక పోతుందని ఆయన పేర్కొన్నారు.అన్నింటికీ మించి దశాబ్ద కాలంగా తెల్ల రేషన్ కార్డుల కొరకు నిరీక్షిస్తున్న నిరుపేదలకు 51,874 కొత్త తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుండి 10 లక్షలకు పెంపు వంటి అమలు ప్రభుత్వ దార్శనికతకు అద్దం పడుతోందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కోటి 26 లక్షల మంది రైతులకు నాలుగు విడతలలో 769.53 కోట్ల రుణమాఫీ జరిగిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలతో ఎక్కువగా ప్రయోజనం పొందుతుంది రంగారెడ్డి జిల్లా ప్రజలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూధన్ రెడ్డి, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి,అదనపు కలెక్టర్లు కె చంద్రా రెడ్డి,కె శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,జెడ్.పి సిఇఒ కృష్ణారెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ ఎఒ సునీల్,ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖలకు చెందిన అధికారులు,సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

## జలమండలిలో ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలిలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎం.డి. అశోక్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈడి మయాంక్ మిట్టల్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఆపరేషన్స్ డైరెక్టర్ వినోద్ భార్గవ, పాల్గొన్నారు.

**హెచ్ఎండిఏలో ...**



తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా హెచ్ఎండిఏ ప్రధాన కార్యాలయం, అమీర్‌పేట్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**అగ్నిమాపక శాఖలో..**




హైదరాబాద్‌ను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసిన సందర్భంగా జరుపుకునే ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా, గచ్చిబౌలిలోని తెలంగాణ అగ్నిమాపక విపత్తు ప్రతిస్పందన అత్యవసర పౌర రక్షణ విభాగం ప్రధాన కార్యాలయంలో అగ్నిమాపక సేవల జి.వి. నారాయణరావు భారత జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలకు సేవ చేయడానికి సిబ్బంది మరింత ఉత్సాహం, అంకిత భావం మరియు నిబద్ధతతో పనిచేయాలని అన్నారు.

## మహిళా సిబ్బంది కోసం శిశు సంరక్షణ కేంద్రం

### కమిషనర్ సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేట్లబురుజులోని సిఎఆర్ ప్రధాన కార్యాయలంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిశు సంరక్షణ కేంద్రం మహిళా పోలీసులకు ఉపయోగపడుతుందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. మహిళా పోలీసు పిల్లల కోసం నూతన శిశు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన జి ప్లస్ ఒకటి 05 సంవత్సరాల వయస్సు గల 150–200 మంది పిల్లలకు వసతి కల్పిస్తుందని తెలిపారు, ఈ భవనమును సువిశాలంగా 15000 స్కోయర్ ఫీట్ లో నిర్మించినారని అని తెలిపారు. ఈ భవన నిర్మాణానికి సుమారు రూ. 5 కోట్లు ఖర్చు చేశామన్నారు. పోలీస్ విధులు, బందోబస్తుల కారణంగా ఎక్కువ సమయం క్షేత్రస్థాయిలో పనిచేసే మహిళా అధికారులకు ఈ శిశు సంరక్షణ కేంద్రం చాలా ఉపయోగపడుతుందన్నారు. మహిళా ఉద్యోగులు తమ పిల్లలను డ్యూటీ ప్రదేశానికి తీసుకురావచ్చు, తద్వారా వారు విధుల్లో ఉన్నప్పుడు పిల్లల సంరక్షణకు ఈ కేంద్రం ఎంతో భరోసా ఇస్తుంది. ఇది ఉద్యోగం చేసే తల్లుల ఒత్తిడిని, లాజిస్టికల్ సమస్యలను తగ్గించి, మెరుగైన ఫలితాలను పెంచుతుంది తెలిపారు. నా 34 సంవత్సరాల సర్వీసులో ఇంత పెద్ద వెల్ఫేర్ కార్యక్రమము చేయడము మహిళా అధికారులకు మెరుగైన సౌకర్యాలు లభించడం పట్ల నాకు ఎంతో సంతోషంగా కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెఘా ఇంజనీరింగ్ పామిరెడ్డి మంజులా రెడ్డి, పామిరెడ్డి మెఘా రెడ్డిలు , మురళీ మెఘా కో ఆర్డినేటర్‌లతో పాటు ఐపిఎస్ అధికారులు విక్రమ్ సింగ్ మాన్,డి.జోయల్ డెవిస్, ఎస్. చైతన్య కుమార్, బి.బాలస్వామి, చంద్రమోహన్, .వైవి ఎస్.సుధీంద్రా, ఎన్. భాస్కర్, బి. కిష్టయ్యలు పాల్గోన్నారు.

## బిజెపి కార్యాలయంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లి లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, సేవా పక్వాడ లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర బిసి కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు రచించిన 'నరేంద్ర మోదీ విప్లవాత్మక ప్రపంచ నాయకుడు' అనే త్రిభాషా పుస్తకాన్ని రామచందర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశసేవలో నిరంతరం ముందుకు సాగాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. జిఎస్‌టి సంస్కరణలు, స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాలు కోట్లాది ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బిజెపి సీనియర్ నేత చింతా శంభామూర్తి, ఓబిసి నేత మారుతి ప్రసాద్, దివాకర్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఎవరికైనా రాజకీయ పార్టీ పెట్టుకునే హక్కు ఉంది : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామ్యంలో ఎవరికైనా రాజకీయ పార్టీ పెట్టే హక్కు ఉన్నదని, తమ గొంతును వినిపించుకునే హక్కు కూడా ఉన్నదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. రానున్న సంవత్సర కాలంలోనే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జిహెచ్‌ఎంసి ఎన్నికలు, ఉప ఎన్నికలు వరుసగా వస్తాయన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కొందరు జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడినట్టు బిఆర్ఎస్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనల విడుదల చేసింది. బంధుప్రీతి లేని ప్రభుత్వంలో కాంట్రాక్టులు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. ముడుపులు వసూలు చేసి ఢిల్లీకి పంపించడమే సిఎం రేవంత్ రెడ్డి ఏకైక పని అని ఆరోపించారు. పార్టీ మారిన ఎంఎల్‌ఎల పరిస్థితి 'కుడితిలో పడిన ఎలుకల తరహా మారిందని ఎద్దేవా చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఫోర్త్ సిటీకి మధ్యలో వేస్తున్న రోడ్డు కేవలం రేవంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యుల భూముల కోసమే వేస్తున్నారని, ఈ రోడ్డు వెంబడి అనేక మందితో భూములు కొనుగోలు చేసి, ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నారని కెటిఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సిఎం సచివాలయానికి రావడం లేదని, గతంలో ప్రగతి భవన్ గురించి అనేక అబద్ధాలు చెప్పారన్నారు. సిఎం బెదిరింపులు, ముడుపుల కోసం వేధింపులు తట్టుకోలేకనే హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి ఎల్ , సంస్థ వైదొలుగుతోందన్నారు. ఇదిలా ఉండగా బిఆర్ఎస్ నాయకుడు రాకేష్ రెడ్డి రూపొందించిన కాళేశ్వరం డాక్యుమెంటరీని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ బుధవారం ఆవిష్కరించారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో.. జాతీయ జెండా ఎగురవేసిన రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ విమోచన కోసం పోరాడిన యోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, తమిళనాడు, కర్ణాటక ఇన్‌చార్జ్ సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా బిజెపి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని నిరంతరం డిమాండ్ చేస్తోందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలో ముక్తి దివస్ అధికారికంగా జరుపుకుంటున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో అధికారిక వేడుకలు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఆ వీడియోను వెంటనే తొలగించండి..

### కాంగ్రెస్‌కు పాట్నా హైకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన తల్లి దివంగత హీరాబెన్ మోదీ పై కాంగ్రెస్ ఎఐ వీడియో రూపొందించిన విషయం తెలిసిందే. ఈ వీడియో తీవ్ర దుమారానికి దారి తీసింది. దీనిపై బిహార్‌లో కాంగ్రెస్ పార్టీపై కేసు కూడా నమోదైంది. ఈ కేసును పాట్నా హైకోర్టు తాజాగా విచారించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలను వెంటనే తొలగించాలని హస్తం పార్టీని కోర్టు ఆదేశించింది. ప్రధాని మోదీకి ఆయన తల్లి హీరాబెన్ మోదీ కలలోకి వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ ఎఐ వీడియో రూపొందించిన విషయం తెలిసిందే. 'సాహబ్ కలలోకి అమ్మ వచ్చింది' అనే శీర్షికతో బిహార్ కాంగ్రెస్ 36 సెకన్ల వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో తీవ్ర దుమారం రేపింది. దీనిపై బిజెపి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల మనోభావాలను గాయపరచేందుకు ఉద్దేశించిన వీడియోగా దీనిపై బిజెపి మండిపడింది. కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీపై ఫిర్యాదు చేసింది.

### హైదరాబాద్ గెజిట్ ఆధారంగా డిమాండ్ చేస్తే

## వర్గాల మధ్య సామాజిక ఐక్యత సాధ్యం కాదు

### ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్



**పుణె :** ప్రతి సామాజికవర్గం హైదరాబాద్ గెజిట్‌ను ఆధారంగా చేసుకుని డిమాండ్ చేస్తే వర్గాల మధ్య ఐక్యతను సాధించడం కష్టమవుతుందని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. వసంతదాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో పాల్గొనేందుకు పుణెకు వచ్చిన పవార్ విలేకరులతో మాట్లాడారు. మరాఠాలు, ఒబిసిల కోసం రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పవార్ ప్రశ్నించారు. సామాజిక ఐక్యతపై ఎటువంటి రాజీ పడకూడదని, రాజకీయంగా ఏదైనా మూల్యం చెల్లించాల్సి వస్తే చేయాల్సిందేనన్నారు. మరాఠా సామాజికానికి చెందిన వారు ఒబిసి కుంబి కుల ధృవీకరణ పత్రాలు పొందేందుకు వీలుగా హైదరాబాద్ గెజిట్ అమలు చేయడం వల్ల ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర వెనుకబడిన తరగతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివిధ కుల సంఘాలు వాదించాయి. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ప్రారంభంలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) సంక్షేమ చర్యలను వేగవంతం చేయడానికి, రిజర్వేషన్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి తొమ్మిది మంది సభ్యులతో క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ముంబయిలో ఐదు రోజులుగా మరాఠా రిజర్వేషన్ ఉద్యమకార్యకర్త మనోజ్ జరంగే నిరాహార దీక్ష చేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఆయన డిమాండ్లలో చాలా వరకు అంగీకరించింది. అర్హత కలిగిన మరాఠాలకు కున్బి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయడం ద్వారా వారు ఒబిసిలకు రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు అర్హులవుతారు. అయితే రిజర్వేషన్ ప్రయోజనాల కోసం మరాఠాలను ఒబిసి కేటగిరీలో చేర్చడాన్ని ఒబిసి నాయకులు, సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. ఇదిలా ఉండగా, 'దురదృష్టవశాత్తు, గత కొన్ని రోజులుగా, మరాఠ్వాడాలో వివిధ వర్గాలలో అశాంతి పెరుగుతోంది. అందుకే సామాజిక నిర్మాణం బలహీనపడుతోందని చెప్పాను. ప్రతి రోజూ కొత్త డిమాండ్లు లేవనెత్తుతున్నారు. రెండు రోజుల క్రితం, బంజారా కమ్యూనిటీ ఎస్‌టి కేటగిరీలో చేర్చాలని నిరసన వ్యక్తం చేయగా, మరుసటి రోజు ఆదివాసీలు అలాంటి చేరికను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టారు' అని పవార్ అన్నారు. మరాఠా, ఒబిసి వర్గాల మధ్య కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తిందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎత్తి చూపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకటి ఒబిసిల కోసం, మరొకటి మరాఠాల కోసం రెండు కమిటీలను ఏర్పాటు చేసిందని పేర్కొంటూ కులం ఆధారంగా రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం నిజంగా ఉందా అని ప్రశ్నించారు. అలాంటి కమిటీలు సహజంగానే అవి ఏర్పాటవుతున్న సంఘాల గురించి మాత్రమే ఆలోచిస్తాయని, మరొక వైపు చూడవన్నారు. రెండు వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడం అవసరమని పవార్ అన్నారు. మనం ఐక్యతను కోరుకుంటే, అలాంటి కమిటీల ద్వారా విడిగా పనిచేయడం సహాయపడదు అని మాజీ కేంద్ర మంత్రి అన్నారు. అంతిమంగా, వర్గాల మధ్య వైరాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. బలహీనపడుతున్న సామాజిక నిర్మాణం గురించి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ చేసిన ప్రకటనపై పవార్‌ను ప్రశ్నించగా, వివధ వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడం, వైరాన్ని అంతం చేయడం, దానికి ఏదైనా మూల్యం చెల్లించాల్సి వస్తే, దానిని చెల్లించాలి' అని అన్నారు. కోటా డిమాండ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం హైదరాబాద్ గెజిట్ సహాయం తీసుకుంటుంటే తనకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. కానీ ప్రతి సామాజిక వర్గం తమ డిమాండ్లను ముందుకు తీసుకురావడానికి హైదరాబాద్ గెజిట్‌ను ప్రాతిపదికగా ఉపయోగిస్తోందన్నారు. హైదరాబాద్ గెజిట్ వర్గాల మధ్య చీలికలను సృష్టిస్తుందా అని అడిగినప్పుడు, పవార్ తాను ఇంతకు ముందు ఎప్పుడూ హైదరాబాద్ గెజిట్ చదవలేదని, ఇప్పుడు దాన్ని చదివాను అని అన్నారు

### ఆ తల్లి వ్యవహరించిన తీరుతో...

## న్యాయవ్యవస్థలు 'అసహనానికి' గురయ్యాయ్

### 'సుప్రీంకోర్టు' కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** భారతదేశం, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)లోని న్యాయవ్యవస్థను ఒక మహిళ తనకు బాగా తెలిసిన కారణాల వల్ల 'అసహనానికి గురిచేసింది'అని గమనించిన సుప్రీంకోర్టు ఆమె మైనర్ కుమారుడి కస్టడీని అతడి తండ్రికి అప్పగించాలని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆ మహిళ ప్రవర్తనను ఖండించింది. ఈకేసు ఆమహిళ, ఆమె భర్త మధ్య లోతుగా పాతుకుపోయిన సంఘర్షణను ప్రతిబింబిస్తోందని తెలియజేసింది. భారతదేశంలో కలిసిఉండటం, వారి పిల్లలను పెంచడం గురించి వారి విభిన్న ఉద్దేశాల నుంచి ఉద్భవించిందని పేర్కొంది. ఈ విభేదాలు వారి వైవాహిక జీవితాన్ని దెబ్బతీయడమే కాకుండా వారి ఇద్దరు పిల్లలు వారి తల్లితో యునైటెడ్ కింగ్‌డమ్‌లో కలిసి ఉండటంపైన కూడా ప్రతికూల ప్రభావం చూపిందని ధర్మాసనం అభిప్రాయపడింది. 2010 నవంబరులో వివాహం చేసుకున్న ఈ జంట మధ్య చాలా దీర్ఘకాలికంగా పొడసూపుతున్న విభేదాలు వారి ఇద్దరి పిల్లల విషయంలో మరింత ప్రభావానికి దారితీసిందని వివరించింది. ఇది కేవలం అహాల మధ్య సంఘర్షణ కాదని, ప్రాథమికంగా మైనర్ పిల్లలపై ప్రభావం చూపే మనస్తత్వానికి సంబంధించినదని ధర్మాసనం గమనించింది. పరిస్థితులు పిల్లల సంక్షేమం, ప్రయోజనాలను కాపాడేందుకు బలవంతం చేస్తున్నాయని వెల్లడించింది. ఆమహిళ ప్రవర్తన గురించి ప్రస్తావిస్తూ ఆమె తన తండ్రిని భారతదేశంలో వదిలివెళ్లేటప్పుడు తండ్రికి తెలియజేయడం తన ప్రాథమిక కర్తవ్యమని, దానిని ఆమె పాటించలేదని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఆ వ్యక్తి దరఖాస్తు దాఖలు చేసిన యుకె హైకోర్టులో ఆ బాలుడు తనతో లేదని తెలియజేయడం కూడా ఆమె విధి అని ధర్మాసనం తెలియజేసింది. యునైటెడ్ కింగ్‌డమ్ ఆదేశాలు ఉన్నప్పటికీ తండ్రికి 'కె'(ఆబాలుడి)తో వర్చువల్ మీటింగ్స్ నిర్వహించే అవకాశం లేకుండా పోయిందని, చివరికి అనుమానం తలెత్తినప్పుడు అతను హెబియస్ కార్పస్ పిటిషన్‌ను పంజాబ్ మరియు హైకోర్టు ముందు దాఖలు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని ధర్మాసనం ఎత్తిచూపింది. ఆ మహిళ తన కుమారుడిని ఎప్పుడూ తన తండ్రిని కలవాలని కోరుకోలేదని, అంతేకాకుండా కనీసం కోర్టు ఆదేశాలను కూడా గౌరవించాలని ఎప్పుడూ కోరుకోలేదనే విషయం అర్థం అవుతోందని ధర్మాసనం తెలిపింది. ఆ తల్లికి బాగా తెలిసిన కారణాల వల్ల భారతదేశం, యుకె న్యాయవ్యవస్థలు ఇబ్బందుల్లో పడిందని బెంచ్ వెల్లడించింది. తనభార్య తనకు తెలియజేయకుండా, తన సమ్మతిని తీసుకోకుండానే ఇద్దరు పిల్లలతో కలిసి 2021 మేలో భారతదేశానికి వెళ్లిందని ఆ వ్యక్తి సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆ తర్వాత తన మైనర్ కుమారుడు అత్తమామలతో కలిసి భారత్‌లో ఉన్నాడని అతడికి తెలిసింది. తన పిల్లల అక్రమ కస్టడీపై పంజాబ్, హర్యానా హైకోర్టును ఆయన సంప్రదించాడు. సెప్టెంబరు 16న సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో ఆ మహిళ లండన్‌లోని ఫ్యామిలీ కోర్టు నుండి విడాకులు పొందిందని, ఆ వ్యక్తి జింద్‌లోని ఫ్యామిలీ కోర్టు నుండి విడాకులు పొందాడని వెల్లడించింది. హైకోర్టు బాలుడి తాత్కాలిక కస్టడీని తన తండ్రికి ఇవ్వడం సమర్థనీయమని ధర్మాసనం పేర్కొంది. సెప్టెంబరు 30 నాటికి బాలుడిని కస్టడీ ని తన తండ్రికి అప్పగించాలని ఆదేశించింది. ప్రతీ శనివారం సాయంత్రం 5 గంటల నుండి 7గంటల వరకు తల్లి లేదా సోదరి అతడితో ఆడియో లేదా వీడియో యాక్సిస్ చేసుకునే హక్కు కలిగిఉంటారని ధర్మాసనం ఆదేశం జారీ చేసింది. తల్లి భారతదేశ పర్యటన సందర్భంగా ప్రతీ ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్ర 5 గంటల వరకు ఇరువురూ ఎంపిక చేసుకున్న స్థలంలో కలుసుకునే హక్కును కూడా కలిగి ఉం టారని ధర్మాసనం తెలియజేసింది. అలాగే అబ్బా యి అమ్మమ్మలు కూడా ప్రతీ ఆదివారం ఇదే సమయంలో ఇరువురూ నిర్ణయించిన స్థలంలో కలుసుకునే హక్కును కలిగిఉంటారని కూడా ఆదేశాలు జారీచేసింది.

## గ్యాంగ్‌స్టర్ చోటారాజన్ బెయిలు రద్దు..

### 'సుప్రీం' సంచలన తీర్పు



**న్యూఢిల్లీ :** గ్యాంగ్‌స్టర్ చోటారాజన్‌కు 2001 జయశెట్టి హత్య కేసులో ముంబయి హైకోర్టు ఇచ్చిన బెయిలును సుప్రీంకోర్టు బుధవారం నాడు రద్దు చేస్తూ కీలక తీర్పు చెప్పింది. హోటల్ వ్యాపారి జయశెట్టి హత్యకు సంబంధించిన కేసులో గత ఏడాది మేలో ప్రత్యేక కోర్టు చోటా రాజన్‌ను దోషిగా నిర్ధారించింది. జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును ముంబయి హైకోర్టులో చోటారాజన్ సవాలు చేశారు. 2024 అక్టోబర్ 23న ముంబయి హైకోర్టు చోటారాజన్ విధించిన శిక్షను సస్పెండ్ చేస్తూ బెయిలు మంజూరు చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని సిబిఐ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన డివిజన్ బెంచ్ దీనిపై విచారణ జరిపింది. 'చోటారాజన్ నాలుగు కేసుల్లో దోషిగా ఉన్నప్పుడు అలాంటి వ్యక్తికి విధించిన జైలుశిక్షను ఏ విధంగా రద్దు చేస్తారు?' అని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. హైకోర్టు ఉత్తర్వును రద్దు చేసింది. చోటారాజన్‌పై ఉన్న 71 కేసుల్లో 47 కేసుల్లో సిబిఐ దగ్గర ఎలాంటి సాక్ష్యాలు లేవని రాజన్ తరఫు న్యాయవాది వాదించారు. అయితే ఆయన వాదనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇతర కేసుల్లో ఇప్పటికే జీవిత ఖైదు పడినందున తిరిగి అతను లొంగిపోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. ప్రాసిక్యూషన్ వాదన ప్రకారం, దక్షిణ ముంబైలోని గోల్డెన్ క్రౌన్ హోటల్ యజమాని జయశెట్టికి చోటారాజన్ ముఠా నుంచి బలవంతపు వసూళ్ల బెదిరింపులు వచ్చాయి. శెట్టికి పోలీసు రక్షణ కల్పించినప్పటికీ అతని హత్యకు రెండు నెలల ముందు భద్రతను ఉపసంహరించారు. రూ.50,000 ఇవ్వాలన్న చోటారాజన్ గ్యాంగ్ డిమాండ్‌ను కాదన్నందుకు 2001 మే 4న జయశెట్టిని అతని కార్యాలయం వెలుపల ఇద్దరు ముఠా సభ్యులు కాల్చిచంపారు. 2024 మేలో ముంబైలోని ప్రత్యేక ఎంసిఒసిఎ కోర్టు చోటారాజన్‌కు జీవిత ఖైదు, రూ.1,00,000 జరిమానా విధించింది.

## పాకిస్థాన్‌ను మోకాళ్ళమీద కూర్చోబెట్టాం

### ధార్ సభలో నరేంద్రమోదీ



**ధార్:** ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైన్యం పాకిస్థాన్‌ను రెప్పపాటుకాలంలో అణచివేసి మోకాళ్ళమీద కూర్చోబెట్టిందని, ఉగ్రవాదుల రోదనలను యావత్ ప్రపంచ వీక్షించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. మధ్యప్రదేశ్ ధార్ జిల్లాలోని పిఎం మిత్ర పార్క్ (ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్–అపారెల్)కు బుధవారం పునాదిరాయి వేసిన తర్వాత జరిగిన సభలో ప్రధానమంత్రి మాట్లాడారు. శత్రుదేశం ఇంట్లోకి ప్రవేశించాం, వాళ్ళమీదే దాడిచేశాం, పాకిస్థాన్ ఉగ్రవాదులు మన సోదరీమణుల, మన కుమార్తెల మాంగల్యాలను తెంచేశారు, అందుకే మనం ఆపరేషన్ సిందూర్ చేశాం, ఉగ్రవాదులు దాడులు చేయడానికి ఉపయోగించే కేంద్రాలను ధ్వంసం చేశాం'' అని నరేంద్రమోదీ చెప్పారు. జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ కమాండర్ విడుదల చేసి వైరల్‌గా మారిన వీడియోను సభలో ప్రధానమంత్రి ప్రస్తావించారు. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న కశ్మీరు భూభాగంలోకి, పాకిస్థాన్ భూభాగంలోకి భారత గగనతల వ్యవస్థలు ప్రవేశించి దాడులు చేశాయన్నారు. అదేవిధంగా స్వదేశీ వస్తువులనే ఎక్కువగా ఉపయోగించాలని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. ''ఇది పండుగలు, పర్వదినాల సమయం, ఈ సందర్భం గా మనం ఒక మంత్రాన్ని గుర్తుంచుకోవాలి, అదే మన స్వదేశీ మంత్రం, స్వదేశీ వస్తువులనే మనం కొనుగోలు చేద్దాం, స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహిద్దాం, స్వదేశీ వస్తువులనే మన జీవితాల్లోకి ఆహ్వానిద్దాం, 140 కోట్లమంది భారతీయ ప్రజలకు నాదొక వినయపూర్వక విజ్ఞప్తి, మీరు మార్కెట్‌లో ఏది కొనుగోలు చేసినా గానీ, మనదేశంలో తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయండి, మనదేశంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో మన కార్మికులు చెమటలు చిందించి తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయండి, ఈ విషయాన్ని బోర్డులు ప్రదర్శించడం ద్వారా దుకాణదారులు గర్వంగా ప్రకటించండి'' అని మోదీ విజ్ఞప్తి చేశారు. మహిళల ఆరోగ్యం మెరుగుదల, వారిలో పోషకాహార విలువల ప్రోత్సాహంకోసం ప్రచారం నిమిత్తం 'స్వస్త నారీ సాక్షాత్ పరివార్', 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ ప్రచార కార్యక్రమాలను నరేంద్రమోదీ ప్రారంభించారు. స్వదేశీ నారీశక్తి పరివార్ ఆరోగ్య చొరవ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా దేశ మహిళలకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. ''మనదేశంలో మన తల్లుతు, సోదరీమణు ఎలాంటి సందేహాలు లేకుండా ఈ ప్రచార శిబిరాల్లో పాల్గొనండి, ఈ శిబిరాల్లో ఉన్న ఔషధాలను ఉచితంగా వాటిని పొందండి, మీఆరోగ్యం కంటే ప్రభుత్వ ధనం గొప్పదేమీ కాదు'' అని ప్రధానమంత్రి అన్నారు. పుట్టినరోజు సందర్భంగా మోదీ ధార్ జిల్లాలో పర్యటించడం ఇది రెండోసారి. 2022లో కూడా ఇదేనెలలో తన పుట్టినరోజు సందర్భంగా ధార్ జిల్లాలో నరేంద్రమోదీ పర్యటించారు.

**సెప్టెంబరు 17ను ఇక**
**హైదరాబాద్ విముక్తి దినోత్సవంగా పాటిద్దాం**

ధార్‌లో జరిగిన సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ విముక్తి దినోత్సవాన్ని ప్రస్తావించారు. 1948 సెప్టెంబరు 17వ తేదీన భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్‌ను విముక్తి చేశారన్నారు. హైదారబాద్‌ను అణచివేత నుండి భారతదేశ సైన్యం విముక్తిచేసిప్రజల హక్కులను కాపాడిందని, భారతదేశంలోకి తిరిగి హైదరాబాద్‌ను విలీనం చేసిందన్నారు. ''ఇకమీదట మనం సెప్టెంబరు 17వ తేదీని హైదరాబాద్ విముక్తి దినోత్సవంగా పాటించడం ప్రారంభిద్దాం, బ్రహ్మాండంగా ఉత్సవాలు చేసుకుందాం, ఈరోజు హైదరాబాద్‌లో విముక్తి దినోత్సవం జరుగుతోంది'' అని చెప్పారు.

## 24న సిడబ్ల్యుసి భేటీ



**న్యూఢిల్లీ :** పాట్నాలో ఈనెల 24న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పార్టీ అగ్ర నాయకత్వం రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై మేధోమథనం, 'ఓటు చోరీ'కి సంబంధించి బిజెపిపై దాడిని తీవ్రతరం చేయనుందని బుధవారం వర్గాలు తెలిపాయి. సమావేశంలో శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ ముఖ్యమంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ శాసనసభా పార్టీ (సిఎల్‌పి) నాయకులు పాల్గొని విస్తృతంగా చర్చించనున్నారు. బిహార్, పార్టీ ప్రచార వ్యూహం, భవిష్యత్ ఎన్నికలు, 'ఓటు చోరీ'పై దృష్టి సారించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఈనెల 24న ఉదయం 10 గంటలకు సిడబ్ల్యుసి సమావేశం జరుగుతుందని వారు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ సహా పార్టీ అగ్ర నాయకులందరూ ఈ సమావేశంలో పాల్గొంటారు. మహాఘట్బంధన్ భాగస్వామ్యపక్షాల మధ్య సీట్ల పంపకాలపై చర్చలు, రాహుల్ గాంధీ 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నిర్వహించిన 'ఓటరు అధికార్ యాత్ర', రాష్ట్రంలో పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచిన, ఉత్తేజపరిచిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ తర్వాత కొన్ని రోజుల తర్వాత ఈ సమావేశం జరుగుతుంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఎన్నికలకు సిద్ధం కావడానికి కాంగ్రెస్ మంగళవారం ప్రదేశ్ ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసింది. అందులో బిహార్ యూనిట్ చీఫ్ రాజేష్ రామ్, షకీల్ అహ్మద్ ఖాన్, మదన్ మోహన్ ఝా వంటి వారు ఉన్నారు. ఈ కమిటీలో 39 మంది సభ్యులు ఉన్నారు. వీరితో పాటు బిహార్‌కు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎఐసిసి కార్యదర్శులు, సిడబ్ల్యుసి సభ్యులు, ఫ్రంటల్ సంస్థల అధిపతులు ప్యానెల్‌కు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. బిహార్ ఎన్నికలు ఈ ఏడాది నవంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

## ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలు – ప్రచారం, ప్రభావం




భారతదేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలలో జరిగే విద్యార్థి సంఘాల ఎన్నికలను, సామాన్య ప్రజల నుండి అత్యున్నత స్థానాల్లో ఉన్నవారు సైతం పరిశీలిస్తారు. దేశంలోనే వివిధ ప్రాంతాల నుండి, భిన్న భాషలు, సంస్కృతుల నుండి విశ్వ విద్యాలయాలకు వచ్చే విద్యార్థులు, యూనివర్సిటీ క్యాంపస్ లను రాజకీయ అవగాహనతో దేశ ప్రజలను ప్రభావితం చేస్తారు. రేపటి భారత పౌరులుగా తమ సైద్ధాంతిక పునాదులపై నిలబడి, ఉపన్యాసాలతో, చర్చలతో మేథ మదనానికి శ్రీకారం చుడతారు. ఆలోచనపరులుగా రాజకీయాలకు దూరంగా ఉండే వారిలో సైతం అవగాహన కల్పిస్తారు. ఆశలను రేకిత్తిస్తారు. దేశ రాజధాని ఢిల్లీలోని, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడింది. దీంతో వివిధ సంఘాలు తమ అభ్యర్థులను పోటీలో నిలబెట్టాయి. వామపక్ష విద్యార్థి సంఘాలతో పాటు ఇతర సంఘాలు ప్రచారాన్ని ప్రారంభించాయి. ఎఐఎస్‌ఎఫ్ నుండి అభ్యర్థులు పోటీలో ఉండడంతో దేశంలోని వివిధ యూనివర్సిటీల విద్యార్థులను ప్రచారం నిమిత్తం ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కౌన్సిల్ ఢిల్లీ రావాలని చెప్పడంతో, తెలంగాణలోని ఉస్మానియా యూనివర్సిటీ నుండి నేను, ఉదయ్ కుమార్ ఢిల్లీ వచ్చాము.

ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో ఎఐఎస్‌ఎఫ్, ఎఐడిఎస్‌ఒ కలిసి ఒక ప్యానెల్‌గా పోటీ చేస్తున్నాయి. అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవులకు నామినేషన్లు వేశారు. ఇక అక్కడి నుండి బిజెపి దాని అనుబంధ ఎబివిపి కుట్ర రాజకీయాలు మొదలయ్యాయి. ఢిల్లీ యూనివర్సిటీ అధ్యక్ష పదవికి అభిషేక్ (ఎఐడిఎస్‌ఒ), ఉపాధ్యక్ష పదవికి మాలిక్ జాఫర్ (ఎఐఎస్‌ఎఫ్), కార్యదర్శిగా మోహిత్(ఎఐఎస్‌ఎఫ్), సహాయ కార్యదర్శిగా అమేలియా అన్ వర్గీస్ (ఎఐఎస్‌ఎఫ్) లు నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో ఉపాధ్యక్ష పదవికి పోటీపడిన ఎఐఎస్‌ఎఫ్ అభ్యర్థి మాలిక్ జాఫర్ నామినేషన్‌ను యూనివర్సిటీ అధికారులు తిరస్కరించారు. ఎందుకు తిరస్కరించారో చెప్పాలని విద్యార్థులు డిమాండ్ చేస్తే, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యక్ష పదవికి అనర్హులన్నారు. కానీ గత సంవత్సరం వేరే విద్యార్థి సంఘాలకు అనుమతి ఇచ్చారు కదా అని అడగగా, దానికి యూనివర్సిటీ అధికారుల వద్ద సమాధానం లేదు. ఉపాధ్యక్ష పదవికి పోటీపడిన మాలిక్ జాఫర్ ముస్లిం కావడం, అందునా కశ్మీర్ ముస్లిం కావడం వల్లనే అతని నామినేషన్ తిరస్కరించబడిందని ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులే యూనివర్సిటీ అధికారులను నిలదీసి అడిగారు. బిజెపి ప్రోద్బలంతో ఢిల్లీ యూనివర్సిటీ అధికారుల తీరు ఇలా ఉంటే, ఎబివిపి ఆగడాలు ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా ఉన్నాయి. ఎఐఎస్‌ఎఫ్ అభ్యర్థులు అన్ని పోస్టులకు నామినేషన్లు వేయగా ఎబివిపి గుండాలు నామినేషన్ పత్రాలు చింపివేశారు. దీనికి సంబంధించిన వీడియో సాక్ష్యాలను సైతం యూనివర్సిటీ అధికారులకు అందించి, ఈ ఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేయగా, వారి నుండి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదు. నిరసనగా ఢిల్లీ యూనివర్సిటీ గేట్ ముందు ధర్నా చేయగా ప్రయివేట్ సెక్యూరిటీ సిబ్బంది విద్యార్థులపై దాడులు చేశారు. అమ్మాయిల పట్ల అసభ్యకరం గా ప్రవర్తించారు. ఇదంతా ఢిల్లీ పోలీసుల సమక్షంలో జరిగినా, పోలీసులు మాత్రం మౌనం గా ఉన్నారు. ఇంత దాడి జరిగినా అభ్యర్థులు, విద్యార్థులు ఎక్కడా నిరాశ చెందకుండా, తరువాతి రోజు నుండే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టాం. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని ఏ కాలేజీ ముందు చూసినా వందల సంఖ్యలో ఢిల్లీ పోలీసు లు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిఆర్‌పిఎఫ్ బలగాలు మోహరించాయి. వామపక్ష విద్యార్థి సంఘాలు కాకుండా, మిగతా విద్యార్థి సంఘాల ప్రచార తీరు సాధారణ ఎన్నికలను తలపించింది. ఖరీదై న కార్లలో తిరుగుతూ, డిజె శబ్దాలతో, మందు పార్టీలతో విద్యార్థుల వద్దకు వెళ్లడం కాస్త ఆశ్చర్యంగా అనిపించింది. ఇందుకు భిన్నంగా వామ పక్ష విద్యార్థి సంఘాల ప్రచారం కొనసాగింది. ఎఐఎస్‌ఎఫ్ ఎఐడిఎస్‌ఒ జాయింట్ పానెల్ గా ప్రతికాలేజీకి వెళ్లి, కాలేజీలోని ప్రతి డిపార్ట్‌మెంట్లో విద్యార్థులను కలిశాం. విద్యార్థి సంఘ ఎన్నికల ఉమ్మడి మేనిఫెస్టోను విద్యార్థుల ముందు ఉంచాం. మా పానెల్‌ను ఎన్నుకుంటే విద్యార్థుల కోసం ఏం చేస్తామో తెలిపాం.


ఢిల్లీ యూనివర్సిటీ ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య హాస్టల్ లేకపోవడం. యూనివర్సిటీ పరిధిలో దాదాపు లక్ష నలభై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి, ఉన్నత చదువుల కోసం, ఢిల్లీ యూనివర్సిటీకి వచ్చినవారు. కానీ అందులో కేవలం 30 శాతం మంది విద్యార్థులకు మాత్రమే హాస్టల్ సదుపాయం ఉంది. మిగతా డెబ్బై శాతం విద్యార్థులు బయట వేల రూపాయలు ఖర్చు చేసి, ప్రైవేటు హాస్టల్‌లలో, రూమ్‌లలో ఉంటున్నారు. విద్యార్థులు డబ్బు కోసం సాయంత్రం వేళల్లో పార్ట్ టైం ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులన్నీ ఢిల్లీ యూనివర్సిటీ ఉన్నత చదువులు కేవలం డబ్బున్న వారికి మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తున్నాయి. పేద విద్యార్థులు వారి కుటుంబ పరిస్థితుల వలన యూనివర్సిటీలో సీటు వచ్చినా చదవకపోవడం, చేరినా ఖర్చులు భరించలేక చదువులు మధ్యలో వదిలేసి వెళ్లిపోతున్నారు. దేశ రాజధాని, ఢిల్లీ మహానగరంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఢిల్లీ యూనివర్సిటీలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉండటం బిజెపి ప్రభుత్వం విద్య పట్ల, యూనివర్సిటీల పట్ల అవలంబిస్తున్న విధానాలు ఏంటో దేశ ప్రజలకు కళ్ళ ముందు కనబడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా కొత్త హాస్టల్లను అయినా నిర్మించాలి, లేదంటే ప్రైవేట్ హాస్టల్ రెంటును విద్యార్థులకు రియింబర్స్‌మెంట్ చేయాలని ఎఐఎస్‌ఎఫ్‌గా డిమాండ్ చేశాం. ఢిల్లీ యూనివర్సిటీలో మరో ప్రధాన సమస్య విద్యార్థులకు, విద్యార్థి సంఘాలకు, యూనివర్సిటీ అధికారుల మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉంది. ఉన్నత వర్గాల పిల్లలు ఎక్కువగా చదివే ఢిల్లీ యూనివర్సిటీలో, వారికి యాదృచ్ఛికంగానే రాజకీయాల పట్ల అనాసక్తి ఉంది. అక్కడక్కడ కనిపించే సాధారణ విద్యార్థులకు రాజకీయాలు చేయాలనే ఆసక్తి ఉన్నా, వారంతా నిస్సహాయ స్థితిలో వున్నారు. వారందరికీ ఒక నమ్మకం కలిగించాలని, అసమానతలపై పోరు చేయాలనే చైతన్యం రగిలించాలని ఏఐఎస్‌ఎఫ్‌గా మా పాత్ర పోషించాం. ఒకవైపు గుంపులుగా అరుస్తూ, ధనబలంతో కొన్ని విద్యార్థి సంఘాలు ప్రచారం చేస్తుంటే, మరోవైపు విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పట్ల, సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూనే విద్యార్థులుగా మనం ఏం చేయగలమో మా ప్రచారంలో ప్రశ్నలుగా లేవనెత్తాం.

బిజెపి, ఎబివిపి యూనివర్సిటీ అధికారులు కుమ్మక్కై భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కొన్ని కాలేజీల వద్ద మమ్మల్ని గేటు వద్ద ఆపివేసినా, నిరుత్సాహ పడకుండా వారి అసమర్థ, గుండా రాజకీయాలను విద్యార్థులకు చెబుతూ ముందుకు సాగిపోయాం. గెలుపు ఓటములు ఎలా ఉన్నా. మా ప్రచార సరళి విద్యార్థుల్లో కొన్ని ప్రశ్నలు లేవనెత్తింది, ఆశలు రేకెత్తించింది. పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అనే నమ్మకాన్ని కలిగించింది. పోలింగ్ 18.9.25

**రెహమాన్**
**ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి**

### గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

## ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి



**గడ్చిరోలి :** మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్ జరిగింది. బుధవారం గడ్చిరోలి జిల్లాలో పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఎటపల్లి తాలూకాలోని మోడస్కే గ్రామాన్ని ఆనుకుని ఉన్న అడవిలో మావోయిస్టుల గట్టా ఎల్‌ఒఎస్ (స్థానిక సంస్థ దళం) సభ్యులు కొంతమంది మకాం వేస్తున్నట్లు ఉదయం విశ్వసనీయ సమాచారం అందిందని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ నేపథ్యంలో గడ్చిరోలి పోలీసులకు చెందిన ఐదు యూనిట్ల సి60తో పాటు, అహేరి నుండి పోలీసులు వెంటనే ఆపరేషన్ ప్రారంభించారని ఆయన చెప్పారు. సి60 దళం అటవీ ప్రాంతంలో శోధిస్తున్నప్పుడు, మావోయిస్టులు వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరపగా, పోలీసులు ఎదురు కాల్పులు జరిపారని అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్ తరువాత ఘటనాస్థలిలో పరిశీలించగా ఇద్దరు మహిళా నక్సలైట్ల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. ఒక ఆటోమేటిక్ ఎకె47 రైఫిల్, ఒక అధునాతన పిస్టల్, లైవ్ మందుగుండు సామగ్రి, పెద్ద మొత్తంలో నక్సల్ సాహిత్యం, వారి వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## 12 మంది నక్సల్స్ లొంగుబాటు



**నారాయణపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో 12 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వారిలో తొమ్మిది మందిపై సమష్టిగా రూ. 18 లక్షల రివార్డు ఉన్నట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఐదుగురు మహిళలు సహా ఈ కేడర్లు సీనియర్ పోలీసు, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) అధికారుల ముందు లొంగిపోయారని నారాయణ్‌పూర్ పోలీసు సూపరింటెండెంట్ రాబిన్సన్ గురియా తెలిపారు. మావోయిస్టు భావజాలం, అమాయక గిరిజనులపై నక్సలైట్లు చేసిన దురాగతాలు, నిషేధిత సంస్థలో పెరుగుతున్న అంతర్గత విభేదాల పట్ల వారు నిరాశ చెందారని ఆయన అన్నారు. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు సుద్రేన్ నేతమ్ (41), ధోబా సలాంలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల రివార్డు ప్రకటించారని ఆయన చెప్పారు. లొంగిపోయిన మరో ఇద్దరు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రివార్డు ప్రకటించగా, మరో ముగ్గురి తలలపై రూ. 1 లక్ష రివార్డు, ఇంకో ఇద్దరు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 50,000 రివార్డు ప్రకటించారని ఆయన తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లందరికీ ఒక్కొక్కరికి రూ. 50,000 సహాయం అందించామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి మరింత పునరావాసం కల్పిస్తామన్నారు. దీంతో ఈ సంవత్సరం జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 177 మంది కార్యకర్తలు లొంగిపోయారని పోలీసులు తెలిపారు.

# తుదిలేని వివాదం

ప్రజాపక్షం
18-09-2025,గురువారం

పంట అవశేషాల దగ్ధం.. పెరుగుతున్న కాలుష్యం మరోసారి తెరపైకి వచ్చాయి. తుదిలేని సమస్యగా మారిన ఈ 'స్టబుల్ బర్నింగ్' వివాదంపై పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు హెచ్చరికలు జారీ చేయడం ఈ సమస్య తీవ్రతకు నిదర్శనం. ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ కాలాల్లో, కోత అనంతరం టన్నుల కొద్దీ పంట అవశేషాలు మిగిలిపోతాయి. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో వరి పంట కోత అక్టోబర్ – నవంబర్‌లో జరుగుతుంది. గోధుమ విత్తనాలు వేసేందుకు కేవలం 15 నుంచి 20 రోజుల వ్యవధి ఉంటుంది. అంత తక్కువ సమయంలో పొలాన్ని సిద్ధం చేసుకోవాలంటే, వ్యర్థాలను దగ్ధం చేయక తప్పడం లేదు. వీటిని ఇతరత్రా మార్గాల్లో తొలగించే అవకాశం ఉన్నప్పటికీ, అందుకు ఎక్కువ సమయం, అధిక వ్యయం తప్పదు. వ్యర్థాలను తొలగించే యంత్రాల ఖరీదు చాలా ఎక్కువ. చిన్న రైతులు వీటిని కొనుగోలు చేయలేరు. ప్రభుత్వాలు ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు. పంట వ్యర్థాలకు ఇతరత్రా ఉపయోగాలు ఉంటాయనే అవగాహన ఎక్కువ మంది రైతుల్లో లేదు. వీటిని ఎరువుగా, పశువుల మేతగా లేదా బయోగ్యాస్ తయారీలో వాడే విధానాలపై వారికి అవగాహన కల్పించే ప్రయత్నాలు సమర్థవంతంగా జరగడం లేదు. మానవ శ్రమ ద్వారా పంట అవశేషాలను తొలగించడానికి ఖర్చు అధికం కాబట్టి, తగలబెట్టడం ఒక్కటే, తక్కువ ఖర్చుతో, సులభమైన మార్గంగా కనిపిస్తుంది. అయితే, పంట అవశేషాలను తగలబెట్టినప్పుడు కార్బన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి హానికర వాయువులు బయటకు వస్తాయి. ఒక హెక్టారు పొలంలో 'స్టబుల్ బర్నింగ్' వల్ల సుమారు 13 టన్నుల వరకు కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి వెళ్తుంది. కాలుష్యాన్ని పెంచుతుంది. ఢిల్లీలో ప్రతి శీతాకాలంలో విపరీతమైన మంచు, తీవ్రమైన వాయు కాలుష్యం వంటి సమస్యలకు 'స్టబుల్ బర్నింగ్' ప్రధాన కారణం. పార్టిక్యులేట్ మీటర్ (పిఎం) 2.5, పిఎం 10 స్థాయి కణాలు గాలి నాణ్యతను దారుణంగా దెబ్బతీస్తాయి. పంట అవశేషాలు మట్టిలో కలిస్తే సేంద్రియ పదార్థాలు పెరుగుతాయి. కానీ దహనం చేస్తే భూసారం తగ్గుతుంది. సూక్ష్మ జీవులు నశించి, మట్టి జీవవైవిధ్యాన్ని కోల్పోతుంది. పంట అవశేషాలు నేలపై ఉండడం వల్ల తేమ ఎక్కువ కాలం నిలుస్తుంది. దహనం చేస్తే నేల ఎండిపోతుంది. భూగర్భ జలాలు అంతరిస్తాయి. ప్రజారోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆస్తమా, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల కేన్సర్, గుండె పోటు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. ఎన్నో సమస్యలకు కారణమవుతున్న 'స్టబుల్ బర్నింగ్'ను నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జిటి) ఇది వరకే నిషేధించింది. కానీ, ప్లాస్టిక్ వినియోగం మాదిరిగానే, ఈ నిషేధం కూడా ఆచరణలో విఫలమవుతున్నది. సమస్య మూలాలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రయత్నించకుండా, రైతులపై కేసులు పెట్టడం, జరిమానాలు విధించడమే పరిష్కార మార్గం అనుకోవడం ప్రభుత్వాల ఆలోచనా రాహిత్యానికి నిదర్శనం. పలాయన వాదానికి పరాకాష్ట. ఇప్పటికే అనేక రకాలుగా కుంగిపోతూ, కష్టాలకు ఎదురీదుతున్న రైతులను మరింత కుంగదీసే చర్యలు మానుకొని, 'స్టబుల్ బర్నింగ్' సమస్యకు పరిష్కార మార్గాలు అనుసరించడం అత్యవసరం. సుప్రీం కోర్టు నేరుగా జోక్యం చేసుకొని, 'మాండమస్' జారీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించే పరిస్థితులు రావడం ప్రభుత్వాల స్వయం కృతమే. గత్యంతరం లేకనే రైతులు పంట వ్యర్థాలను దగ్ధం చేస్తున్నారన్నది వాస్తవం. అందుకే, బయోమాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లకు మద్దతు, ప్రోత్సాహకాలు ప్రకటించాలి. పంట వ్యర్థాలను తొలగించే పరికరాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలి. వాటిని రైతులకు ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలి. పంట వ్యర్థాల నిర్వహణపై వారికి అవగాహన కల్పించాలి. శిక్షణ ఇప్పించాలి. కేవలం పంట వ్యర్థాల దగ్ధం ఒక్కటే పర్యావరణ కాలుష్యానికి కారణం కాదన్నది నిజం. మితిమీరిన పారిశ్రామికీకరణ పోషిస్తున్న పాత్ర బహిరంగ రహస్యం. తుదిలేని సమస్యగా మిలిగిపోతున్న 'స్టబుల్ బర్నింగ్' పేరుతో రైతులను నిందించడం, కేసులు పెట్టి వేధించడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇది ఒక్కరాత్రిలో పరిష్కారమయ్యే సమస్య కాదు... రైతుల జీవనోపాధి, పర్యావరణ సంరక్షణ, ప్రభుత్వ విధానాల మధ్య సమతౌల్యంలో ఎదురయ్యే సవాలు. సమన్వయంతో కృషి చేస్తే, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని, శుభ్రమైన గాలిని, భవిష్యత్ తరాలకు అందించడం సాధ్యమే.

## పాతుకుపోయిన రాజకీయ వ్యవస్థపై

# నేపాల్ నవతరం తిరుగుబాటు



నిత్యా చక్రవర్తి


నేపాల్‌లో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన తిరుగుబాటు ఫలితంగా కె.పి. ఎస్ ఓలీ ప్రభుత్వం పడిపోయింది. ఈ తిరుగుబాటులో పార్లమెంట్ భవనం, సుప్రీంకోర్టు, శక్తిమంతమైన తాజా, మాజీ మంత్రుల అధికార, ప్రైవేటు నివాసాలపై దాడులు చేసి తగలబెట్టారు. ఇది భారతదేశానికి పొరుగున ఉన్న ఈ హిమాలయ దేశంలో పాతుకుపోయిన రాజకీయ వ్యవస్థ, కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలు, వాటి చిహ్నాలపై జెనరేషన్ జెడ్ తరానికి చెందిన యువత సంపూర్ణ తిరుగుబాటుకు వ్యక్తీకరణ.

నేపాల్‌లో యువత జరిపిన తిరుగుబాటు ఆగస్టు 2024లో బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలకు, 2022లో శ్రీలంకలో విద్యార్థులు చేసిన తిరుగుబాటుకు భిన్నంగా ఉంది. నేపాల్‌లో ఇది కేవలం రెండు రోజుల్లోనే ఒక భారీ ఉద్యమ స్వభావాన్ని సంతరించుకుంది. మొదటి రోజునే పోలీసులు 19 మంది ప్రదర్శన కారులను చంపడం ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణం. ప్రస్తుతం మృతుల సంఖ్య 75కి చేరుకుంది. అంతేకాకుండా, విద్యార్థుల కోపం తీవ్రంగా, హింసాత్మకంగా మారి మూడు కమ్యూనిస్ట్ పార్టీలు, నేపాల్ కాంగ్రెస్ సహా పాతుకుపోయిన రాజకీయ పార్టీల కార్యాలయాలను తగలబెట్టారు. నేపాల్‌లో ముఖ్యంగా ఖాట్మండులో, అలాగే మరో రెండు మూడు నగరా ల్లో, స్కూలు విద్యార్థులు, అందులోనూ చాలా మంది ఉన్నత కుటుంబాలకు చెందిన అమ్మాయిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేపాల్‌లో జరిగిన తిరుగుబాటు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తరం తిరుగుబాటు. వీరు కమ్యూనిస్టులతో సహా ఉన్నత శ్రేణి పాలక వర్గంతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన ఆలోచనా ధోరణిలో ఉన్నారు. నేపాల్‌లోని కమ్యూనిస్ట్ పార్టీలకు బలమైన విద్యార్థి సంఘాలు ఉన్నాయి. కానీ 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై అధికారిక నిషేధానికి వ్యతిరేకంగా జెనరేషన్ జెడ్ తరం తిరుగుబాటు చేయడంతో ఈ సంఘాలు తాజా ఉద్యమంలో పూర్తిగా తటస్థంగా మారిపోయాయి. వాస్తవానికి, ఈ నిషేధమే తిరుగుబాటుకు ప్రధాన కారణం. ఎందుకంటే నేపాల్‌లోని జనరేషన్ జెడ్ తరం పూర్తిగా సోషల్ మీడియా వలయంలో ఉన్నారు. కుటుంబంలో పెద్దలు లేదా ప్రభుత్వం చేసే ఏ జోక్యాన్నీ వారు భరించే స్థితిలో లేరు.

ఉద్యమంలో పాల్గొన్నవారిని చంపేయడంతో తిరుగుబాటు ఒక కొత్త కోణాన్ని తీసుకున్న తరువాతే అవినీతి, నిరుద్యోగం వంటి సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ హత్యలు ఉద్యమాన్ని ప్రభుత్వం, మొత్తం రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా మార్చాయి. అందుకే సెప్టెంబర్ 9న రెండో రోజు చాలా మంది పెద్దవారు కూడా చేరడంతో జనరేషన్ జెడ్ ఉద్యమం జాతీయ ఉద్యమంగా మారింది. నేపాల్ జనాభా 2.96 కోట్లలో, 1.17 కోట్ల మంది 35 ఏళ్ల లోపు వారు. అందులో 15–24 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు 57.6 లక్షల మంది ఉన్నారు. ఈ గ్రూప్ ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లతో పెరిగింది. నేపాల్‌లో సెప్టెంబర్ తిరుగుబాటుకు వీరే ప్రధాన చోదకులు.

గత పదేళ్ల నేపాల్ సంక్షుభిత రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే, ఆ దేశం ఆర్థికాభివృద్ధిలో పెద్దగా నష్టపోలేదని తెలుస్తుంది. 2025లో దాని వృద్ధి రేటు 6 శాతం స్థాయిలో ఉంది. ఐదుగురు యువకుల్లో ఒకరికి నిరుద్యోగం ఉన్నప్పటికీ, ఈ సమస్య ఎప్పుడూ పెద్దదిగా మారలేదు. నేపాలీ యువత ఎల్లప్పుడూ బయట ఉద్యోగాల కోసం చూస్తారు. సగటున ప్రతి సంవత్సరం 4 లక్షల మంది నేపాలీలు ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్తారు. అదేవిధంగా, నేపాల్‌కు విదేశాల నుండి భారీగా డబ్బు వస్తుంది. ఇది పర్యాటక రంగం నుండి వచ్చే ఆదాయంతో కలిసి దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుంది.



ప్రపంచ బ్యాంకు డేటా ప్రకారం, నేపాల్ ఆర్థిక సూచికలు అభివృద్ధి చెందుతున్నాయి. సింగపూర్‌లాగే వాహనాలపై అత్యధిక సుంకాలు వసూలు చేసే దేశం నేపాల్. అలాగే, దక్షిణాసియాలో స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి)కి పన్ను నిష్పత్తి అత్యధికంగా ఉన్న దేశం కూడా ఇదే. సామాజిక సూచికలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయి. 1990లో సగటు జీవిత కాలం 54.77 ఏళ్ల నుండి 2024లో దాదాపు 72 ఏళ్లకు పెరిగింది. ప్రాథమిక పాఠశాలల్లో నమోదు దాదాపు వంద శాతానికి చేరుకుంది. అక్షరాస్యత రేటు 2000లో 59 శాతం నుండి 2024లో 76 శాతానికి పెరిగింది. నేపాల్ జీవన ప్రమాణాల సర్వే 2022/23 ప్రకారం, పేదరికం 2011లో 25.16 శాతం నుండి 2023లో 20.27 శాతానికి తగ్గింది. ఆశ్చర్యకరంగా 81 శాతం మంది నేపాల్ ప్రజలు తమ సొంత ఇళ్లలో నివసిస్తున్నారు. ఐదుగురు నేపాలీ కుటుంబాలలోని నాలుగు కుటుంబాలలో కనీసం ఒకరైనా విదేశాలలో పనిచేస్తున్నారు లేదా నివసిస్తున్నారు. జనాభా 1991, 2021 మధ్య 10 మిలియన్లు పెరిగింది. ఇది మూడు దశాబ్దాలలో 50 శాతం పెరుగుదల.

కానీ, గత పదేళ్లుగా నేపాల్‌ను పరిపాలిస్తున్న పాతుకపోయిన రాజకీయ పార్టీల రాజకీయ నిర్వహణ తీవ్ర విమర్శల పాలైంది. ఈ కాలంలో పాలన కేవలం మూడు, నలుగురు రాజకీయ నాయకులకు, వారి కుటుంబాలకు, స్నేహితులకు మాత్రమే పరిమితమైందని, తద్వారా పెద్ద ఎత్తున అవినీతికి దారితీసిందనే అభిప్రాయాన్ని కలిగించింది. స్కూలు విద్యార్థుల మధ్య 'నెపో కిడ్స్' అనే చర్చ సర్వసాధారణమైంది. స్కూలు విద్యార్థులు చేసిన సెప్టెంబర్ ఉద్యమం, పాలక కుటుంబాల పిల్లలైన 'నెపో కిడ్స్'పై వారి కోపాన్ని వ్యక్తం చేసింది.

కె.పి.శర్మ ఓలీ, పుష్ప కమల్ దహల్ 'ప్రచండ', షేర్ బహదూర్ దేవ్‌బా అనే ముగ్గురు ప్రముఖ రాజకీయ నాయకులు అధికారంతో మ్యూజికల్ చెయిర్ ఆట ఆడుతున్నారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్) (సిపిఎన్ –యుఎంఎల్)కి చెందిన ఓలీ కమ్యూనిస్ట్ పార్టీలను చీలుస్తూ, ఏకం చేస్తూ నాయకత్వంలో కొనసాగగలిగారు. 72 సంవత్సరాల వయసులో ఆయన మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. ఆయన తన పార్టీలోని ఇద్దరు కీలక ప్రత్యర్థులను పార్టీ చీలికకు, కొత్త పార్టీ ఏర్పాటుకు పురికొల్పి పక్కన పెట్టగలిగారు. తనను వ్యతిరేకించే వారిని బహిష్కరిస్తూనే ఉన్నారు.

దహల్ 'ప్రచండ' హింసాత్మక తిరుగుబాటుకు నేతృత్వం వహించడం ద్వారా ప్రఖ్యాతి చెందారు. 2008లో రాజ్యాంగ సభలో సిపిఎన్ (మావోయిస్ట్ సెంటర్)కి అత్యధిక సీట్లు గెలవడం ద్వారా ఆయన తొలిసారిగా ప్రధానమంత్రి అయ్యారు. ఆ తర్వాత ఆయన రెండుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. 70 ఏళ్ల దహల్ అనేక కూటమిలలో భాగమయ్యారు. తన కుటుంబాన్ని వంశ పారంపర్య పద్ధతిలో భాగస్వామ్యం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన తిమ్మినిబమ్మి చేయడంలో దిట్ట. ఏదో ఒక విధంగా ఉన్నత స్థాయిలో కొనసాగేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారు.

ఈ ముగ్గురిలో దేవ్‌బా అందరి కంటే పెద్దవారు, ఆయనకు 79 ఏళ్లు. ఆయన ఐదుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. తెలివైన రాజకీయ నాయకుడైన ఆయనకు తన కుటుంబ ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో బాగా తెలుసు. ఆయన నేపాలీ కాంగ్రెస్‌తో విభేదించి తన సొంత ముఠాను ఏర్పాటు చేసుకొని, ఆ తర్వాత పునరేకీకరణ చేసి 2016 నుండి పార్టీని నడిపిస్తున్నారు. ఆయన తన ప్రత్యర్థి రామ్ చంద్ర పొదెల్‌ను అధ్యక్షుడిగా ఒక వైపు నెట్టేసి, వివిధ కుటుంబ ముఠాలను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పి కొయిరాలా కుటుంబానికి దూరంగా ఉన్నారు. ఆయనకు రాజకీయ సూత్రాలు లేవు. అత్యున్నత స్థానం కోసం ఎవరితోనైనా చేతులు కలపగలరు.

నేపాల్‌లో ఇంకా గందరగోళం కొనసాగుతోంది. నేపాల్ ఆర్మీ చీఫ్, ఆ దేశాధ్యక్షుడు ఉద్రిక్తతలను తగ్గించడానికి, విద్యార్థి ఆందోళనకారులతో చర్చలు జరపడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రదర్శనకారులకు స్పష్టమైన కార్యాచరణ లేదు. వారు కేవలం అవినీతికి, రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. నేపాల్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కార్కి తాత్కాలిక ప్రధాన మంత్రిగా నియమితులయ్యారు. మార్చి 2026లో తాజా సాధారణ ఎన్నికలు జరిగే వరకు ఆమె ఆరు నెలల పాటు ప్రభుత్వాన్ని నడుపుతారు. పార్లమెంట్ రద్దు చేయబడింది. ప్రస్తుత రాజకీయ పార్టీల పరిస్థితి ఎలా ఉంటుందో ఇంకా స్పష్టంగా తెలియదు, కానీ జనరేషన్ జెడ్ ప్రతినిధులు సైన్యాధిపతితో కలిసి కొత్త ప్రధానమంత్రి నేతృత్వంలో తదుపరి ప్రభుత్వం ఎలా పని చేయాలనే దానిపై సూచనలు చేస్తున్నారు.

భారతదేశం విషయానికొస్తే, పరిణామాలను పర్యవేక్షించడానికి, గమనించడానికి ఇది సమయం. నేపాల్‌లో తిరుగుబాటు సమయంలో భారత వ్యతిరేక భావన తక్కువగా ఉంది. పాలక కె.పి.ఎస్.ఓలి ప్రభుత్వంపైన, వివిధ రూపాల్లో చైనాకు దగ్గరగా ఉన్న మావోయిస్టులపైనే వారు ఎక్కువ దృష్టి సారించారు. గత రెండు దశాబ్దాలుగా భారతదేశం నేపాల్‌కు అనేక విధాలుగా సహాయం చేసినప్పటికీ, భారతదేశ అనుకూల భావన కూడా లేదు. ఫిబ్రవరి 2026లో జరిగే తదుపరి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి బంగ్లాదేశ్ కోటా వ్యతిరేక ప్రదర్శనకారులు తమ సొంత పార్టీ నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి)ని స్థాపించిన తరహాలో నేపాల్ విద్యార్థి నాయకులు ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తారా? లేదా? అనేది తెలిసిన తర్వాత రాజకీయ పరిస్థితి స్పష్టమవుతుంది. ఎన్‌సిపి భారతదేశానికి పచ్చి వ్యతిరేకి. జనరేషన్ జెడ్ విద్యార్థి ఆందోళనకారులు ఎలాంటి కార్యక్రమాన్ని చేపడతారు? భారతదేశంపై వారి వైఖరి ఎలా ఉండబోతుంది? అనే విషయాలను మనం వేచిచూడాలి.

(ఐపిఎ సర్వీస్)

# సార్క్‌లో ఒంటరైన భారత్!

ప్రధాని నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి 'నైబర్‌హుడ్ ఫస్ట్' (మొదట పొరుగు దేశాలు) కార్యక్రమం గురించి మాట్లాడుతున్నారు. అయితే, గడిచిన పదకొండేళ్ళ పాలనలో దక్షిణ ఆసియా ప్రాంతీయ సహకార మండలి (సార్క్) సభ్యులైన పొరుగు దేశాల నుండి భారతదేశం చాలావరకు ఒంటరైంది. సార్క్ లో దక్షిణ ఆసియాలోని ఏడు దేశాలు ఉన్నాయి. అవి భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, నేపాల్, మాల్దీవులు. ఈ దేశాలలో భారతదేశానికి ప్రస్తుతం మాల్దీవులు, శ్రీలంకతో మాత్రమే సాధారణ సంబంధాలు ఉన్నాయి. మాల్దీవులతో సంబంధాలు గతంలో క్షీణించినప్పటికీ, ఈ ఏడాది జూలైలో ప్రధాని మోదీ మాల్దీవుల పర్యటన, ఆరు ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల ద్వైపాక్షిక సంబంధాలు బాగా మెరుగుపడ్డాయి. బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో సంబంధాలు కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. పాకిస్తాన్‌తో సంబంధాలు క్షీణించడానికి కారణాలు ఉన్నప్పటికీ, బంగ్లాదేశ్ విషయంలో తాత్కాలి క అధిపతి డాక్టర్ ముహమ్మద్ యూనుస్ ద్వైపాక్షిక సంబంధాలను చర్చించడానికి మోదీని కలవాలని చేసిన ప్రయత్నాలను మోదీ తిరస్కరించడం తప్పు.

ఆఫ్ఘనిస్తాన్ విషయానికొస్తే, తాలిబాన్ ప్రభుత్వం భారత ప్రభుత్వానికి కొన్ని సంకేతాలు చేసింది. మహిళలకు సంబంధించిన వారి కఠినమైన చర్యల కారణంగా ఐక్యరాజ్యసమితి ఆఫ్ఘన్ ప్రభుత్వంపై ఆంక్షలు విధించినప్పటికీ, విదేశాంగ మంత్రిత్వ శాఖ స్థాయిలో చర్చలు ప్రారంభమయ్యాయి. భూటాన్‌తో సంబంధాలు మామూలుగానే ఉన్నాయి. భద్రతా కోణం నుండి భూటాన్ భారతదేశానికి ముఖ్యమైనది. ఇది భారతదేశం, చైనాల మధ్య ఒక బఫర్ దేశంగా పనిచేస్తుంది. ఇటీవల కాలంలో, భూటాన్ చైనా వైపు కొంత మొగ్గు చూపుతోంది, ఇది భారత ప్రభుత్వానికి నచ్చడం లేదు. అయినప్పటికీ, ద్వైపాక్షిక సంబంధాలు నియంత్రణలోనే ఉన్నాయి.

సార్క్ సమూహంలో అగ్రగామి దేశంగా భారతదేశం తన సొంత ప్రయోజనాల కోసం, అలాగే మొత్తం ప్రాంతం ప్రయోజనాల కోసం ఈ సమూహానికి నాయకత్వం వహించాల్సిన బాధ్యత ఉంది. కానీ 2016లో భారతదేశం పాకిస్తాన్‌లో జరిగిన సార్క్ శిఖరాగ్ర సదస్సును బహిష్కరించింది. నాటి నుండి భారతదేశం దీనిపై ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా సార్క్ పనిచేయడం లేదు, అప్పటి నుండి దాని వార్షిక సమ్మిట్లు జరగడం లేదు.

సార్క్ సభ్య దేశం కానప్పటికీ చైనా చొరవ తీసుకొని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో సార్క్ పునరుద్ధరణ గురించి మాట్లాడింది. గత సంవత్సరం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి హాజరైనప్పుడు నేపాల్ మాజీ ప్రధానమంత్రి, శ్రీలంక అధ్యక్షుడితో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సార్క్ పునరుద్ధరణ గురించి చర్చించారు. ఈ నెల చివరలో జరగబోయే ఐక్యరాజ్యసమితి సమావేశంలో కూడా పాకిస్తాన్ ప్రధాని ఇతర సభ్య దేశాలతో సార్క్ గురించి చర్చలను ముందుకు తీసుకువెళ్లవచ్చు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ సమావేశానికి హాజరు కావడం లేదు. కాబట్టి షరీఫ్ తన ప్రయత్నాలను కొనసాగించడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. నరేంద్ర మోదీకి ముందు ఇతర సార్క్ సభ్య దేశాల నుండి భారతదేశం గౌరవాన్ని పొందింది. ప్రస్తుత మోదీ ప్రభుత్వం దక్షిణ ఆసియా రాజకీయాలలో అర్థవంతమైన పాత్ర పోషించాలనుకుంటే, ఆ గౌరవాన్ని తిరిగి పొందాలి. లేకపోతే అనేక సార్క్ దేశాలతో సరిహద్దులు కలిగిఉన్న చైనా, సార్క్‌లో సభ్యత్వాన్ని కోరి, తన మిత్ర దేశాల సహాయంతో పునరుద్ధరించబడిన సార్క్ నాయకత్వాన్ని చేజిక్కించుకునే అవకాశం లేకపోలేదు.




## ప్రధాన కార్యదర్శుల జీవిత సంగ్రహం

### ఇంద్రజిత్ గుప్తా



ఇంద్రజిత్ గుప్తా సుప్రసిద్ధ కార్మిక నాయకుడు. 11 సార్లు లోక్‌సభకు ఎన్నికైన ప్రజా నాయకుడు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత. గుప్తా 1919 మార్చి 18న కలకత్తాలో జన్మించారు. 1937లో ఢిల్లీలో సెయింట్ స్టీఫెన్స్ కాలేజి నుంచి డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. ఉన్నత విద్య కింగ్స్ కాలేజి, కేంబ్రిడ్జిలో అభ్యసించారు. ఇంగ్లండ్‌లో చదువుకుంటున్నప్పుడే కమ్యూనిజం పట్ల ఆకర్షితులైనారు. కేంబ్రిడ్జిలో భారతీయ విద్యార్థులు ఒక బృందంగా ఫాసిస్టు చైతన్యం పెంపొందించుకున్నారు. ఆ బృందంలోని సభ్యులందరూ తర్వాత కాలంలో కమ్యూనిస్టుపార్టీలో ప్రముఖ నాయకులయ్యారు. భూపేష్ గుప్తా, జ్యోతి బసు, నిఖిల్ చక్రవర్తి, రేణూ చక్రవర్తి, మోహనకుమార మంగళం, పార్వతీ కృష్ణన్, అరుణ్‌బోస్, రమేశ్ చంద్ర తదితరులు వారిలో ఉన్నారు.

ఇంద్రజిత్ గుప్తా అర్థశాస్త్రం, చరిత్ర అధ్యయనం చేశారు. 1940లో కేంబ్రిడ్జి యూనివర్శిటీ నుంచి 'ట్రిపోస్' అనే పట్టా పొందారు. అదే సంవత్సరం అక్టోబర్‌లో స్వదేశం తిరిగి వచ్చారు. తదుపరి భారత కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించి కొరియర్‌గా పనిచేశారు. తదుపరి బొంబాయిలో పార్టీ అఖిలభారత కేంద్రంలో పనిచేశారు. ఢిల్లీ, లాహోర్, కలకత్తా, లక్నో తదితర నగరాలకు నిషిద్ధ కమ్యూనిస్టు సాహిత్యాన్ని ట్రంకు పెట్టెలో చేరవేయటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొరియర్‌గా భవానీ సేన్, సోమనాథ్ లాహిరికి తోడ్పాటు అందించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేయటానికి కొంతముందు గుప్తా బెంగాల్ కేంద్రానికి బదిలీ అయ్యారు. అక్కడే ఆయన ట్రేడ్ యూనియన్ జీవితం ఆరంభమైంది. 1951లో ఎఐటియుసి కార్యదర్శిగా ఎన్నికైనారు. 1980 నుంచి 1990 వరకు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శిగా,1982 నుంచి 1998 వరకు ప్రపంచ కార్మిక సమాఖ్య ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

1958లో సిపిఐ జాతీయ సమితికి, 1964లో కేంద్ర కార్యవర్గానికి, 1971లో కేంద్ర కార్యదర్శివర్గానికి ఎన్నికైన గుప్తా 1988లో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వర రావు అనారోగ్య కారణాలతో 1990లో జాతీయ సమితి సమావేశంలో రాజీనామా చేయటంతో ఇంద్రజిత్ గుప్తా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 1992లో హైదరాబాద్, 1995లో న్యూఢిల్లీ పార్టీ కాంగ్రెస్‌ల్లో ప్రధాన కార్యదర్శి గా ఆయన తిరిగి ఎన్నికైనారు. 1996లో దేవగౌడ ప్రధానిగా ఏర్పడిన ఐక్య సంఘటన ప్రభుత్వంలో హోంమంత్రిగా, చతురానన్ మిశ్రా వ్యవసాయ మంత్రిగా చేరారు. వీరే కేంద్రంలో తొలి కమ్యూనిస్టు మంత్రులు. గుప్తా మంత్రివర్గంలో చేరాక పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసి కార్యదర్శి వర్గంలో కొనసాగారు.

రెండో లోక్‌సభకు తొలిసారి ఎన్నికైన ఇంద్రజిత్ పార్టీ ఆరవ లోక్‌సభలో (1977–79) మినహా 2001 ఫిబ్రవరి 20న కన్నుమూసేవరకు సభ్యుడిగా ఉన్నారు. 1971 నుంచి 1977 వరకు, తిరిగి 1981 నుంచి లోక్‌సభలో సిపిఐ పక్షం నాయకునిగా పనిచేశారు. 1992లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గోవింద వల్లభ్ పంత్ తొలి పురస్కారం అందుకున్నారు. 12, 13వ లోక్‌సభలకు ప్రోటెం స్పీకర్‌గా వ్యవహరించే గౌరవం ఆయనకు దక్కింది.

### ఎ.బి.బర్ధన్



మార్క్సిస్టు మేధావి, మంచి వక్త, కార్మికవర్గం ఇతర కష్టజీవుల జీవితాల మెరుగుదలకు జీవితాన్ని ధారపోసిన ధన్యజీవి ఎ.బి.బర్ధన్. ఇంద్రజిత్ గుప్తా తదుపరి – 1996 నుంచి, 2012 మార్చిలో రిటైర్ అయ్యే వరకు 14 సంవత్సరాలుపైగా భారత కమ్యూనిస్టుపార్టీని బలోపేతం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని లోతుగా అధ్యయనం చేసి అది భారతదేశ సమైక్యత, సమగ్రతకు ప్రమాదకారి అని ఎండగట్టిన వ్యక్తి. రెండవ తరం కమ్యూనిస్టు నాయకుల్లో ఆయన చివరి వ్యక్తి.

బర్ధన్ బెంగాల్ ప్రెసిడెన్సీలోని బరిసాల్ (ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉంది) లో 1924 సెప్టెంబర్ 24న జన్మించారు. నాగపూర్ (మహారాష్ట్ర)కు నివాసం మారిన తదుపరి కమ్యూనిజంవైపు ఆకర్షితులైనారు. 1940లో నాగపూర్ యూనివర్శిటీలో విద్యార్థిగా ఎఐఎస్‌ఎఫ్‌లో చేరారు. యూనివర్శిటీ విద్యార్థి యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికైనారు. 1945లో ఎఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. బర్ధన్ అర్థశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందారు. 1957లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికైనారు. జౌళి, విద్యుచ్ఛక్తి, రైల్వేలు, రక్షణ ఉత్పత్తులు వగైరా పరిశ్రమల్లో ట్రేడ్ యూనియన్‌లు నిర్మించారు.

బర్ధన్ తొలుత సిపిఐ మధ్య భారత్ ప్రొవిన్షియల్ కమిటీకి, పిమ్మట మహారాష్ట్ర రాష్ట్ర సమితికి, 1968లో సిపిఐ జాతీయ సమితికి, 1978లో కేంద్ర కార్యవర్గ కమిటీకి ఎన్నుకోబడ్డారు. 1994లో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బర్ధన్ 1995 అక్టోబర్ 7–11 తేదీల్లో ఢిల్లీలో జరిగిన సిపిఐ 16వ కాంగ్రెస్‌లో పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ఇంద్రజిత్ గుప్తా 1996లో కేంద్ర హోం మంత్రి బాధ్యతలు స్వీకరించాక బర్ధన్ ప్రధాన కార్యదర్శి అయినారు. తదుపరి చెన్నై(1998), తిరువనంతపురం (2002), చండీఘడ్ (2005), హైదరాబాద్ (2008) పార్టీ కాంగ్రెస్‌ల్లో ప్రధాన కార్యదర్శిగా ఆయన వరుసగా ఎన్నికైనారు. పుదుచ్చేరి పార్టీ కాంగ్రెస్ (2015) ఆమోదించిన ముసాయిదా 'పార్టీ కార్యక్రమం' బర్ధన్ చొరవతో తయారైందే.

2004లో వాజ్‌పేయి, అద్వానీ ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించాక కాంగ్రెస్, లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష పార్టీలతో యుపిఎ ప్రభుత్వం ఏర్పాటులో సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్‌తో కలిసి బర్ధన్ కీలక పాత్ర పోషించారు. రాష్ట్రపతి పదవికి ప్రతిభా పాటిల్ పేరును యుపిఎ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రతిపాదించింది బర్ధనే అంటారు.

బర్ధన్ శ్రీమతి పద్మ సరస్వతీ హయ్యర్ సెకండరీ స్కూలు (నాగపూర్) టీచర్. వారికి కుమారుడు అశోక్, కుమార్తె అల్కా బారువా సంతానం. పద్మ 1986లో చనిపోయారు.అప్పటినుంచి బర్ధన్ ఢిల్లీలో పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో ఒక గదిని తన నివాసం చేసుకున్నారు. ఆయన మరాఠీతోపాటు బెంగాలీ, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషలు సునాయాసంగా మాట్లాడగలరు. 2015 డిసెంబర్‌లో పక్షవాతానికి గురైన బర్ధన్ 2016 జనవరి 2న తన 91వ ఏట ఢిల్లీలో ఆసుపత్రిలో కన్నుమూశారు.

### సురవరం సుధాకరరెడ్డి



విద్యార్థి, యువజన సంఘాలు, ఉద్యమాల నిర్మాణంలో నుంచి ఆవిర్భవించిన మిలిటెంట్ యోధ సురవరం సుధాకరరెడ్డి 2012 నుంచి 2019 వరకు సిపిఐ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతకు ముందు 2007 నుంచి డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

సుధాకరరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో 1942 మార్చి 25న మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావ్‌పల్లి గ్రామంలో జన్మించారు. తెలంగాణ నవయుగ వైతాళికుడిగా ప్రసిద్ధి పొందిన సురవరం ప్రతాపరెడ్డి వీరికి స్వయాన చిన్నాన్న. కర్నూలులో హైస్కూలు విద్య, కర్నూలులోని ఉస్మానియా కాలేజీలో బి.ఎ, హైదరాబాద్‌లో ఉస్మానియా లా కాలేజీలో ఎల్‌ఎల్ బి చదివారు. కర్నూలులో ఎఐఎస్‌ఎఫ్‌లో క్రియాశీలక పాత్ర పోషించారు. 19ఏళ్లకే ఎఐఎస్‌ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా, 1960 నాటికి కర్నూలు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

1962లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 56రోజులపాటు ఏకధాటిగా సాగిన సమ్మెకు నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు. 1966లో ఎఐఎస్‌ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. 1970లో ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడిగా ఎన్నికై కార్యస్థానాన్ని ఢిల్లీకి మార్చారు. 1971లో సిపిఐ జాతీయ సమితి సభ్యుడైనారు. అంతకు ముందు 1969లో "18ఏళ్లకే ఓటు హక్కు" డిమాండ్‌తో పార్లమెంటుకు యువజన – విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. 1972లో ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేబట్టి, సికె.చంద్రప్పన్ ప్రధాన కార్యదర్శిగా, కశ్మీర్ నుంచి కేరళ వరకు జీపు జాతా నిర్వహించారు. వివిధ ఆందోళనల సందర్భంలో ఢిల్లీ, కలకత్తా, పట్నా, లక్నో తదితర నగరాల్లో అరెస్టు అయి జైల్లో గడిపారు.

1992లో రాజమండ్రిలో జరిగిన సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలో సహాయ కార్యదర్శిగా ఎన్నికై రెండు పర్యాయాలు 1997 వరకు పనిచేశారు. 1997 నుంచి 2005 వరకు రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలు, చార్జీల పెంపుదల వ్యతిరేక ఉద్యమంలో ఆయన నాయకుడిగా రాణింపు పొందారు.

1985, 1989లలో కొల్లాపూర్ నియోజకవర్గం నుండి, 1994లో కర్నూలు నుంచి అసెంబ్లీకి పోటీ చేశారు. 1998లో నల్లగొండ లోక్‌సభ స్థానం నుండి తొలిసారి పోటీ చేసి ఎన్నికైనారు. అయితే ఆ సభ 1999లోనే రద్దయింది. 2004 ఎన్నికల్లో అదే నల్లగొండ స్థానం నుంచి లోక్‌సభకు తిరిగి ఎన్నికై పూర్తి ఐదు సంవత్సరాలు పనిచేశారు. కార్మికశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ఐరాసలో భారత ప్రతినిధిగా ప్రసంగించారు. విద్యార్థి, యువజన నాయకునిగా ఉన్న రోజుల్లో అనేక అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొన్నారు. పలు దేశాలు పర్యటించారు.

2008లో హైదరాబాద్‌లో జరిగిన సిపిఐ 20వ కాంగ్రెస్‌లో పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎన్నుకోబడ్డారు. 2012 (పట్నా), 2015 (పుదుచ్చేరి), 2018 (కొల్లాం, కేరళ)లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లలో ప్రధాన కార్యదర్శిగా వరుసగా ఎన్నికైనారు. ఆరోగ్య కారణాలతో 2019లో ఆ బాధ్యతలు విరమించుకున్నారు.

2025 ఆగస్టు 22న హైదరాబాద్‌లో అసువులు బాశారు.

### డి.రాజా



సిపిఐ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి దొరైస్వామి రాజా కమ్యూనిస్టు నాయకునిగా, రాజ్యసభ సభ్యునిగా జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న వ్యక్తి. తమిళనాడు వెల్లూరు జిల్లాలోని చితాత్తూర్ గ్రామంలో 1949 జూన్ 3న జన్మించారు. తల్లిదండ్రులు వ్యవసాయ కార్మికులు. ఆయన కష్టపడి చదువుకున్నారు. గుడియాట్టంలో బి.ఎస్‌సి ఉత్తీర్ణత తదుపరి వెల్లూరులో బి.ఇడి. చదువుకున్నారు. ఏదో టీచరు ఉద్యోగం సంపాదించుకుని కుటుంబాన్ని పోషిస్తాడని తల్లిదండ్రులు అనుకుంటే, ఆయన కాలేజీ రోజుల్లోనే ఎఐఎస్‌ఎఫ్‌లో చేరి క్రమంగా కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షితుడై మార్క్సిజం – లెనినిజం అధ్యయనం చేశారు. 1975–80లో తమిళనాడు రాష్ట్ర అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐవైఎఫ్) కార్యదర్శిగా పనిచేశారు. 1980లో ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలో దాని ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, నివాసం ఢిల్లీకి మార్చారు. అదే ఆయన శాశ్వత చిరునామా అయింది. 1994లో సిపిఐ కార్యదర్శివర్గం సభ్యునిగా ఎన్నుకోబడిన రాజా, 2019 జులై 21 జాతీయ సమితి ద్వారా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడినారు. 2022 అక్టోబర్‌లో విజయవాడలో జరిగిన పార్టీ 24వ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా రాజా తిరిగి ఎన్నికైనారు.

తమిళనాడు అసెంబ్లీ నుండి 2007 జులైలో తొలిసారి రాజా రాజ్యసభకు ఎన్నికైనారు. 2013లో మరో పర్యాయం ఎన్నికైనారు.

## భవానీనగర్‌లో విరాట్ విశ్వకర్మ పూజ మహోత్సవం



ప్రజాపక్షం/కాప్రా : కాప్రా కార్పెంటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కాప్రా భవానినగర్‌లో విరాట్ విశ్వకర్మ పూజ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కరరెడ్డి పాల్గొని విశ్వకర్మ పతాకాన్ని ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యాక్రమంలో కాప్రా కార్పెంటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు గజ్వేల్ వెంకటేష్‌చారి, ప్రధాన సలహా దారు జ్యోతిర్మయిచారి, అధ్యక్షుడు రాజు చారి, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, కోశాధికారి సద్గురు చారి, కార్యవర్గ సభ్యులు భార్గవచారిలతో పాటు నరసింహాచారి, పూర్ణాచారి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ మెటీరియల్ అందజేత



ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ కమలానగర్ స్ఫూర్తి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ మెటిటీరియల్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి చేతుల మీదుగా స్కూల్ మాజీ ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ మేనల్లుడు సిరిపురం హరిప్రసాద్ జ్ఞాపకార్థం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, డిసిఎస్ రవికుమార్, డిసిటి కిరణ్ కుమార్, సిరిపురం రంగయ్య, లయన్ పిఆ ర్‌పి రాజు, హెచ్ఎం ఆదినారాయణ, సంజీవరెడ్డి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యాన... తెలంగాణ విలీనదినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/తాండూరు: సిపిఐ పార్టీ ఆధ్వర్యాన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యాన జాతీయ జెండాను ఎఐటియుసి జిల్లా



కార్యదర్శి రవిందర్ ఎగురవేయగా సిపిఐ జెండాను పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు నసీమా బేగం ఎగురవేశారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన కామ్రేడ్ రావినారాయణరెడ్డి,ముక్దుం మోయుద్దీన్, బద్దం ఎల్లారెడ్డిలకు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాయకత్వం వహించిన అరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, మల్లు స్వరాజ్యం ధర్మవిక్షం, షేక్ బందగి, శ్రేయబుల్లాఖాన్ లాంటి అనేక మంది త్యాగాలను స్మరించుకుంటూ వారికి జోహర్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో విజయ్, మంగమ్మ, శివ,పుష్ప, దస్తప్ప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్‌లో:** వికారాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఐ అధ్వర్యంలో తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా ఎంటిఆర్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వరలో గెరిల్లా పోరాటంలో చేసి 4500 మంది నిజాం తుపాకీ తూటలకు బలైనరు అని అన్నారు. ఎంతమంది కమ్యూనిస్టుల ప్రాణత్యాగమే తెలంగాణ విమోచన దినోత్సవం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేకంగా విదనలు మంచిది కాదని ప్రజలు తిరుగబడే రోజు వస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి ,అబ్దుల్లా ,అనంతయ్య , భీరయ్య నర్సింలు ,తదితరులు పాల్గోన్నారు.





## నాగారంలో ఉచిత హెల్త్ క్యాంపు

ప్రజాపక్షం/నాగారం:భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు రామకృష్ణ నగర్ కమ్యూనిటీ హాలులో అపోలో హస్పిటల్ సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంపును మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ క్యాంపులో జనరల్ ఫిజిషియన్, కంటి, దంత, క్యాన్సర్ ఇతర పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, కాలనీవాసులు, తదితరు లు పాల్గొన్నారు.

## విశ్వకర్మ మహోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రజాపక్షం/నాగారం: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జిఆర్ఎస్ఎస్ గార్డెన్‌లో కీసర మండల విశ్వ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎంఎల్ఎ చామకూర మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డిలు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి సభ్యులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు అనంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు అన్నంరాజు శ్రీనివాస్, కొమిరెల్లి సుధాకర్ రెడ్డి, సాయినాథ్‌గౌడ్, శ్రీధర్, సభ్యులు రాఘవేంద్రచారి, చంద్రం చారి, కనకచారి, తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ ఫుడ్ కలర్ ఐస్‌క్రీమ్ యూనిట్ నిర్వాహకుడు అరెస్ట్

ప్రజాపక్షం/ఉప్పల్: చిన్న పెద్ద అనే తేడా లేకుండా ఇష్టంగా తినే ఐస్ క్రీమ్ లో అనారోగ్యం కలిగించే ఫుడ్‌కలర్‌ను కలిపే ఐస్ క్రీమ్ యూనిట్ పై మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసుల దాడి. వివరాలలోకి వెళితే ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి రామంతపూర్ శారదనగర్‌లో నకిలీ సింథటిక్ ఫుడ్ కలర్స్‌తో ఐస్ క్రీమ్ తయారుచేస్తున్న యూనిట్‌పై మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. శివసాగర్ ఫలూదా ఐస్ క్రీమ్ పేరుతో నడుస్తున్న ఈ యూనిట్‌లో పెద్దఎత్తున అనారోగ్యకర పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ రహస్య ఆపరేషన్‌లో యూనిట్ నిర్వాహకుడు దేవిలాల్ జాట్(51) ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు తయారుచేస్తున్న ఉత్పత్తుల్లో హానికరమైన సిథటిక్ ఫుడ్ కలర్స్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. తర్వాత స్వాధీనం చేసుకున్న నిషేధిత ఐటమ్స్‌తో పాటు నిందితుడిని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాపక్షం/నాగారం: ఓ యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం కీసర పిఎస్ పరిధిలోని బండ్లగూడ ఇందిరమ్మ కాలనీకి చెందిన రుద్రకుమార్‌దాస్(20) ప్లంబర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రోజున తనతో పాటు చీర్యాల గ్రామానికి చెందిన సురేష్ ధారావత్‌తో కలసి యాద్గర్‌పల్లి మెట్టు నరసింహ ఇంటికి ప్లంబింగ్ పనికి వెళ్లారు. పనిచేస్తుండగా డ్రిల్లింగ్ మిషన్ వైరుతో కరెంటు షాకు తగిలి అపస్మారక స్థితికిలోకి వెళ్లాడు. దీంతో కీసరలోని లైఫ్ సేవ్ ఆసుపత్రికి తరలించగా డ్యూటీలో ఉన్న డాక్టర్ అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## ప్రజలందరూ తమ హక్కులను ఉపయోగించుకుంటూ

# దేశాభివృద్ధికి పాటుపడాలి

### స్పీకర్ ప్రసాద్‌కుమార్




ప్రజాపక్షం/వికారాబాద్: ప్రజలందరూ తమ హక్కులను ఉపయోగించుకుంటు బాధ్యతలను విస్మరించకుండా దేశ సేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలని శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ సందర్భంగా ముఖ్యఅతిథిగా వచ్చేసిన స్పీకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి స్పీకర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని, భారత స్వాతంత్ర్య పోరాటంలో జాతీయనాయకులు పాల్గొని బ్రిటీష్‌వారి నుండి భారతజాతిని విముక్తి చేసినప్పటికీ ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న మెజారిటీ సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యాయన్నారు. స్వాతంత్ర్య సంబరాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై పోరాడుతూనే ఉన్నారని స్పీకర్ తెలిపారు. 85శాతం ప్రజలు మాట్లాడే స్థానిక భాషపై అణచివేత, వెట్టిచాకిరి, బానిసత్వం కొనసాగిందని, మరోవైపు ప్రైవేట్ సైన్యం, రజాకర్ల దమనకాండ కొనసాగుతుండడంతో ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు చైతన్యంపొంది సాయుధ రైతాంగా పోరాటాలు చేసి ఎంతోమంది తమ ప్రాణాలు కోల్పోయారని స్పీకర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిరు పేదల సొంత ఇంటి కల నిజం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాకు 13, 640 ఇళ్లలో ఇప్పటివరకు 11,681గృహాలు నిర్మించడానికి ఆమోదించడం జరిగిందని ఆయన అన్నారు.

మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయణం, 500ల రూపాయలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందించినట్లు తెలిపారు. 2047 నాటికి భారతదేశం ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేస్తుంది అని అన్నారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థినిల సాంస్కృతిక కార్యక్రమాలే తెలంగాణ సారథి. కళాకారులు ఆలపించిన గేయాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేమనోహర్‌రెడ్డి, ఎస్‌పి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## స్వస్తనారి సశక్తి పరివార్ అభియాన్ మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభం

ప్రజాపక్షం/వికారాబాద్:వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్ మోగా హెల్త్ క్యాంపును జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తో కలిసి తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ మహిళలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ మెగా వైద్య శిబిరంలో 56 రకాల టెస్టులు, 17రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని మహిళలు అంద రూ ఉపయోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ మెగా వైద్యశిబిరం ప్రధానమంత్రి నరేంద్రమోది పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ సహకారాలను అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధన్యత ఇస్తూ పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



## సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాపక్షం /దోమ: పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిగి సబ్‌డివిజన్ షీటీం ఇన్‌చార్జీ నర్సింలు ,ఎస్ఐ వసంత్ జాదవ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ మోసాలపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నిర్మూలన ,బాకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్రు బాధ్యతగా కృషి చేయాలని తెలిపారు.

మధ్యపాన నిషేధం ,కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజీలయ్య, షీటీం సభ్యురాలు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు పట్టణ శివారులోని విశ్వకర్మ గుట్ట ప్రాతంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విశ్వకర్మ తాండూరు నియోజకవర్గం సంఘం ఆద్వర్యాన బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జయంతి వేడుకలను పురస్కరించుకుని గుట్టపైన విరాజ్ విశ్వకర్మ మహాయజ్ఞాన్ని నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డిలు పాల్గోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన యజ్ఞా కార్యక్రమంలో పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోల బాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమరావు, కోట్ పల్లి ఎఎంసి వైస్ చైర్మన్ నారాయణరెడ్డి,నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లేశం,మాజీ వైస్ ఎంపిపి మధులత, విశ్వకర్మ సంఘం నాయకులు శ్రీనివాస్‌చారిలు, డాక్టర్ జయప్రసాద్ విశ్వకర్మలు పెద్దఎత్తున్న పాల్గోన్నారు.


## భర్త వేధింపులకు భార్యమృతి

ప్రజాపక్షం/కోట్‌పల్లి : వికారాబాద్ నియోజకరవ్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని నాగసన్నపల్లిగ్రామానికి చేందిన తెలుగు అనసూజ భర్త వేదింపులతో భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. భర్త భిక్షపతి మద్యానికి బానిసై తరుచూ భర్యతో గొడవ పెట్టుకోవడంతో విసిగిపోయిన భార్య మంగళవారం పురుగుల మంది తాగి ఆత్మహత్యకు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వికారాబాద్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యలు నిర్ధారించారు. అనుసూయ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవ పరీక్ష నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మృతుదేహాన్ని కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శైలజ తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/వికారాబాద్:వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగాడి సమీపంలోని బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ఢీసిఎం బైకును ఢీ కొట్టడంతో



బైకుపైన ఉన్న వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందా రు. వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్దిగ్రామానికి చెందిన శ్రీనివాస్ గా పోలీస్‌లు గుర్తించారు. హైదరాబాద్‌లోని రైల్వే డిపార్ట్‌మెంట్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు కుటుంబికులు తెలిపారు. సమాచారం అందుటంతో పోలీసులు శావన్ని మర్చరికి తరలించి కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాల రెపరెపలు

### జెండా ఎగురవేసిన కమిషనర్‌లు, తహసీల్దార్‌లు, ఎంపిడిఒలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మున్సిపల్ కమిషనర్‌లు, తహశీల్దార్‌లు, ఎంపిడిఒలు జాతీయ జెండాలను ఎగురవేసి జాతీయ గీతం ఆలాపించారు. తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్యోతి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం స్వచ్ఛతా హిసేవా 2025లో భాగంగా నేటి నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను బీమిడి జైపాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చంద్రశేఖర్, మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పవన్ కుమార్, శామీర్‌పేట తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ యాదగిరి రెడ్డి, మూడుచింతలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, శామీర్‌పేట ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సంపత్‌కుమార్, మండల విద్యావనరుల కేంద్రంలో విధ్యాదికారి కమలాకర్, వ్యవసాయాధికారి రమేష్, మహిళా బ్యాంక్‌లో సుమతి, గ్రామణాబివృద్ధి కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి , శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌లు జాతీయ జెండాలు ఎగురవేసి జాతీయ గీతం ఆఆపించారు.




**తాండూరులో:** తాండూరు పట్టణంలో తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కమీషనర్ యాదగిరి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేకమైన స్వచ్ఛత హీసేనా కార్యక్రమాన్ని కమీషనర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, డిఈ, శానీటరీ ఇన్స్‌పెక్టర్, సిబ్బంది, మాజీ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

**పరిగిలో :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజాపాలనలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడమే ప్రజాపాలన అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ప్రతినియోజకవర్గనికి 3500 ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గోన్నారు.



## ప్రభుత్వోద్యోగులు విధి నిర్వహణ సేవాభావంతో కొనసాగిస్తే మేలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ప్రభుత్వోద్యోగులు తమ విధి నిర్వహణ సేవా భావంతో కొనసాగిస్తూ ప్రజలకు మేలు జరిగేందుకు దోహదపడి సమాజంలో తమ గౌరవాన్ని కాపాడుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన తెలంగాణా ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన తెలంగాణా గౌవర వందనం చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వోద్యోగులు నీతి నిజాయతీగా తమ విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, డిఆర్ఓ హరిప్రియ, డిఆర్డీఓ సాంబశివరావు, పరిపాలనాధికారి రాంమోహన్, ఇన్‌చార్జి డిఆర్డీఓ పిడి కాంతమ్మ, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింలు, తదితరులు పాల్గొన్నా రు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మండల విద్యాధికారి కమలాకర్‌లు బుధవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ హాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులైన శారద, జడ్పిహెచ్ఎస్ తుర్కపల్లి, పద్మ జడ్పిహెచ్ఎస్ తూంకుంట, జ్యోతి జడ్పిహెచ్ఎస్ దేవరయాంజాల్, కవిత ఎంపిపిఎస్ తుర్కపల్లి, శ్వేత ఎంపిపిఎస్ అలియాబాద్, అరున్‌కుమార్ ఎంపిపిఎస్ మజీద్‌పూర్, ఝాన్సి ఎంపిపిఎస్ మజీద్‌పూర్, భానుప్రకాష్ జడ్పిహెచ్ఎస్ లాల్‌గడిమలక్‌పేట, మురళి ఎంపిపిఎస్ సింగాయిపల్లి ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్షులు తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి కుమార్, పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి గోపాల్, ఎస్‌టియుటిఎస్ అధ్యక్షులు సురేందర్, టిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వెంకట్రామ్‌రెడ్డి, టియుటిఎఫ్ జిల్లా అద్యక్షులు రాజు, ప్రధానోపాధ్యాయులు గోపాల్, మోహన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, ల, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డబ్బులు పెట్టు... ప్యానల్ బోర్డు పట్టు

ప్రజాపక్షం/ఉప్పల్ : నిబంధనలు తుంగలో తొక్కి విద్యుత్ శాఖ హబ్సిగూడా సర్కిల్, హబ్సిగూడా డివిజన్‌లోని పలు సెక్షన్‌లలో జీహెచ్ఎంసీ నుండి అనుమతులు లేకుండా నిర్మాణం చేసిన గృహాలకు విద్యుత్ ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ ప్యానల్ బోర్డులను మంజూరు చేయాలంటే జీహెచ్ఎంసీ నుండి అనుమతి తీసుకుని భవనం కు సంబంధించిన ఓసీ (ఆక్యుపెన్సీ సర్టిఫికేట్) వచ్చిన తర్వాత ప్యానల్ బోర్డులను బిగించాలి కానీ నిబంధనలు అతిక్రమించి డబ్బులకోసం ఆయా గృహ యజమానులతో ఆన్లైన్ లో ప్యానల్ బోర్డుకి అనుమతుల కోసం వినతులు పెట్టుకుంటారు. అలా పెట్టిన వినతులు తిరస్కరించినట్లు ఆన్లైన్‌లో చూపిస్తుంది. కానీ విద్యుత్ ప్యానెల్ బోర్డు మాత్రం ఆయా గృహాలకు విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తున్న వైనం కనిపిస్తుంది. నిబంధనల ప్రకారం వై సిరీస్ తో వచ్చిన అనుమతులను తిరస్కరణ చేయాలన్న నిబంధనలు కూడా విద్యుత్ శాఖ అధికారులు మరిచారని పలు ఆరోపణలు వస్తున్నాయి. రెండు అంతస్తులు ఉన్న భవనానికి కూడా ప్యానల్ బోర్డులు బిగించడం ఏంటని, ప్యానల్ బోర్డుకు బదులు అదనపు మీటర్లు ఎందుకు ఇవ్వడం లేదు..ఇదంతా కావాలని విద్యుత్ శాఖ కింది స్థాయి ఉద్యోగులు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.





## ఎంతోమంది త్యాగాల ఫలితంగా తెలంగాణ సాధించుకున్నాం

ప్రజాపక్షం/నవాబుపేట్ : ఎంతోమంది ఉద్యమకారుల వారి పోరాట అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని నవాబుపేట్ ఎమ్మార్వో బుచ్చయ్య అన్నారు. బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నవాబుపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రజాప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రజాప్రభుత్వం అన్నారు. తెలంగాణ ఏర్పాటులో ఎంతో మంది ఉద్యమకారులు అమరుల త్యాగాల ఫలితంగా ఈరోజు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ను ప్రవేశపెట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాలన కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బుచ్చయ్య, డిప్యుటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన గ్రామపరిపాలన అధికారులు



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారులు బాధ్యతలు చేపట్టారు. బుధవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు బాధ్యతలు చేపట్టిన అధికారులకు అర్డర్ కాపీలను తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అందజేశారు. కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి రవికుమార్, కొత్తూరు2కు సత్యనారాయణ, కొత్తూరు1కు నర్సింహ్మా, కొడిచర్లకు శ్రీనివాస్, గుడూరుకు అర్జున్, పెంజర్లకు దామోదర్, తిమ్మాపూర్‌కు శివకుమార్, సిద్దాపూర్‌కు రాజులు గ్రామ పరిపాలన అధికారులుగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐ సంజీవ, ఆర్ఐ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.

## స్వచ్ఛతకు ప్రతిఒక్కరూ సహకరించాలి




**ప్రజాపక్షం/తుర్కయాంజల్ :** స్వచ్ఛత కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తుర్కయంజాల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిషనర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఇ భిక్షపతి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, రెవిన్యూ ఆఫీసర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, ఎఇ చంద్రశేఖర్ రెడ్డి, అకౌంటెంట్ ఉషా, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు వినయ్, బాల్ రాజ్, టీఎంసీ మల్లిక ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సురేష్ పాల్గొన్నారు

## ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం కార్యాలయం వద్ద జాతీయ జెండాను కమిషనర్ రవీంద్రర్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ పోస్టర్ అవిష్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ కిరాన్, మాజీ కౌన్సిలర్ పసుల రాజేంద్రర్, నాయకులు చామవిజశేఖర్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.
**బాటసింగారం పండ్ల మార్కెట్‌లో..** ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించికొని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ బాటాసింగారం కార్యాలయం వద్ద జాతీయ జెండాను మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూధన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ భాస్కరచారి, మార్కెట్ కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, మచ్చేందర్‌రెడ్డి, అంజయ్య,గణేష్, రఘుపంతి పాల్గొన్నారు.

## ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



**ప్రజాపక్షం/అబ్దులాపూర్‌మెట్ :** అబ్దులాపూర్‌మెట్‌లో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ వైస్ చైర్మన్ సిహెచ్.భాస్కరచారి హాజరై జెండా అవిష్కరించారు. కార్యక్రమంలో మధుసూదనాచారి, రజమౌళి, పద్మాచారి, బాలక్రిష్ణ చారి, వెంకటచారి, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధి ప్రధాని మోదీతోనే

### మాజి ఎంపి డాక్టర్ బుర నర్సయ్యా గౌడ్

**ప్రజాపక్షం/తుర్కయాంజల్:** దేశ అభివృద్ధి ప్రదాని మోడీతోనే సాధ్యం అని మాజి ఎంపి డాక్టర్ బుర నర్సయ్య గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం పురస్కరించుకొని బుధవారం తుర్కయంజాల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎబిబిఆర్ కన్వెన్షన్ హాల్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తారు. కార్యక్రమంలో నాయకులు దయానంద గౌడ్, కొత్త రాంరెడ్డి, బాచ్చిగళ్ళ రమేష్, తుళ్ల నరసింహా గౌడ్, అర్జున్ గౌడ్, బల్దేవ్ రెడ్డి, శ్రవణ్ గౌడ్, కొంతం బల్ రెడ్డి, పాల్గొన్నారు.

## పేదలకు పండ్లు, బ్రేడ్ పంపిణీ

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** ప్రధాని జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని బిజెపి ఆధ్వర్యంలో శంకర్ పల్లి మండల కేంద్రంలో పేదలకు పండ్లు, బ్రేడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి రవి, తొండ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ తొండ రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి నాయకులు మిరియాల కాశీనాథ్,ఏనుగు నర్సింహా రెడ్డి, చేవెళ్ళ జయరాం రెడ్డి, నారేగూడెం నర్సింహరెడ్డి, పాల్గొన్నారు.

## తెలంగాణ విలీనానికి బిజెపి చేసిందేమీలేదు : డా.దిడ్డి సుధాకర్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** భారత్‌లో తెలంగాణ విలీనానికి బిజెపి చేసిన పోరాటాలు ఏమి లేవని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ విమర్శించారు. చరిత్ర హీనులుగా మిగిలిన బిజెపి నేతలు కేవలం రాజకీయ లబ్ధికోసమే చారిత్రక తెలంగాణ సాయుధ పోరాటాన్ని వాడుకొంటున్నదని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ముందు ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. సమావేశంలో ఆప్ నేతలు బుర్రా రాము గౌడ్, విజయ్ మల్లంగి, మహమ్మద్ మజీద్. డా.అన్సారీ, హేమ సుదర్శన్ జిల్లోజు, అబ్దుల్ ముక్తాదిర్, షాబాజ్, అజీజ్‌బేగ్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## 19న లంబాడీల ఆత్మగౌరవ సభ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో లంబాడీలపై జరుగుతున్న కుట్రను తిప్పికొట్టడంతోపాటు ఐక్యత చాటేందుకు ఈనెల 19న హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్టు మాజీ ఎంపి సీతారాంనాయక్, రిటైర్డ్ ఐపిఎస్ డి.టి.నాయక్, మాజీ ఎంపి కవిత తెలిపారు. సభకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు లంబాడీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించి, మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎంఎల్ఎ శంకర్ నాయక్, మాజీ జడ్‌పిటిసి చారులత, సంజీవ నాయక్, మోహన్‌సింగ్, సంపత్‌సింగ్, శరత్, రవీందర్, కరాటే రాజు, రాంబాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్ హెడ్ ట్యాంక్ ఓవర్ ఫ్లో

### ఇంటి యజమానికి జరిమానా విధించిన జలమండలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి నీరుఓవర్ ఫ్లో అయిన ఘటనలో ఇంటి యజమానికి జలమండలి అధికారులు జరిమానా విధించారు. జలమండలి ఓఅండ్ఎం డివిజన్ :6, తట్టిఖాన పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లో ఎ.రాజ్‌కుమార్(సిఎన్: 62061 1107) ఇంటి వద్ద బోర్‌వెల్ నీటిని పంపు చేసే క్రమంలో ట్యాంక్ నిండి నీరు వీధిలోకి పొంగింది. ఈ సమయంలో విధుల్లో ఉన్న మేనేజర్ దాన్ని గమనించి, ఎండి.అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నారు. నీటి వృథా జరగడంతో రాజ్ కుమార్‌కు నోటీసు జారీ చేసి రూ.5,000 జరిమానా విధించారు. నీటి వినియోగంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# హైడ్రా మాన్సూన్, డిఆర్‌ఎఫ్ బృందాల మెరుపు ధర్నా

### అత్యవసర సర్వీసులకు స్వల్ప సమయం బ్రేక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రాకు డిజాస్టర్ టీం భారీ షాక్ ఇచ్చింది. బుధవారం ఉదయం హైడ్రా కార్యాలయం ముందు హైడ్రా డిఆర్‌ఎఫ్ బృందాలు మెరుపు ధర్నాకు దిగాయి. జీతాలు తగ్గించారంటూ హైడ్రా తీరుకు నిరసనగా డిఆర్‌ఎఫ్ బృందాలు ధర్నా చేపట్టాయి. జీతంలో ఐదు వేలు కట్ చేశారని ఆందోళన చేపట్టారు. రాత్రి పగలు అన్ని పనులు చేయించుకుని ఇలా చేయడంపై డిఆర్‌ఎఫ్ టీమ్స్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. డిజాస్టర్ టీం విధులు బహిష్కరించడంతో మాన్సూన్ సర్వీసులపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతంలో జిహెచ్‌ఎంసి అధినంలో ఈవిడిఎంలో డిఆర్‌ఎఫ్ సిబ్బంది పని చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హైడ్రాలో డిఆర్‌ఎఫ్‌లో దాదాపు 1100 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలపై అందరికీ ఒకేలా అందేలారాష్ట్ర ప్రభుత్వం జిఓ తీసుకువచ్చింది. ఈ జిఓ కారణంగా రూ. 5000 జీతం తగ్గిందంటూ డిఆర్‌ఎఫ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో సగానికి పైగా సిబ్బందికి ఈనెల రూ. 5000 జీతం తగ్గిందంటూ హైడ్రా కార్యాలయం ముందు డిఆర్‌ఎఫ్ బృందాలు ఆందోళనకు దిగాయి.

### హైడ్రాలో జీతాలు తగ్గడంలేదు : పాత జీతాలే ఇస్తామన్న హైడ్రా

హైడ్రాలో ఔట్ సోర్సింగ్ ద్వారా పని చేస్తున్న ఉద్యోగుల జీతాలు ఏమీ తగ్గడం లేదని హైడ్రా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబరు 1272 ప్రకారం జిహెచ్‌ఎంసిలోని ఈవిడిఎం ద్వారా హైడ్రాకు సమకూరిన ఉద్యోగుల జీతాలు రాష్ట్రంలోని ఇతర శాఖలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సమానంగా సవరించడం జరిగింది. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి హైడ్రా తీసుకెళ్లింది. ఆ వ్యత్యాసం మొత్తాన్ని జిహెచ్‌ఎంసి నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా అందజేయాలని ప్రభుత్వం సూచించింది. జిహెచ్‌ఎంసి స్థాయీసంఘం ఆమోదం తర్వాత మ్యాచింగ్ ఫండ్ విడుదల చేస్తామని జిహెచ్‌ఎంసి తెలిపింది. ఉద్యోగులు జీతాలు లేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో జిఓ 1272 ప్రకారం వెంటనే జీతాలు హైడ్రా చెల్లించింది. వ్యత్యాసం మొత్తాన్ని త్వరలో సర్దుబాటు చేస్తామని కూడా చెప్పింది. కొంతమంది ఉద్యోగులు జీతాలు తగ్గినట్టు భావించి బుధవారం ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఉద్యోగులతో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌గారు చర్చలు జరిపారు. జీతాలు తగ్గవని, జిహెచ్‌ఎంసి నుంచి మ్యాచింగ్ గ్రాంట్ రిలీజ్ అవ్వగానే సర్దుబాటు చేస్తామని హామీ ఇవ్వడంతో హైడ్రాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఊరట చెందారు. వెంటనే విధుల్లోకి చేరారు. వారికి జిహెచ్‌ఎంసిలో ఈవిడిఎం భాగంగా ఉన్నప్పుడు అందిన జీతాలే ఇప్పుడు కూడా చెల్లించడం జరుగుతుందని హైడ్రా ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## రూ.16 కోట్ల విలువైన పార్కుల భూములు కాపాడిన హైడ్రా





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్కులు, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను ఆక్రమణల నుంచి హైడ్రా కాపాడింది. బుధవారం జరిగిన ప్రత్యేక చర్యల్లో రూ.16 కోట్లకు పైగా విలువైన 1600 గజాల స్థలాన్ని రక్షించింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, మూసాపేట సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్ కోపరేటివ్ సొసైటీకి చెందిన లే ఔట్‌లో వెయ్యి గజాల పార్కు స్థలాన్ని కాపాడింది. 1967లో 172 ప్లాట్లతో ఈ లే ఔట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో 1200 గజాల స్థలాన్ని పార్కులకోసం కేటాయించారు. ఈ పార్కు ఆక్రమణలకు గురవుతున్నట్టు మోతినగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాళ్లు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జిహెచ్‌ఎంసి, టిటిసిపి, రెవెన్యూ అదికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు, పార్కు స్థలంగా గుర్తించి వెంటనే ఆక్రమణలను తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

**మదీనాగూడలో 600ల గజాల స్థలం..** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని మదీనగూడ గ్రామంలో పార్కుతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన 600ల గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించింది. పార్కుతో పాటు ప్రజావసరాలకు దాదాపు 600ల గజాల స్థలాన్ని కేటాయించగా, అందులో గోశాల పేరుతో కొంత భాగం, పిండి గిర్నీ కోసం మరి కాస్త కబ్జా చేశారు. గోశాలలో ఉన్న ఆవులను ఇస్కాన్ టెంపుల్ వారికి అప్పగించి, అక్కడి ఆక్రమణలను హైడ్రా తొలగించింది.

### నాణ్యత ప్రమాణాలు

## పాటించకపోతే చర్యలు

### రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఆహార పదార్థాలలో నాణ్యత ప్రమాణాలను పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు ఉంటాయని రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీం పట్టణం లోని బేకరిలు, డెయిరీ యూనిట్స్ లను రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఖలీల్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో బేకరి తయారీ పరిసరాలను, ఆహార పదర్థలలో నాణ్యత పాటిస్తున్నారా.. లేదా అని పరిశీలించారు. శాంపిల్ పరీక్షల నిమిత్తం లాబ్‌కి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్క్రీం పార్లర్లు ఇతర వాటిపై తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. నాణ్యత లోపించినట్లయితే చట్ట పరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



# శిల్పులకు ఆదరణ కల్పించేందుకు కృషి








### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** శిల్పులకు సమాజంలో మంచి ఆదరణ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పరంగా నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అర్హులైన అన్ని కుల వృత్తులు, చేతివృత్తుల వారు ప్రభుత్వపరంగా వచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి, డిఆర్ఓ సంగీత, డిసిపి సునీత రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురాం తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛతతో పల్లెలు మెరవాలి

స్వచ్ఛతతో పల్లెలు మెరవాలని రంగారెడ్డి జిల్లా సి.నారాయణరెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా స్వచ్ఛతా హి సే 2025 కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు, 15 రోజుల పాటు జిల్లాలోని అన్నిమండలాలు, గ్రామాలలో స్వచ్ఛతా హి సే కార్యక్రమాన్ని జరపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, డిఆర్‌డిఓ శ్రీలత, జడ్‌పి సిఇఓ సిహెచ్ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, అడిషనల్. డిఆర్‌డిఓ ఎన్.సుభాషిణి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలు

చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరు ధాన్యాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డిఆర్ఓ సంగీత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, సిపిఓ సామ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం మున్సిపల్, క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎగురవేశారు. ఎంపిడిఓ, తహసీల్దార్, ఆర్‌డిఓ కార్యాలయాల వద్ద ఎగురవేసి జాతీయ జెండా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, విశ్వం, రఘునాయక్, చెన్నయ్య, బాల్‌రాజ్ గౌడ్, దంగు శ్రీనివాస్ యాదవ్, విజయ్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.
**కొత్తూరు:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కొత్తూరు మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపిడిఓ, పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, ఎమ్మె సత్తయ్య, విజయపాల్‌రెడ్డి, పిన్నింటి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.
**కొందుర్గు :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. మండల కేంద్రంలోని ఎంపిడివో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డితోపాటు వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.
**కేశంపేట:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు విముక్తి కలిగించిన పటేల్

### కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** నిజాం పాలన నుంచి ఆపరేషన్ పోలో ద్వారా తెలంగాణకు విముక్తిని సర్దార్ వల్లభాయ్ పటేల్ కలిగించాడని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలను బిజెపి ఆధ్వర్యంలో బుధవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ ఎస్‌కేడి నగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ ఆపరేషన్ పోలో ద్వారా తెలంగాణకు విముక్తిని ప్రసాదించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్మరించకుంటూ ఆయన స్ఫూర్తితో బిజెపి తెలంగాణ విమోజన దినోత్సవాన్ని జరుపుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకరయ్య గౌడ్, భూపాల్‌రెడ్డి, శ్రీదర్‌రావు, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌నాథ్, విష్ణువర్ధన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సురేష్ కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
**హస్తినాపురంలో :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ ఆపరేషన్ పోలో ద్వారా తెలంగాణకు విముక్తిని ప్రసాదించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్మరించకుంటూ ఆయన సూకర్తితోనే బిజెపి తెలంగాణ విమోజన దినోత్సవాన్ని జరుపుకుంటుందని హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకుల మల్లేష్ గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్లోని డిఆర్‌డిఎల్ కాలనీ చౌరస్తా వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరేష్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య






**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** తెలంగాణా సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. బుధవారం తుర్కయంజాల్ కూడలిలో సిపిఐ తుర్కయాంజల్ మున్సిపాలిటి కార్యదర్శి ఆనంతుల కాటం రాజు గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణా సాయుధ పోరాట విలీన దినోత్సవాన్ని ఘనంగా నిర్వాహించారు. కార్యక్రమానికి ఓరుగంటి యాదయ్య ముఖ్య అతిధిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శివకుమార్‌గౌడ్, నాయకులు నాగేశ్వర్, వట్టి విజయా, సుందరమ్మ, డి.యాదయ్య, కొట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.
**హయత్ నగర్ :** సిపిఐ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, ఎఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నే సుజాత, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశివర్ధన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, మండల కార్యదర్శి సరిత, ఎఐటియుసి మండల కార్యదర్శి గోల్కొండ నాగరాజు, బికెసి రాష్ట్ర సమితి సభ్యులు మందుల కృష్ణ, వివిధ శాఖా కార్యదర్శులు సౌజన్య, రాములమ్మ, సౌజన్య, గూని శోభ, పారిజాత, యమునా, సుమతి, అనిత, శివ జ్యోతి, అలివేణి, ఆదిలక్ష్మి, ప్రజానాట్యమండలి జ్యోతి, సామేలు, వెంకన్న, శ్రీను, పార్టీ శ్రేణులు వెంకట్, బాలరాజు, పద్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ


## ఆసీస్‌పై భారత్ మహిళా జట్టు ఘన విజయం

### చరిత్ర సృష్టించిన స్మృతి మంధాన




ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓపెనర్ స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలోనే ఆస్ట్రేలియాపై అత్యంత వేగంగా శతకం బాదిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో మంధాన 77 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకుంది. పురుషుల క్రికెట్‌లో ఈ రికార్డ్ విరాట్ కోహ్లీ పేరిట ఉంది. అతను ఆస్ట్రేలియాపై వన్డేల్లో 52 బంతుల్లోనే శతకం సాధించాడు. ఈ మ్యాచ్‌లో మంధాన 91 బంతులాడి 14 ఫోర్లు, 4 సిక్స్‌లతో 117 పరుగులు చేసి వెనుదిరిగింది. తద్వారా పలు రికార్డ్‌లను తన పేరిట లిఖించుకుంది. వన్డేల్లో అత్యంత వేగంగా సెంచరీ బాదిన రెండో బ్యాటర్‌గా నిలిచింది. ఐర్లాండ్‌పై స్మృతి మంధాననే 70 బంతుల్లో సెంచరీ బాదింది. ఇది మంధానకు 12వ శతకం కాగా.. ఓపెనర్‌గానే ఈ సెంచరీలు నమోదు చేసింది. తద్వారా అరుదైన జాబితాలో మంధాన చోటు దక్కించుకుంది. మహిళల వన్డే క్రికెట్‌లో ఓపెనర్‌గా అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్ల జాబితాలో సుజీ బేట్స్, స్మృతి మంధాన, టమ్మీ బౌమోంట్ 12 సెంచరీలతో అగ్రస్థానంలో ఉండగా..చార్లోట్ ఎడ్వర్డ్స్ హీలీ మాథ్యూస్ 9 శతకాలు నమోదు చేశారు. ఈ ఏడాది మంధానకు మూడో శతకం. వన్డేల్లో వేర్వేరు క్యాలెండర్ ఇయర్‌లో మూడు, అంత కంటే ఎక్కువ శతకాలు నమోదు చేసిన తొలి మహిళా బ్యాటర్‌గా కూడా మంధాన చరిత్రకెక్కింది. గతేడాది మంధాన వన్డేల్లో 4 శతకాలు నమోదు చేసింది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు నమోదు చేసిన మెగ్ లాన్నింగ్‌కు మంధాన చేరువవుతోంది. మెగ్ లాన్నింగ్ 15 శతకాలు బాదగా, సుజీ బేట్స్ 13 శతకాలతో మంధాన కంటే ముందుంది. 12 వన్డే శతకాలతో పాటు రెండు టెస్ట్ సెంచరీలు, ఓ టీ20 సెంచరీ కూడా మంధాన పేరిట ఉన్నాయి. మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు బాదిన రెండో బ్యాటర్‌గా మంధాన నిలిచింది. ఈ జాబితాలో మెగ్ లాన్నింగ్ 17 శతకాలతో టాప్‌లో ఉండగా.. స్మృతి మంధాన 15 సెంచరీలతో రెండో స్థానంలో కొనసాగుతోంది. సుజీ బేట్స్(14), టమ్మీ బూమోంట్(14), చార్లోట్ ఎడ్వర్డ్స్(13) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా 102 పరుగుల భారీ తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ మంధాన శతకంతో 292 పరుగుల భారీ స్కోర్ చేసింది. మంధానకు తోడుగా దీప్తి శర్మ(40) ఒక్కతే రాణించింది. ఆసీస్ బౌలర్లలో డార్సీ బ్రౌన్(3/42) మూడు వికెట్లు తీయగా.. మేగన్ స్కట్, అన్నబెల్ సదర్లాండ తహిలా మెక్‌గ్రాత్ చెరో వికెట్ తీసారు. భారత్‌పాక్ మ్యాచ్‌పై ఐపీఎల్ ఛైర్మన్ కీలక ప్రకటనభారత్‌పాక్ మ్యాచ్‌పై ఐపీఎల్ ఛైర్మన్ కీలక ప్రకటన అనంతరం ఆస్ట్రేలియా 190 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్3/28) మూడు వికెట్లు తీయగా.. దీప్తి శర్మ(2/24) రెండు వికెట్లు పడగొట్టింది. రేణుకా సింగ్, స్నేహ్ రాణా, అరుందతి రెడ్డి, రాధా యాదవ్ తలో వికెట్ తీసారు. ఆసీస్ బ్యాటర్లలో ఎల్లిస్ పెర్రీ(44), సదర్లాండ45) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1–1తో సమంగా నిలిచింది. ఆఖరి మ్యాచ్ శనివారం జరగనుంది.

## వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి నీరజ్




**టోక్యో:** జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా జపాన్‌లోని టోక్యోలో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం తొలి ప్రయత్నంలోనే నీరజ్ చోప్రా క్వాలిఫయింగ్ మార్క్ దాటేశాడు. అతను జావెలిన్‌ను 84.85 మీటర్ల దూరం విసిరాడు. అయితే ఈ టోర్నీలో ఆటోమెటిక్ క్వాలిఫయింగ్ మార్క్ 84.50 మీటర్లు లేదా అతని గ్రూపులో బెస్ట్ 12 మంది త్రోయర్లు ఫైనల్‌కు ప్రవేశిస్తారు. కానీ ఒలింపిక్ చాంపియన్ నీరజ్ మాత్రం తన ఫస్ట్ అటెంప్ట్‌లోనే క్వాలిఫయింగ్ మార్క్ దాటేసి ఫైనల్లో తన బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఈవెంట్‌లో బుధవారం నీరజ్ తన పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. పారిస్ ఒలింపిక్స్ సమయంలో కూడా నీరజ్ తొలి ప్రయత్నంలోనే క్వాలిఫై అయి ఫైనల్లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. వరల్డ్ ఛాంపియన్, జర్మనీ త్రోయర్ జులియన్ వెబర్ తన రెండో ప్రయత్నంలో క్వాలిఫయింగ్ మార్క్ దాటి ఫైనల్లోకి ప్రవేశించాడు. అతను రెండో ప్రయత్నంలో తన జావెలిన్‌ను 87.21 మీటర్ల దూరం విసిరాడు.


## టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యుఎఇ

ఆసియా కప్‌లో భాగంగా పాక్తిస్తాన్‌యూఏఈ మధ్య మ్యాచ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానున్నది. పిసిబి బాయ్‌డ్రామ్ నేపథ్యంలో మ్యాచ్ ఆలస్యమైంది. షేక్ హ్యాండ్ వివాదం నేపథ్యంలో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను రిఫరీగా తప్పించాలని పిసిబి డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఐసిసి రిఫరీని మార్చే అవకాశం లేదని స్పష్టం చేసింది. అయితే, మరోసారి ఐసిసికి పిసిబి మెయిల్ చేసింది. పైక్రాఫ్ట్‌ను తొలగించకుంటే మ్యాచ్‌ను బహిష్కరిస్తామని బెదిరింపులకు దిగింది. అయినా, ఐసిసి వెనక్కి తగ్గకపోవడంతో పాకిస్తాన్ జట్టు ఆలస్యంగా మైదానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. టాస్ గెలిచి యుఎఇ కెప్టెన్ మహ్మద్ వసీం తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ఇక మ్యాచ్‌కు రిఫరీగా ఆండీ పైక్రాఫ్ కొనసాగనున్నారు. ఈ మ్యాచ్ కోసం పాక్ జట్టులో రెండు మార్పులు చేసింది. సుఫ్యాన్ ముఖీమ్, ఫహీమ్ అష్రఫ్‌ను పక్కన పెట్టింది.

# ఫోకస్

# చరిత్ర

## బానిస వ్యాపారం.. చరిత్ర చెప్పిన చేదు నిజం..



**'మనమంతా బానిసలం, గానుగలం, పీనుగలం! ... మనదీ ఒక బతుకేనా? కుక్కల వలె, నక్కల వలె! మనదీ ఒక బతుకేనా?**

సందులలో పందులవలె!' అంటాడు మహాకవి శ్రీశ్రీ తన 'చేదుపాట' కవితలో. నాటి బానిస వ్యవస్థ పరోక్షంగా నేటికీ కొనసాగుతున్న వైనాన్ని చెప్తాడు. ఆర్థిక పరమైన అంశాలే సమాజిక రుగ్మతులుగా ప్రతిబింబిస్తాయన్న వాస్తవం, నేటి 'కాంట్రాక్ట్ ఉద్యోగ' వ్యవస్థ నిరూపిస్తునే ఉంది. చరిత్ర పుటలను తిరగేస్తే, సాటి మనిషిని బనిసగా మార్చి, అంగట్లో అమ్మకానికి పెట్టే దుర్మార్గపు వ్యవస్థ కళ్ల ముందు ఆవిష్కృతమవుతుంది. బానిస వ్యాపారం మానవ చరిత్రలో చెరగని మచ్చ. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన ఫ్రాన్స్ కూడా ఈ బానిస వ్యాపారంలో భాగస్వామిగా ఉండడం విచిత్రం. ఇంగ్లాండ్ 1772లోనే బానిస వ్యాపారాన్ని రద్దు చేయగా, ఫ్రెంచ్ రిపబ్లిక్ 1794లో ఆ నిర్ణయం తీసుకుంది. కానీ, నెపోలియన్ 1802లో దానిని పునరుద్ధరించాడు. ఫలితంగా 1830లో లూయిస్ ఫిలిప్ మళ్లీ నిషేధం విధించే వరకు బానిస వ్యాపారం చట్టబద్ధంగానే కొనసాగింది. అనధికారికంగా 1850 దశగాల వరకూ ఈ దుర్మార్గం అమల్లోనే ఉంది. మన దేశంలో కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో భాగంగా ఉన్న యానాంలో బానస వ్యాపారం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆ రోజుల్లో, రీయూనియన్ వంటి ఫ్రెంచ్ కాలనీలలో చెరకు తోటలకు విపరీతంగా కూలీల అవసరం ఉండేది. ఆ అవసరమే బానిస వ్యాపారానికి పునాదిగా మారింది. 1760 నాటికి ప్రతి సంవత్సరం 50 పైగా నౌకలు ఆఫ్రికా, ఇండియా ప్రాంతాల నుండి బానిసలను తరలించేవి. ఒక్కో నౌకలో 300 నుంచి 400 మంది బానసిలను తరలించేవారు. రీయూనియన్‌లోని తోటల్లో వీరి జీవితం దయనీయంగా ఉండేది. రోజుకు 18 నుంచి 20 గంటల కఠోర శ్రమ. కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి. మరణాల రేటు అధికంగా ఉండేది. యానాం ప్రాంతంలో బానిసల సేకరణ ఎంత కిరాతకంగా సాగిందో 1792లో ఏట్స్ అనే బ్రిటిష్ వ్యక్తి రాసిన లేఖ స్పష్టం చేస్తున్నది. కరువు పరిస్థితుల నేపథ్యంలో, ఆకలితో యాచకులు, రైతులు, ఇతర గ్రామాల ప్రజలను బలవంతంగా పట్టుకుని రాత్రివేళల్లో ఫ్రెంచి నౌకల్లోకి ఎక్కించేవారని ఏట్స్ తన లేఖలో పేర్కొన్నాడు. యానాం, ఆతేరు, నీలపల్లి ప్రాంతాల నుండి కూడా మహిళలు, పిల్లలు కిడ్నాప్ చేసి బానిసలుగా మార్చేశారని స్పష్టం చేశాడు. అక్కడి బానిస వ్యాపారం క్రమంగా కూలీల రవాణాగా మారింది. 1828లో ఫ్రెంచి ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టింది. ఇందులో మూడు సంవత్సరాల ఒప్పందం, నెలకు 7 రూపాయిల జీతం, తిండి, వసతి, ఆరోగ్య సదుపాయాలు, మతాచారాలకు గౌరవం, రవాణా ఖర్చులు వంటి వాగ్దానాలు ఉండేవి. ఈ పద్ధతితో 1829లో మొదటి కూలీల బృందం రీయూనియన్‌కు తరలివెళ్లింది. కానీ ఆర్థిక సమస్యల వల్ల ఈ పద్ధతి ఎక్కువ కాలం నిలదొక్కుకోలేకపోయింది. ఏదిఏమైనా యానాంలోని ఫ్రెంచి బానిస వ్యాపారం ఒక దారుణ చరిత్ర. తొలుత బలవంతం, మోసాలతో సాగిన ఈ వ్యాపారం, తరువాత కాంట్రాక్టు విధానంగా మారినా, పరోక్షంగా బానిస వ్యవస్థే కొనసాగుతున్నది.

## సుదీర్ఘ యుద్ధం..



యుద్ధాలు జరగని కాలం దాదాపు లేదు. చరిత్ర మొత్తం యుద్ధాలతో నిండిపోయింది. వర్తమానంలోనూ ఇదే పరిస్థితి. అయితే, ఏదైనా యుద్ధం కొన్ని రోజులు లేదా నెలలు లేదా కొన్ని సంవత్సరాలు జరగవచ్చు. కానీ, ఏకంగా 335 సంవత్సరాలు కొనసాగిన యుద్ధం ఒకటి చరిత్ర నిక్షిప్తమైందనే వాస్తవం బహూశా చాలా మందికి తెలియకపోవచ్చు. 1648లో ఇంగ్లాండ్‌లో జరిగిన గృహ యుద్ధాల కారణంగా, పార్లమెంటుతో రాజు చార్లస్ I అనుకూల వర్గాలు ఘర్షణలకు దిగాయి. ఆ సమయంలో నెదర్లాండ్స్, ఇంగ్లాండ్ మధ్య విభేదాలు ఉండేవి. ఇంగ్లాండ్ తీర ప్రాంతాల్లో చాలా మంది రాజుకు, ఆయన మద్దతుదారులకు అండగా నిలుస్తున్నారన్న అనుమానంతో, నెదర్లాండ్స్ నావికాదళం వారిపై దాడులు ప్రారంభించింది. దీనితో రాజు మద్దతుదారులు వెనుకడుగువేసి, ఐస్లెస్ ఆఫ్ సిలీ అనే చిన్న దీవుల సమూహంలో ఆశ్రయం పొందారు. నెదర్లాండ్స్ వారిని శత్రువులుగా పరిగణించి 1651లో యుద్ధం ప్రకటించింది. అయితే, వాస్తవానికి ఎలాంటి దాడి చేయలేదు. ఒక్క తుపాకీ గుండు కూడా పేలలేదు. రక్తం చిందలేదు. కొంతకాలానికి రాయలిస్టులు ఓటమిని అంగీకరించారు. అయినప్పటికీ, ఐస్లెస్ ఆఫ్ సిలీపై ప్రకటించిన యుద్ధం ముగిసినట్టు నెదర్లాండ్ ప్రకటించలేదు. అధికారికంగా ముగించలేదు. దీనితో, కేవలం పేరుకు మాత్రం యుద్ధం కొనసాగింది. ఎవరూ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. 1986లో చరిత్రకారులు ఈ విషయాన్ని తవ్వి బయటకు తీశారు. నెదర్లాండ్స్ రాయబారి రియెన్ హుయెకాపర్ ఐస్లెస్ ఆఫ్ సిలీని సందర్శించినప్పుడు, అధికారికంగా యుద్ధ ముగింపు ఒప్పందంపై సంతకం చేశాడు. అంటే, యుద్ధం మొదలైన 335 సంవత్సరాల తర్వాత అది అధికారికంగా ముగిసింది. ఒక్క తుపాకీ కూడా పేలకుండా, శతాబ్దాలు కొనసాగిన యుద్ధం ఇదే. చరిత్ర దీనిని అత్యంత సుదీర్ఘమైన యుద్ధంగా పేర్కొంటుంది. కానీ, నిజానికి ఇది కేవలం కాగితంపై జరిగిన యుద్ధం మాత్రమే. అందుకే ఇది 'ఒక్క తుపాకీ కూడా పేలని యుద్ధం' (ది వార్ విత్‌ౌట్ ఎ షాట్)గా ప్రసిద్ధి చెందింది. కాగా, ఐస్లెస్ ఆఫ్ సిలీ ప్రజలు ఈ సంఘటనను ప్రత్యేక గర్వంతో చూస్తారు. శతాబ్దాలు జరిగిన యుద్ధంలోనూ తాము ఓడిపోలేదని అంటారు.

# పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం

### కమ్యూనిస్టుల త్యాగాలతోనే తెలంగాణ విలీనం

### చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

### సాయుధ పోరాట వారోత్సవ ముగింపు సభలో పలువురు నేతలు



ఖమ్మం...

**ప్రజాపక్షం/ఖమ్మం:** తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నా రు. కమ్యూనిస్టుల త్యాగాలతోనే భారత దేశంలో తెలంగాణ విలీనమైందని ఇందులో మరో అభిప్రాయానికి తావు లేదని స్పష్టం చేశారు. తెలంగాణ పోరాట చరిత్రను కమ్యూనిస్టుల త్యాగాలను వక్రీకరిస్తే జాతి క్షమించదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ ముగింపు సభ బుధవారం ఖమ్మంలోని జెడ్పి మీటింగ్ హాల్‌లో జరిగింది. అంతకు ముందు సిపిఐ శ్రేణులు ఖమ్మం పట్టణంలో కదం తొక్కాయి. పాత బస్టాండ్ సెంటర్ నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ప్రదర్శనను నిర్వహించారు. జన సేవా దళ్ కార్యకర్తలు నిర్వహించిన కవాత్ నగర ప్రజలను ఆకట్టుకున్నది. వైరా రోడ్డు అరుణ వరణం పులుముకున్నది. జెడ్పి మీటింగ్ హాల్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన లేని వారు మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. క మ్యూనిస్టుల పోరాటంతో తెలంగాణ విలీనమైతే భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు రావడంతో పాటు కమ్యూనిస్టులు బలపడతారని నిజాంతో రహస్య ఒప్పందం కుదుర్చుకుని ఆయనను రాజ్ ప్రముఖ్‌గా ప్రకటించడంతో పాటు రాజాభరణాన్ని ఇచ్చే ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. పటేల్ సైన్యాలు నిజాంకు వ్యతిరేకంగా పోరాడలేదని కమ్యూనిస్టులను హతమార్చాయని ఇది చారిత్రిక సత్యమని హేమంతరావు తెలిపారు. నిజాంతో పోరాటం కంటే యూనియన్ సైన్యాల పోరాటంలోనే ఎక్కువ మంది కమ్యూనిస్టులు మరణించారన్నారు. పరమ కిరాతకుడు ఖాసిం రజ్వీని సైతం రక్షించి విమానంలో బయటకు పంపిన ఘనత అప్పటి పటేల్‌కు ఆయన సైన్యాలకు ఉందన్నారు. నేటి యువతరం అమరుల త్యాగాలను స్మరించుకుని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా హేమంతరావు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జన సేవాదళ్ ఇంచార్జి సిద్దినేని కర్ణకుమార్ ప్రసంగించగా రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ఖిలా వరంగల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర నాయకులు మేకల రవి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయం తమ్మెర భవన్‌లో జాతీయ జెండాను రాష్ట్ర నాయకులు మేకల రవి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ బాష్‌మియా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించాయని, సెప్టెంబర్ 17న తె లంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా ని ర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దండు లక్ష్మ ణ్, గుండె బద్రి, బుస్స రవి, గన్నారపు రమేష్, సంగీ ఎలేందర్, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, ఆరెల్లి రవి, దామెర కృష్ణ, ల్యాదల్ల శరత్, సుదీర్, దస్సు, యాకాంచారి, జాన్ పాల్, రాజేందర్, చిరంజీవి, దివ్య మహేష్, ప్రభాకర్, కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాకేంద్రంలో స్థానిక నూతన కూరగాయల మార్కెట్ నుండి స్ఫూర్తి ప్రదర్శన నిర్వహించి, మూడు కోట్ల జంక్షన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం వద్ద పూలమాలలు వేసి సాయుధ పోరాట వీరుడు తీగల సత్యనారాయణ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వీర తెలంగాణ సాయుధ పోరాట సభ స్థానిక వీరభవన్‌లో జరిగింది, ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ తెలంగాణకు నిజమైన స్వాతంత్రం సెప్టెంబర్ 17న వచ్చిందన్నారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిర్వహించి తెలంగాణను విలీనం చేసిన ఘనత కమ్యూనిస్టులదే అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, సాయుధ పోరాట వారసులు 25 మందిని సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేసపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగ చారి, తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, కేదాసు రమేష్, బానోతు లింగ్య నాయక్, మాలోతు రవీందర్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, మంద శంకర్, ముడుసు రాణి, నాంచారి దాసు తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** నిజాం నవాబుల పరిపాలన అంతం కోసం జరిగిన మహోత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మతోన్మాదులు హిందూ, ముస్లింల పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరిస్తున్నారని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ విమర్శించారు. సెప్టెంబర్17న హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం చేసిన రోజును పురస్కరించుకుని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని, పార్టీ పతాకాన్ని శ్రీనివాస్ ఎగరవేశారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ నాటి తెలంగాన సాయుధ పోరాట స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బావండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ, బీర్ల పద్మ, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు కసిబోజుల సంతోష్ చారి, నగునూరి రమేష్, బాకం ఆంజనేయులు, నాయకులు పి.సాంబయ్య, వెంకట్రాములు, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, ప్రజ్వల్, రాజమల్లు, గట్టయ్య, చింటూ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


వరంగల్...


కరీంనగర్...



మహబూబాబాద్...

## ఖమ్మంలో 'రెడ్ షర్ట్' వలంటీర్ల కవాతు




సాయుధ పోరాట వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఖమ్మంలో సిపిఐ శ్రేణులు కదం తొక్కాయి. వందలాది మంది జనసేవా దళ్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన అంబేడ్కర్ సెంటర్ మీదుగా జెడ్పి మీటింగ్ హాల్ వరకు సాగింది.

## విమోచనం పేరుతో బిజెపి సభలు పెట్టడం ప్రజలను మోసం చేయడమే



### సాయుధ పోరాటం నడిపింది.. త్యాగాలు చేసిందీ కమ్యూనిస్టులే

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ :** భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటం నడిపింది.. ప్రాణ త్యాగాలు అర్పించింది కమ్యూనిస్టులేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పోరాటానికి సంబంధం లేని బిజెపి సభలు పెట్టి ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దుమ్ భవన్‌లో జాతీయ జెండాను ఎగరవేసి ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంతో 4 వేల ఐదువందల మంది అమరుల త్యాగాలు, రక్తంతో తడిసి ఎరుపెక్కింది ఈ నేల అన్నారు. ఈ పోరాటం ఒక మహోజ్వల చరిత్ర అని పోరాటంలో పాల్గొన్న సమరయోధులకు పింఛన్లను ఇవ్వకుండా నిలిపివేసి పోరాటాన్ని అవమానపరిచిన కేంద్రంలో అదికారంలో ఉన్న బిజెపి నేడు విమోచనం పేరుతో సభలు పెట్టడం వెనుక ఏమి కుట్ర దాగిందో ప్రజలకు అర్థమవుతుందన్నారు. భూస్వాములు, జాగిర్దారులు, దొరలకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి మతం పులిమి హిందూ–ముస్లిం మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారని, ఈ పోరాటంలో అసువులు బాసిన షేక్ బందగి, మగ్దూమ్ మోహినుద్దీన్, షోయబుల ఖాన్‌ల త్యాగాలకు బిజెపి ఏమి సమాధానాలు చెపుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సెప్టెంబర్ 17ను ప్రజాపరిపాలన దినోత్సవం కాకుండా సాయుధ పోరాట దినాన్ని అధికారికంగా నిర్వహించాలని ఈసందర్భంగా కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రావణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి వి.లెనిన్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, ముండ్ల ముత్యాలు, దోటి పాండరి, కోమటిరెడ్డి ప్రద్యుమ్నారెడ్డి, యూసుఫ్, వీరయ్య వేంకటయ్య, ఆర్ఎస్ రాములు, విజయరెడ్డి, కటకల్ల విజయ, దేవేందర్, డిఎస్ చారి, రామ చారి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## 20న క్రీడాకారులకు సన్మానం

**ప్రజాపక్షం/మక్తల్ :** షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఏ అగ్రవాల్, జీతురాజ్ తోమర్, తెలంగాణ రాష్ట్ర షూ టింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఐలమ్మ అదేశాల మేర కు, సెప్టెంబరు 20 షూటింగ్ బాల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం ఆధ్వర్యంలో సెప్టెంబరు 2020 నుండి సెప్టెంబ ర్ 2025 వరకు జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలలో పాల్గొని బంగారు, వెండి పథకాలు సాధించిన, అలాగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలలో పాల్గొన్న బాల బాలికలను ప్రోత్సహించుటకు, గౌరవించుటకు ఈ నెల 20న ఉదయం 9 గంటలకు సత్యసాయి మందిరంలో అంతర్జాతీయ జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలలో పాల్గొన్న బాల బాలికలను శాలు వా, మెమొంటో అందజేసి ఘనంగా సన్మానిస్తామని ఉపాధ్యక్షుడు బి.గోపాలం తెలిపారు. నారాయణపేట జిల్లా నుండి 154 మంది బాలబాలికలు జాతీయ స్థాయి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడలలో పాల్గొన్న వారందరికీ సన్మానం ఉంటుందని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు, ఎస్.రమేష్ కుమార్, కోశాధికారి పిడి బి.రూప పాల్గొంటారని మిగతా వివరాలకు 7702713139 సంప్రదించాలని తెలిపారు.

## పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : యెన్నం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలీస్ లైన్ సిబ్బందికి సూచించారు. మహబూబ్‌నగర్ నగరంలోని పోలీస్ లైన్‌లో ఉన్నత ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలో శిధిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్ వద్ద నిత్యం పందుల బెడద తో పాటు అక్కడ విష సర్పాలు కూడా వస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి పాఠశాల సిబ్బంది తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి, పై అధికారుల తో ఫోన్‌లో మాట్లాడారు. మహబూబ్‌నగర్ నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. శిధిలావస్థలో ఉన్న పోలీసు క్వార్టర్స్‌ను వెంటనే తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఎమ్మెల్యే డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అజ్మత్ అలి, కృష్ణ ముదిరాజ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, అంజద్, రాషెద్ ఖాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాజిద్ హుసేన్ తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 దాకా ప్రతి గ్రామపంచాయతీలో స్వచ్ఛతా హి సేవకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలు 2025 లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ స్వచ్ఛత హీ సేవకె సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛత పైన గ్రామ పరిశుభ్రత గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలన అలాగే చెత్తాచెదారం తొలగించడం వంటి కార్యక్రమాలు అలాగే గ్రామ పంచాయతీలో గల ఎంపీ డబ్ల్యూ వర్కర్లలకు సఫయి మిత్రా శివీర్ ద్వారా వాళ్లకు హెల్త్ చెకప్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అందులో భాగంగానే భారతదేశమంతటా 25 సెప్టెంబర్ నాడు జాతీయ స్థాయి శ్రమదానం కార్యక్రమాన్ని ఏక్ దిన్ ఏ ఘంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా దేశమంతటా ఉదయం 8 గంటలకు ప్రజలందరూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ ఒక గంట సేపు పాల్గొనే విధంగా కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమము అక్టోబర్ 2 నాడు స్వచ్ఛభారత దివస్‌తో ముగుస్తుందని, ఈ సమాచారము అంత గోల్ పోర్టల్ లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్వచ్ఛతహి సేవలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వచ్ఛత ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీ ఆర్ ఓ మొగులప్ప, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా మేనేజర్ మౌలిక పాషా, భార్గవ్, సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతో పంటలుసాగుచేసినట్లయితే పంట నాణ్యత పంటలదిగుబడి పెరుగుతుందని వనపర్తి వ్యవసాయ విశ్వవిద్యాలయ రావేఫ్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని మంగనూరు గ్రామంలో సేంద్రీయ సేద్యంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఎలాంటి రసాయన మందులువాడకుండా సేంద్రీయంగా పండించిన రైతులకు దిగుబడితోపాటు ప్రస్తుతం మార్కెట్లో మంచిధరలభిస్తూ ఉందని తెలిపారు. కావున ప్రతి రైతురసాయనసహిత పంటలైన సేంద్రీయ పంటలను పండించడం శ్రేయస్కరమని తెలిపారు. ప్రధానంగా సేంద్రీయ పద్ధతిలో వేపకషాయం వేపనూనెలాంటి సేంద్రీయ మందులను వాడటంద్వారా పెద్ద మొత్తంలో ఖర్చులుకూడా తగ్గించుకోవచ్చని సూచించారు. పురుగులను తెగుళ్లను సులువుగా నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఆదర్శరైతులు మంజుల, అంకిత, శ్రీజ, పూజ, మానస, స్వాతి పాల్గొన్నారు.

## ఘనంగా స్వస్త నారి సశక్తి పరివార్

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థనారి సశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా డా.అనుష ఆధ్వర్యంలో మహిళలకు కంటికి, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గాయత్రి, ఎంపీడీవో, ఎంఈవో, తో ప్రారంభించారు. వ్యాధి గ్రస్తులకు పరీక్షలను నిర్వహించి వాటికి సంబంధించిన మందులను ఇవ్వడం జరిగింది.



# కలెక్టరెట్‌లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/నారాయణపేట్/మక్తల్:** నారాయణపేట్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, క్రీడలు యువజన సర్వీసులు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి వందనం స్వీకరించిన ఆయన జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమా లు సాధించిన ప్రగతిని వివరించారు. ఈ వేడుక ల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్లు సంచిత్ గాంగ్వర్, శ్రీను, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఆర్డిఓ రామచందర్ నాయక్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...

సెప్టెంబర్ 17న తారీఖును తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా మక్తల్ పట్టణం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత తెలంగాణ కోసం సాయుధ పోరాటం చేసిన రోజు సెప్టెంబరు 17 అని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఎంతో ముఖ్యమైన రోజు కాబట్టి దీనినే ప్రభుత్వ పరంగా జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించడం సంతోషకరమైన విషయం అని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయులు త్యాగ ఫలితమే మనం స్వేచ్ఛా వాయువును పిలుస్తుండడానికి కారణమని, వారి పోరాటం భావితరాలకు ఆదర్శంగా నిలవాలని నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రవికుమార్, సీనియర్ నాయకులు కట్టా సురేష్, ఏఎంసీ సభ్యులు మ్యాదరి శ్రీనివాస్ పారేవుల విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఆరోగ్యమే కుటుంబ, సమాజ ఆరోగ్యం



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, ఆ తర్వాత సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి అభిప్రాయపడ్డారు. బుధవారం నారాయణపేట మండలం అప్పక్‌పల్లి గ్రామ శివారులో గల ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో జాతీయ కార్యక్రమమైన స్వస్త్ నారి శశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణపేట శాసనసభ్యురాలు డా.పర్ణికారెడ్డి , స్థానిక సంస్థల జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయకుమార్, హాజరై ఉచిత మె గా హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో మహిళలు, చిన్న పిల్లలను ఎక్కువ భాగస్వామ్యం చేయాలని ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఒక కుటుంబం శక్తివంతంగా ఉంటుంది. అనే ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని శాసనసభ్యురాలు డా.పర్ణికరెడ్డి , అదనపు జిల్లా కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.జయచంద్ర మోహన్, తమ ప్రసంగంలో తెలిపారు. ఈ క్యాంపులో స్పెషలైజేషన్ డాక్టర్లను ప్రతి మండల కేంద్రాలలో, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రతిరోజు ఈ నెల 17వ తేది నుంచి వచ్చే నెల 2వ తేది వరకు 12 రోజుల వరకు వివిధ కేంద్రాలలో అత్యధిక సంఖ్యలో మహిళలు, పిల్లలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.సంపత్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కే.జయచంద్ర మోహన్ పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక, సంస్కాతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు

**ప్రజాపక్షం/మమబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ సమీకృతి జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి వందనం స్వీకరించిన ఆయన, జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రజాపాలన దినోత్సవం వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జె.అనిరుధ్ రడ్డి జి.మధు సూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అనితా మధుసూదన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి.జానికి స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహ రెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం








**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల కేంద్రంలో ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యా సంస్థల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. తహసీల్దార్ వరలక్ష్మి , ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ , వైద్యాధికారి డా. వంశీకృష్ణ, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు ఎత్తం చిట్టెమ్మ , జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన అధికారులు ప్రజా పాలన ప్రాధాన్యతను వివరించారు.ప్రజలకు చేరువైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**వనపర్తిలో .....:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలందరికి ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గ్రంథాలయం చైర్మన్ మార్కెట్ కమిటీ చైర్మన్ వనపర్తి పట్టణ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్స్ , ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐ వక్స్ బోర్డ్ సభ్యులు , ఐ ఎన్ టియూసి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**పాన్‌గల్‌లో :** పాన్‌గల్ మండలం వెంగలాయిపల్లిలో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. సిపిఐ గ్రామ కార్యదర్శి మల్లెపు బాలస్వామి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, బాలమసమ్మ, చంద్రకళ, బాల స్వామి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేరులో :** తెలంగాణలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీన నిర్వహించే ప్రజా పాలన సంబరాల్లో నేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ , ఎంపీడీఓ కార్యాలయం మార్కెట్ కార్యాలయం సింగిల్ విండో కార్యాలయం మహిళా సమాఖ్యలతో పాటు వివిధ కార్యాలయంలో జరిగిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో మండల అధికారులు, తహసీల్దార్ శ్రీమంతుల మురళి, ఎంపీడీఓ రోజారెడ్డి పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**అమరచింతలో :** బుధవారం అమరచింత మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రవీందర్ , మండల సహాయ కార్యదర్శి భాస్కర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి. కుతుబ్ , నాయకులు శ్యాంసుందర్ , లక్ష్మీనారాయణ, గీత తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్‌లో:** బుధవారం వనపర్తి జిల్లాలో కేంద్రంలోని సిపిఐ ఆఫీస్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగరవేసిన అనంతరం వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు జై. చంద్రయ్య, శ్రీరాం, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ , మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకుర్మయ్య, ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, పట్టణ కన్వీనర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఎస్ఐ విజయ్ కుమార్



**ప్రజాపక్షం/ కొత్తపల్లి :** మద్దూర్ పోలిస్ స్టేషన్ పరిధిలో సూరారం వాగు నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుంటే కొత్తపల్లి శివారులో టాస్క్‌ఫోర్స్ ,మద్దూర్ పోలిసులు దాడులు నిర్వహించి ఇసుక టిప్పర్ను పట్టుకొని పోలీస్ స్టేషనుకు తరలించారు.అనంతరం ఎస్సై విచారణ చేసిన తరువాత డ్రైవర్ గో నెల నరేష్ తండ్రి మహిపాల్ గ్రామం దుప్పటిగట్టు, ఓనర్ తిరుపతిరెడ్డి తండ్రి రామ్‌రెడ్డి గ్రామం దుప్పటిగట్టు. అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నందు న డ్రైవర్ ,ఓనర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మద్దూరు పోలిస్‌స్టేషన్ పరిధిలో ఏవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**ప్రజాపక్షం/ కొత్తపల్లి:** కొత్తపల్లి మండల స్థాయి క్రిడా పోటీలు బుధవారం రోజు భూనీడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రరంభమయ్యాయి.క్రిడలలో కబడ్డి,ఖోఖో , వాలిబాల్ ఆటలలో విద్యార్థులు పోటాపోటిగా పాల్గోని తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల ఉజ్వాల భవిష్యత్ క్రిడలను ప్రోత్సహించే విధంగా కాంగ్రేస్ నాయకుడు అల్లిపూర్ రమేష్ రెడ్డి విద్యార్థులకు 200 టిషర్టులను పంపిణి చేసి విద్యార్థి,విద్యార్థులను క్రిడల్లో రాణించాలని , రానున్న రోజుల్లో క్రిడల పైన మరింత ఉత్తేజాన్ని నింపే విధంగా విద్యార్థులకు ఇండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ నిలిమా,తహసీల్దార్ జయరాములు,ఎంఇవో ఇంజనేయులు ,రాజకీయ నాయకులు, అధికారులు ,గ్రామ యువకులు ,విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్వరాజ్ మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మక్తల్ నియోజకవర్గంలోని ఒక్క గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కానీ, కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని అన్ని రంగాలలో అభివృద్ధి శూన్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నమన్నారు. ప్రజసేవే మార్గంగా అభివృద్దే లక్ష్యంగా అన్ని సంక్షేమ పథకాలు నిరుపేదలకు వర్తించే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుంటే, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక వివిధ రాజకీయ పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుల రాజప్ప గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్వరాజ్ మండల కాంగ్రెస్ నాయకులు మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** హెచ్ఐవి ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు కల్వకుర్తి జడ్‌పిహెచ్ఎస్‌హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి సోకిన వ్యక్తి కండోమ్స్ లేకుండా సెక్స్‌లో పాల్గొనడం ద్వారా సోకుతుందన్నారు. హెచ్ఐవితో కలుషితమైన రక్తాన్ని మరొకరికి ఎక్కించడం ద్వారా, హెచ్ఐవి సోకిన తల్లి నుండి పుట్టబోయే బిడ్డకు , ఒకవేళ హెచ్ఐవి సోకినట్లు అయితే తల్లి నుండి బిడ్డకు రాకుండా ఎఆర్‌టి మందులు జీవితాంతం వాడాలన్నారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ ఎం.లింగయ్య, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాయుధ పోరాట స్ఫూర్తితో భూపోరాటాలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కొరకు జరిగిన సాయుధరైతాంగ పోరాటస్ఫూర్తితో భూసమస్యలపై పోరాడుతామని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు అశోక్ అన్నారు. తెలంగాణ విలీనదినోత్సవం సందర్భంగా పూలే అంబేద్కర్‌చౌరస్తాలో వీరతెలంగాణ సాయుధపోరాట అమరవీరుల చిత్రపటానికి పూలమాలవేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరతెలంగాణ సాయుధపోరాటం భూమికోసం భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తికోసం జరిగిన పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు హన్మంతు, సత్యనారాయణ, చంద్రశేఖర్, మల్లేష్, సంతోష్ పాల్గొన్నారు.

## 'స్వచ్ఛతా హీ సేవా-2025' కార్యక్రమం ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కోసం స్వచ్ఛంద సేవ , సమిష్టి చర్యలను బలోపేతం చేయడానికి బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 'స్వచ్ఛత హి సేవ2025' పరిశుభ్రత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మొదటి రోజైన బుధవారం ఈ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ప్రారంభించి అధికారులచేత స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు మరియు నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు కూడా వారి వారి డివిజనల్ ప్రధాన కార్యాలయాలలో అధికారులు, సిబ్బంది పాల్గొని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. వివిధ రైల్వే స్టేషన్లు, కోచింగ్ డిపోలు మరియు ఇతర రైల్వే యూనిట్లోని సిబ్బంది కూడా స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛతా హి సేవా ప్రచారం అక్టోబర్ 02తో ముగుస్తుంది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, స్వచ్ఛతా హి సేవా ప్రచారం ద్వారా ప్రజలు, రైలు వినియోగదారులు, రైల్వే సోదరులలో 'స్వచ్ఛ రైల్ స్వచ్ఛ భారత్' మిషన్ యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఈ దిశగా రైల్వే స్టేషన్లు, రైళ్లు , రైల్వే కార్యాలయాలలో పరిశుభ్రత స్థాయిని మరింత మెరుగుపరచడానికి అనేక కార్యకలాపాలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంచి పరిశుభ్రత అలవాట్లను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృత అవగాహన ప్రచారాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.



## ఆర్‌ఎస్ బ్రదర్స్ 'దసరా బ్లాక్ బస్టర్ స్పాట్ గిఫ్ట్స్'కు అపూర్వ ఆదరణ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో రిటైల్ షాపింగ్‌లో ప్రత్యేక బ్రాండ్ సృష్టించుకుని మహిళా కొనుగోలుదారుల మనసు దోచుకుంటున్న ఆర్.ఎస్ బ్రదర్స్ తాజాగా 'దసరా బ్లాక్‌బస్టర్ స్పాట్ గిఫ్ట్స్'తో ప్రజల దృష్టిని మరింతగా ఆకర్షిస్తున్నారు. దసరా పండుగ చేరువలో ఉన్న నేపథ్యంలో గత కొద్దిరోజులుగా కొనుగోలుదారులు అంతాఆర్.ఎస్ బ్రదర్స్ షోరూమ్స్ బాట పడుతున్నారు. దీంతో ఆర్.ఎస్ బ్రదర్స్ షోరూములు కొనుగోలుదారుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ము ఖ్యంగా హైదరాబాద్ నగరంలోని ఆర్.ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్స్‌ల్లో బుధవారం 'ఇసుకేస్తే రాలనంతగా' మహిళా కొనుగోలుదారుల క్రయాలతో బిజినెస్ జోరుగా సాగింది. అధిక సంఖ్యలో కొనుగోలుదారులు పట్టుచీరల సంచులతో ఆర్‌బ్రదర్స్ ఇస్తున్న మిక్సీగ్రైండర్లు చేతపట్టుకుని షాపింగ్‌మాల్స్ నుంచి బయటకు రావడం కంట పడింది. ఈ విషయమై యాజమాన్యాన్ని సంప్రదించగా 'దసరా బ్లాక్ బస్టర్ స్పాట్ గిఫ్ట్స్' ప్రకటనతో మహిళా కొనుగోలుదారులు ఆర్.ఎస్ షాపింగ్ మాల్స్‌కు తండోపతండాలుగా తరలివస్తున్నారని యాజమాన్యం వెల్లడించింది. మునుపెన్నడూ లేని రీతిలో ప్రతీ కొనుగోలుపై విశేషమైన గిఫ్ట్స్ అందిస్తున్నామని అందుకే కొనుగోలుదారులు భారీ సంఖ్యలో విచ్చేస్తున్నారని వివరించింది. రూ. 2,000విలువచేసే ప్రతీ కొనుగోలుపై గిఫ్ట్స్ ఇస్తున్నామని ఆర్.ఎస్ బ్రదర్స్ మేనేజర్ ఒకరు తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ఈ సువర్ణ అవకాశంలో భాగంగా రూ.4,495 మేరకు పట్టుచీరను కొన్న వారికి మిక్సీగ్రైండర్‌ను కానుకగా అప్పటికప్పుడే (స్పాట్‌లో) ఇస్తున్నట్లు చెప్పారు. రూ.4,495 మేరకు స్వర్ణ పట్టుచీరను కొనుగోలు చేసినవారికి రూ. 45కే మరో చీరను కానుకగా అందజేస్తున్నామని ఆయన తెలియజేశారు. దసరా పండుగ సీజన్ నేపథ్యంలో లేడీస్ వెస్ట్రన్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్ సరికొత్త స్టాక్ అందుబాటులో ఉన్నదని, వీటిపై అనేక రకాల ఆకర్షణీయమైన తక్షణ కానుకలను కొనుగోలుదారులకు అప్పటికప్పుడే, అక్కడికక్కడే అందజేస్తున్నామని వివరించారు. ఆర్.ఎస్ బ్రదర్స్ యాజమాన్యం కొనుగోళ్లపై స్పాట్ గిఫ్ట్స్ ఇవ్వడం పట్ల పలువురు కొనుగోలుదారులు సంతోషం వ్యక్తం చేశారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## హమాలీలకు ఇఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మార్కెట్ హమాలీ కార్మికులకు ఈఎ స్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ సూర్యాపేట జిల్లా అధ్య క్షుడు జడ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ కు హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం హమాలీలతో కలిసి జడ శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కనీస సౌకర్యాలు కల్పిస్తూ, నాల్గవ తరగతి ఉద్యో గులుగా వారిని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్ర మంలో బెల్లంకొండ రాములు,పానుగోతు గోపి,చక్రాల వెంకన్న,ధరావత్ అంజయ్య,బానోతు సైదులు,బానోతు వీరబాబు,బొల్లం కోటేశ్వరరావు,తేజ వత్ నాగేష్,గణపవరం సైదులు,మల్సూర్ పాల్గొన్నారు.



# ప్రతీ ఊర్లో సాయుధ పోరాట త్యాగాల చరిత్ర

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన
: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** పోరాటాలకు, త్యాగాలకు ఆత్మగౌరవానికి నిలువెత్తు సంతకం నల్లగొండ జిల్లా. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని నల్లగొండ జిల్లాలో ప్రతీ ఊర్లో త్యాగాల చరిత్ర ఉన్న దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దే శించి సందేశం ఇస్తూ... వెట్టి నుంచి తెలంగాణ మట్టికి, ఈ ప్రాంతానికి విముక్తి కలిగిన సెప్టెంబర్ 17 ను పురస్కరించుకొని తెలంగాణ ప్రజాప్రభుత్వం నిర్వహి స్తున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలి యజేశారు. భూస్వామ్య జమీందార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అప్పటి నల్లగొండ జిల్లాలోని గుండ్రాంపల్లి, కడవెండి, రావులపెంట, శాలిగౌరారం, ఏనె మీదిగూడెం ప్రాంతాలు ఉద్యమానికి కేంద్ర బిందువులుగా నిలిచాయి అని గుర్తు చేశారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తున్నదని భారతదేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు ఎంతోమంది కృషి చేసినట్లుగానే ,తెలం గాణ సాయుధ పోరాటంలో అనేక మంది అమరులయ్యారని, తెలంగాణ ఉద్య మంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని, అంతేకాక నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి సెప్టెంబర్ 17న విముక్తి కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 2 లక్షల 33 వేల 981 మంది రైతులకు 2044.83 కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం జరిగింది. రుణమాఫీలో జిల్లాకు అత్యధిక లబ్ధి జరగడం సంతోషమన్నారు.ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్ఎల్ బిసి టన్నెల్ నిర్మాణ పనులు మన ప్రజా ప్రభుత్వం ఏర్పాడ్డాక మళ్ళీ ప్రారంభిం చుకోవడం జరిగిందని, ఇటీవల దూరదృష్టావశాత్తు జరిగిన ప్రమాదం వల్ల పనులు మళ్లీ ఆగిపోవడం జరిగిందని,ఆగిన లైనింగ్ పనులు తిరిగి ప్రారంభించి 2027 డిసెంబర్ వరకు పూర్తి చేస్తామని హామీ ఇస్తున్నామని తెలిపారు.హైదరా బాద్‌విజయవాడ జాతీయ రహదారిని 8 లేన్ల నిర్మాణం, వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్టుకు అనుమతులు రావడం నాకు మిక్కిలి సంతోషమన్నారు.దేవర కొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఎం ఎల్ సి శంకర్ నాయక్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, లైబ్రరీ చైర్మన్ హఫీజ్ ఖాన్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

# అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష

రాష్ట్ర ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, వాణిజ్య, పరి శ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో బుధవారం నిర్వ హించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ముందుగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ, రాష్ట్రీయ గీతాలాపన చేశారు. అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం కోసం అమరులైన తెలం గాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ అమరవీరులకు జోహార్లు ఘటిస్తూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తుందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే వంట గ్యాస్, రైతుబరోసా కింద రైతులకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. రైతులు పంటసాగు కోసం చేసిన అప్పుల తీర్చలేక ఇబ్బందులు పడడంతో ఆరు నెలల్లోనే వారికి రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని దీని ద్వారా సూర్యాపేట జిల్లా 1లక్ష 27వేల 269 మంది రైతులకు రూ.1005 కోట్లు మాఫీ చేసిందన్నారు. రైతుభీమా పథకం ద్వారా 787 మంది రైతులు చనిపోగా వారి నామినిలకు రూ.39.35 కోట్లు అందజే యడం జరిగిందని చెప్పారు. ఇంటిగ్రేటెట్ స్కూల్స్‌ను జిల్లాలోని హుజూర్‌న గర్, కోదాడ, తుంగతుర్తి నియోజక వర్గాల్లో అంచనా విలువ ఒక్కొక్కటి రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.600 కోట్లు మంజూరి చేయడం జరి గిందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హుజూర్‌నగర్ మున్సిపా లిటిలోని రామస్వామి గుట్ట వద్ద యువత ఉపాధికి శిక్షణ ఇచ్చేందుకు రూ.22కోట్ల 16లక్షలు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ ఐటిఐ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కొత్తగా 42వేల 279 నూతన రేషన్‌కా ర్డులు మంజూరి చేశామని చెప్పారు. నీటిపారుదల మెరుగు చేసేందుకు జిల్లాలోని ప్రధాన మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్‌కు కోట్లాది రూపాయలను మంజూరి చేసి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుం దన్నారు. దీనికి ముందు విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్య క్రమాలను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె నరసింహ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, అదనపు కలెక్టర్ సీతారామారావు, అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, నర్సింహాచారి, ఆర్‌డిఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.



## సిపిఐ కమ్యూనిస్టుల పోరాటంతోనే తెలంగాణకు స్వాతంత్ర్యం...

తెలంగాణ విలీనమే...విమోచనం కాదు...పల్లా

**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 77వ వారోత్సవాల సందర్భంగా పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జాతీయ జెండాను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పల్లా దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 17న వియో చన దినోత్సవం పేరిట బిజెపి చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టేం దుకేనని అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారి కంగా నిర్వహి స్తామని, ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, సహాయ కార్య దర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మహిళా సమాఖ్య డివిజన్ కార్యదర్శి అనిత, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, యాదయ్య, వెంకటయ్య, మైనోద్దీన్, మండల కౌన్సిల్ సభ్యులు, పట్టణ శాఖ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, జ్యోతిబస్, నగేష్, బుచ్చయ్య, వెంకటయ్య, శ్రీను, మల్లేష్ పాల్గొన్నారు.

## తెలంగాణాలో ప్రజాపాలన మొదలైంది

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన అంతమై ప్రజాపాలన ప్రారంభమైందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు తెలిపారు. సెప్టెంబర్ 17 తేదీన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతోపాటు కాంగ్రెస్ కార్యాలయంలో వారు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత నిరం కుశపూరిత అధికారంతో పదేండ్లు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ బానిస సంకెళ్లు తెంపేసి ప్రజాపాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిందన్నార. నాటి నిజాం ప్రభుత్వం నుంచి తెలంగాణాకు విముక్తి చెందిన ఏ విధంగానైతే భారత దేశంలో విలీనమైందో అదేవిధంగా నిరంకుశ రాజ్యం నుంచి విముక్తి పొందామన్నారు.

## ఎస్‌సి సంక్షేమ వసతి గృహాలకు కొత్త భవనాలు నిర్మాణం చేపట్టాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతి కుమార్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో అద్దె భవనాలలో నడుస్తున్న ఎస్సీ వసతి గృహాలకు కొత్త బిల్డింగులు నిర్మాణాలు చేపట్టాలని జిల్లా పరిపాలనాధికారి జగన్మోహన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ జిల్లా కౌన్సిల్ పక్షాన వసతి గృహాలు సందర్శించిన క్రమంలో జిల్లాలో అద్దె భవనాలలో నడుస్తున్న భువనగిరి ఎస్సీ బాలికల పాఠశాల, కళాశాల వసతిగృహాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా రామన్నపేటలో నడుస్తున్న ఎస్సీ సంక్షేమ వసతి గృహానికి కొత్త భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్సి బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులు స్నానం చేయడానికి వాటర్ ట్యాంక్ లేక విద్యార్థుల అవస్థ పడుతున్నారన్నారు. భువనగిరి ఎస్సీ బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహాలకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నారని రెండింటికి కలిపి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిప్పలపల్లి వంశీ, ప్రశాంత్, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

# కళాశాలల్లో ఫలితాలు పెంచడంపై దృష్టి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కెజిబివి,ఇంటర్మీడియట్ కళాశాలలో ఫలితా లను పెంచడంపై దృష్టి సారించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆయా పాఠశాలలు,ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ను ఆదేశించారు.బుధ వారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కేజీ బివి లు, ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలు, అఫ్లిఏషన్, ఫలితాలు, ఫేస్ రికగ్నిషన్ సిస్టం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గడిచిన 3 సంవత్సరాలలో ప్రవే శాలు తక్కువగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ కళాశాలల్లో లెక్చరర్ల కొరతను తీర్చడమే కాకుండా, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నదని, అందువలన అడ్మిషన్స్ పెరిగే విధంగా ప్రిన్సిపల్స్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అలాగే కొన్ని కళాశాలల్లో ఫలితాలు తక్కువగా ఉన్నాయని ,అలాంటి కళాశాలల్లో ఫలితాలు పెంపొందించడం పై దృష్టి సారించాల న్నారు. జిల్లాలోని అన్ని ఇంటర్ కళాశాలల్లో నూటికి నూరు శాతం పేస్ రిక గ్నిషన్ సిస్టం కవరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.యు డైస్ పూర్తిస్థా యిలో చేయాలని, అన్ని వివరాలు ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు. కాగా ప్రభుత్వ సెక్టార్ లో పనిచేసే 97 మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, మోడల్ స్కూల్ లకు సంబంధించిన ప్రిన్సిపాల్స్ తో ఆమె సమీక్ష నిర్వహించారు.విద్యార్థులను సొంత పిల్లల్లా భావించి విద్యను అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. అడ్మి షన్స్ తక్కువగా ఉన్నచోట అందుకు గల కారణాలను అడిగి తెలుసుకు న్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపొందించే చర్యలు చేపట్టాలని, అభ్య సన సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. తాను కేజీబీవీలు, ఇతర పాఠశా లల సందర్శన సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిం చడం జరుగుతున్నదని, కొన్ని పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలు లోపించి నట్లు గుర్తించామని, అందువల్ల ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించా లని చెప్పారు. ఈసమీక్ష సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ వైద్యాధికారి దశ్రు నాయక్, డిఈఓ భిక్షపతి ,ఆర్‌సిఓ స్వప్న, బలరాం, తదితరులు మాట్లాడారు. కాగా వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపల్స్ ఉన్నారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలి**

పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆమె నల్గొండ మండలం, దోమలపల్లి లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తనిఖీ చేశారు.కాగా దోమలపల్లికి 70 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు కాగా, 56 ఇండ్లు వివిధ దశలలో ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిధర్ లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అయితే ఈ 56 ఇళ్లలో పూర్తి అయిన ఇళ్లకు తక్షణమే అర్హు లైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌డిఓవై. అశోక్ రెడ్డి,తహసిల్దార్ పరుశురాం ఉన్నారు.



## దడువాయి చాట స్వీపర్ హమాలీ కార్మికులకు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ఈనెల 27న నిజామాబాద్‌లో జరగనున్న మార్కెట్ హమాలీ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఏఐ టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జరిగిన హమాలీ కార్మికుల సమావేశంలో వారు పాల్గొని మాట్లా డుతూ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంత రంగా సమరశీల పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే దడువాయి చాట స్వీపర్ హమాలీ కార్మికులకు రూ.5ల క్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాల వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టాల్లో కూరుకుపోతుందని, పెట్టుబడిదారులు మార్కెట్‌ను శాసిస్తూ రైతులకు తీరని దుఖాన్ని మిగిలిస్తు న్నారని ఆరోపించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికు లకు సమగ్ర చట్టం రూపొందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈకార్య క్రమంలో హమాలీ యూనియన్ కార్మికులు బాలు, నాను, చందర్, నర్సిం హ, బాషా, సైదయ్య, బద్రు, శంకర్, వెంకటయ్య, ఇద్దయ్య పాల్గొన్నారు.

## అంజయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలి : ఆదిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్) :** నాటి నైజాం వ్యతిరేక పోరాటంలోపాత్ర లేని బిజెపి తెలంగాణ విలీన దినోత్సవం పై మాట్లాడే హక్కు లేదన్నారు.ఈ నెల 17న విమోచన దినోత్సవం పేరిట బిజెపి చేపట్టిన కార్యక్రమాలు ప్రజ లను మభ్య పెట్టేందుకేనని సిపిఐ సినియర్ నాయకులు మల్లేపల్లి ఆది రెడ్డి అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కనగల్ మండలంలోని చర్లగౌరారంలో అమరజీవి చిలకరాజు మరయ్య,అనచరుడు చింతల అంజయ్య గౌడ్‌ల స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆదిరెడ్డి మాట్లాడుతూ అంజయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడం కోసం బలమైన ఉద్య మాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,బొల్గూరి నర్సింహులు నల్లగొండ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి పాండరి, వి.లెనిన్, ఎం .నందం, బి.వెంకటయ్య,కె.నారాయణ,ఆర్ఎస్ రాములు, చింతల అంజయ్య గౌడ్ వారసులు మాజీ ఉప సర్పంచ్ చింతల బ్రహ్మయ్య,చింతల విజయ్, చింతల అంజయ్య,పల్లెబోయిన సైదులు, గంగన్నబోయిన మారయ్య పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడం, విలు వైన ప్రాణాలను కాపాడటానికి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత పై జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని అన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా పని చేయాలని సూచిం చారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే మీద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమా దాలు జరిగేందుకు అవకాశం ఉన్నచోట్ల ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మానవ తప్పిదాలు, వాహనాలు, అత్యధిక వేగం వలన రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి రహదారి సూచనలు ఏర్పాటు చేయా లని సూచించారు. రహదారి ఇరువైపులా పెద్దగా ఉన్న చెట్లను తొలగించాల న్నారు. పెద్ద చెట్ల వలన లైటింగ్ కనిపించకుండా ఉంటుందన్నారు. ప్రమా దాలు జరగకుండా ఉండేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ పటిష్టంగా ఏర్పాట్లు చేయాల న్నారు. అధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వేగ పరిమితిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ధర్మోజిగూడెం క్రాస్ రోడ్డు, కొయ్యలగూడెం బస్సు స్టాప్, వలిగొండ ఎక్స్ రోడ్, అనంతారం బ్రిడ్జి, మోత్కూర్ పాటిమట్టల ఎక్స్ రోడ్ వంటి ప్రదేశాలలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయని, అక్కడ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, యస్.ఈ రవీందర్, జిల్లా రోడ్లు భవనాల అధికారి సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళ కోసం ప్రతి ఒక్కరూ కృషి

కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/కోదాడ:** ఆరోగ్య మహిళ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ సూచిం చారు. స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం ) కార్యక్రమాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అదేశాల మేరకు సెప్టెం బర్ 17 నుండి అక్టోబర్ 2వ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్య కేంద్రాల ముందు ప్రత్యేక మహిళ ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబి రాల్లో నేత్ర, దంత, చర్మ, చెవి, ముక్కు, గొంతు, ప్రసూతి, దెర్మ టాలజి, సైక్రియాటిస్ట్ వైద్య నిపుణులు పాల్గొని సేవలందిస్తా రని, బిపి, షుగర్, క్యాన్సర్, టిబి, హిమోగ్లోబిన్, నేత్ర, గర్భి ణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు చేస్తారని అన్నారు. అవస రమై మందులను అక్కడికక్కడే అందజేస్తారని, రక్తదాన శిబి రాలు ఏర్పాటు చేస్తారని, అలాగే మహిళలకు రక్తహీనతకు గురికాకుండా ఉండేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగా హన కల్పిస్తారని, అవసరమైన మందులను కూడా వైద్య శిబి రంలో పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ దశరథ, డిప్యూటి డిఎంహె చ్‌వో జయమనోహరి, జనరల్ మెడిసిన్ డాక్టర్ మాధవ్‌కు మార్, ఇమ్యూనైజేషన్ డాక్టర్ లక్ష్మణ్, ఈఎన్‌టి డాక్టర్లు నర్సింహా, రాజేష్, అప్తమాలజీ డాక్టర్ నాగమణి, సైక్రియా టిస్టు డాక్టర్ స్రవంతి, జనరల్ సర్జన్ డాక్టర్ వైష్ణవి, పల్మనాల జీస్ట్ డాక్టర్ వెంకటపాపిరెడ్డి, ఆయుష్ డాక్టర్ పాారహీన్, కిశోర్ బాలికల డాక్టర్ శైలజ, డాక్టర్ పద్మావతి, ఆరోగ్యమిత్ర తిరు పమ్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్‌నాథ్ సింగ్ అబద్ధాల ప్రచారం ఆపాలి

సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో మాజీ సభ్యురాలు అఖిలభారత నాయకురాలు బృందాకరత్ హితవు



**ప్రజాపక్షం/నల్లగొండ :** భూమికోసం భుక్తి కోసం అలనాడు జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి అబద్ధపు ప్రచారాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ ఆపాలని సిపి ఐఎం పొలిట్ బ్యూరో మాజీ సభ్యురాలు అఖిలభా రత నాయకురాలు బృందాకరత్ హితవు. పలి కారు. నల్లగొండ పట్టణంలో బుధవారం సుభాష్ విగ్రహం సెంటర్‌లో సిపిఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతాంగసాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణరైతాంగ సాయుధ పోరాట లో పాల్గొన్న అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ. భారతదేశ చరిత్రలో సెప్టెం బర్ 17 లిఖించబడ్డదని పేర్కొన్నారు. మంగళ వారం రాత్రి కేంద్ర రక్షణ శాఖ మంత్రి హైదరా బాద్ కు వచ్చారు వస్తూ వస్తూ తనతో పాటు పెద్ద యంత్రం తెచ్చారు. ఆ యంత్రం ఏమిటంటే అబ ద్ధాలు తయారు చేసే మిషన్ తీసుకొని వచ్చారు. అది మీ అసత్య యూనిట్ నాగపూర్‌లోని ఆర్ఎ స్ఎస్ ప్రధాన కార్యాలయంలో తయారైందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ముందు అబ ద్ధాలు తయారు చేసే మిషన్ ని ప్రవేశపెట్టబోతు న్నారు. వారు చెప్పే కథ ఏంటంటే వీర తెలంగాణ పోరాటము ముస్లిం రాజు,హిందువులకు మధ్య జరిగిన పోరాటమని చిత్రీకరించి ప్రచారం చేస్తు న్నారు. వేదికపై సిపిఎం అఖిలభారత నాయకు రాలు కామ్రేడ్ బృందా కారత్ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపల్లి సీతారాములు రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మల్లు లక్ష్మి రాష్ట్ర నాయకులు బొంత చంద్రారెడ్డి,సిపిఎం నల్గొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య పాలడుగు నాగార్జున పాల్గొన్నారు.

# రీల్

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ 'మా వందే'



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ ను 'మా వందే' టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. నిర్మాత వీర్ రెడ్డి .ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారం గా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి క్రాంతికుమార్.సీహెచ్. దర్శకత్వం వహిస్తున్నారు. సమాజం కోసం ఎన్నో ఆకాంక్షలు గల బాలుడి నుంచి దే శ ప్రధానిగా మోదీ ఎదిగిన క్రమాన్ని 'మా వందే' సినిమాలో చూపించనున్నారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత వీర్ రెడ్డి.ఎం. 'మా వందే' చిత్రాన్ని పాన్ ఇం డియా భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ నిర్మిస్తున్నాం. ప్రపంచనాయకుడి గా మోదీ ఎదగడం వెనక ఆయన మాతృమూర్తి హీరాబెన్ ఇచ్చిన ప్రేర ణ, తల్లితో మోదీకి గల అను బంధం ఈ చిత్రంలో చూపించబోతున్నాం. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశం ఈ కథలో కీలకాంశంగా ఉండనుంది అని అన్నారు. యాక్షన్ కింగ్ సోలొమన్, ఎడిటింగ్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్,సంగీతం రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గంధాధర్ ఎన్ఎస్, వాణిశ్రీ .బి, లైన్ ప్రొడ్యూసర్ టీవీఎన్ రాజేశ్, రచన, దర్శకత్వం క్రాంతికుమార్.సి.హెచ్.

# 'ది గ్రేట్ వెడ్డింగ్ షో' టీజర్ రిలీజ్



తిరువీర్, టీనా శ్రావ్య హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. 7 పిఎం.ప్రొడక్షన్స్, పప్పెట్ షో ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై సందీప్ అగరం, అస్మితా రెడ్డి బాసిని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 7న సినిమా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు శేఖర్ కమ్ముల ఆవిష్కరించారు. చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ''ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో టీజర్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. సినిమా టీమ్ మొత్తం యంగ్ అ్ండ ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది.తీరువీర్‌కు ప్రీ వెడ్డింగ్ షో లాంటి మరిన్ని మంచి సినిమాలు చేయాలి. హీరోయిన్ నాచురల్‌గా కనిపించింది. ఇలాంటి కంటెంట్ ఓరియెంటెడ సినిమాలు నిర్మించడానికి ధైర్యం, పాషన్ ఉండాలి. నిర్మాతలను చూస్తుంటే నా డాలర్ డ్రీమ్స్, ఆనంద్ రోజులు గుర్తొచ్చాయి. కంప్లీట్ క్లీన్ ఫిల్మ్ అని తీరువీర్ అన్నాడు. బ్యాక్‌డ్రాప్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది అని తెలిపారు. హీరో తిరువీర్ మాట్లాడుతూ ''ఫ్రెండ సజేషన్‌తో 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' కథ విన్నాను. కథ వింటున్నప్పుడు స్టార్టింగ్ నుంచి చివరి వరకు నవ్వుతూనే ఉన్నాను. అప్పుడే ఈ సినిమా చేయాలని ఫిక్సయ్యాను. మార్కెట్ లెక్కల గురించి ఆలోచించకుండా నిర్మాతలు సందీప్, రంజిత్ ధైర్యంగా సినిమా చేయడానికి ముందుకొచ్చారు.అని చెప్పారు.నిర్మాత సందీప్ మాట్లాడుతూ మేము అనుకున్న బడ్జెట్ కంటే ఐదింతలు పెరిగింది. కథపై నమ్మకంతో ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా సినిమా చేశాం. 35 రోజులు అరకులో షూట్ చేశాం. సురేష్ బొబ్బిలి మంచి హిట్ సాంగ్స్ ఇచ్చాడు'' అని పేర్కొన్నారు.దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ''ప్రొడ్యూసర్లు సందీప్, రంజిత్ ఫస్ట్ సిట్టింగ్‌లోనే కథను నమ్మారు. వన్ ఇయర్ జర్నీ చాలా సాఫ్ట్‌గా వెళ్లిపోయింది అని అన్నారు. హీరోయిన్ టీనా శ్రావ్య మాట్లాడుతూ ''టీజర్ శాంపిల్ మాత్రమే. రెండు గంటలు ప్రతి సీన్, డైలాగ్ బాంబ్‌ల పేలిపోతాయి. తీరువీర్ నుంచి చాలా నేర్చుకున్నారు. హేమ పాత్రకు న్యాయం చేయడమే కాకుండా నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శకుడి న మ్మకాన్ని నిలబెట్టానని అనుకుంటున్నాను'' అని తెలిపింది.నిర్మాత అశ్విత రెడ్డి , =యాక్టర్ రోహన్, నరేంద్ర రవి, ఎడిటర్ నరేష్, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి పాల్గొన్నారు.

# 'విక్రమ్' సినిమాలో కొరియోగ్రాఫర్‌గా 'లియో'తో నటుడిగా ప్రస్థానం

## పారంజిత్ సినిమాలో హీరోగా
## కొరియోగ్రాఫర్, నటుడు శాండీ చిట్ చాట్



నటుడు శాండీ తెలుగుతో పాటు తమిళ తెరపై కూడా ఇప్పుడిప్పుడే బిజీ అవుతున్నారు. తమిళంలోనే కెరీర్ ప్రారంభించినప్పటికీ తెలుగులోను కూడా శాండీకి మంచి అవకాశాలు వస్తున్నాయి. తాజాగా విడుదలైన 'కిష్కింధపురి' సినిమాలో ఒక పెక్యులర్ క్యారెక్టర్ చేశాడు. ఈ సందర్భంగా శాండీ మీడియాతో ముచ్చటించారు. లియో, లోక, ఇప్పుడు కిస్కిందపురి ఇలా వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు నటుడు , కొరియోగ్రాఫర్ శాండీ చాలా ఆనందంగా ఉంది. ముందుగా డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కి థాంక్స్ చెప్పాలి. ఆయన లియోలో నాకు ఆ క్యారెక్టర్ ఇవ్వకపోతే ఈ జర్నీ మొదలయ్యేది కాదు.చిన్నప్పుడు అందరూ నా కళ్ళను చూసి ఆటపట్టించేవారు. 'డెత్ గోట్ ఐస్' అంటూ టీజ్ చేసేవారు. అయితే ఇప్పుడు అదే నాకు చాలా ఆనందం ఇచ్చింది. నిజంగా నాకు అలాంటి కళ్ళు లేకపోతే లోకేష్ ఆ క్యారెక్టర్ కి నన్ను ఎంపిక చేసేవారు కాదు. విక్రమ్ సినిమాలో ఒక సాంగ్ కి కొరియోగ్రఫీ చేశాను. అప్పుడే ఆయన లియోలో క్యారెక్టర్ గురించి చెప్పారు.లియో తర్వాత నాకు చాలా క్యారెక్టర్లు వచ్చాయి. అన్ని ఒకే తరహా సైకో పాత్రలు చెప్పేవారు. ఇలాంటి సమయంలో లోక, కిష్కింధపురి డిఫరెంట్ పత్రాలు రావడంతో చేయడానికి ఒప్పుకున్నాను. కిష్కిందపురిలో నేను చేసిన పాత్రకు మంచి రెస్పాన్స్ వస్తోంది. పోతే పోనీ పోరా పాట నాకు చాలా మంచి ఫేమ్ తీసుకొచ్చింది. నాకు హ్యూమర్ సెన్స్ ఉన్న క్యారెక్టర్స్, డాన్స్ పెర్ఫార్మన్స్ అంటే చాలా ఇష్టం.డైరెక్టర్ కౌశిక్ నా క్యారెక్టర్ గురించి చెప్పినప్పుడు చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. ఆ క్యారెక్టర్ గురించి ఎక్కువ రివిల్ చేయకూడదు. అది ఒక స్ప్రైజ్ లాగా ఉంచాము. ఈ క్యారెక్టర్ కోసం దాదాపు ఏడు గంటల పాటు టెస్ట్ షూట్ చేశాం. అది డైరెక్టర్ కి చాలా నచ్చింది. ఇలాంటి యూనిక్ క్యారెక్టర్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.నాకు రిఫరెన్స్ తీసుకోవడం ఇష్టం ఉండదు. అయితే గతంలో సూర్య చేసిన ఒక సినిమా ని రిఫరెన్స్ గా ఇచ్చారు. అయితే ఆ క్యారెక్టర్ కి ఈ క్యారెక్టర్ కి సంబంధం లేదు. చాలా కొత్తగా ఈ క్యారెక్టర్ ని ప్రజెంట్ చేయడం జరిగింది.యాక్టర్ గా కొరియోగ్రాఫర్ గా ఏ జర్నీ బెస్ట్ అని అంటే కొరియోగ్రఫీ నా బేస్. కచ్చితంగా కొరియోగ్రఫీ చేస్తాను. అయితే ప్రస్తుతం నేను యాక్టింగ్ మీద ఫోకస్ చేశాను. ఈ రెండు బ్యాలెన్స్ చేస్తూ చేయాలని ఉంది. నాకు దర్శకత్వం మీద కూడా ఆసక్తి ఉంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది. పా రంజిత్ నిర్మాణంలో హీరోగా ఒక సినిమా చేస్తున్నాను. మలయాళం లో 'కథామినార్' లో ఒక కీలక పాత్ర చేస్తున్నాను. ఓజీలో ప్రమోషనల్ సాంగ్ కి కొరియోగ్రఫీ చేశాను.

# 'టన్నెల్' 19న విడుదల




అథర్వా మురళీ ఇటీవల 'టన్నెల్' అంటూ ఓ క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ తో ఆడియెన్స్ ముందుకు వచ్చి తమిళ్ లో మంచి విజయం సాధించారు. తమిళంలో హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న 'టన్నెల్' తెలుగు ఆడియెన్స్ ముందుకు సెప్టెంబర్ 19న రాబోతోంది. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా ఎ.రాజు నాయక్ గ్రాండ గా విడుదల చేస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. శక్తి శరవణన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. కలైవానన్ ఈ సినిమాకు ఎడిటర్. సెప్టెంబర్ 19న విడుదల అవుతున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా అలరిస్తుందని నిర్మాత రాజు నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'తెలుసు కదా' షూటింగ్ పూర్తి



పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మిస్తున్న సంగీత భరిత వినోదాత్మక చిత్రం 'తెలుసు కదా'. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్ లుగా నటిస్తున్నారు. నీరజా కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది.ఈ సందర్భంగా లోకేషన్ లో కేక్ కట్ చేసుకుని సెలబ్రేట్ చేసుకున్నారు. ఇటీవల విడుదల చేసిన తెలుసు కదా టీజర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందల వచ్చింది. ఫస్ట్ సాంగ్ మల్లిక గంధ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. త్వరలో రెండో పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందించారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్, సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్ పని చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి ఈ సినిమాను అక్టోబర్ 17న విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఉద్యమాలకు ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)



దీంతో భాషా పరిరక్షణ ఉద్యమంగా ప్రారంభమై ఆ తర్వాత నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంగా మారిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంమన్నారు. ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు 10 శాతం ముస్లింలలో 8 శాతం మంది ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారన్నారు. ఆలాంటి ఈ పోరాటం హిందూ ముస్లింల మధ్య జరిగిన ఘర్షణ ఏలా అవుతుందో బిజెపి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశానికి 1947లో స్వాతంత్ర్యం లభిస్తే, నిజాం మాత్రం స్వతంత్ర దేశంగా ప్రకటించుకునే ప్రయత్నం చేస్తే కమ్యూనిస్టుల సారథ్యంలో ఏడాది పాటు పోరాడి నిజాం పీచం అణిచివేసిందన్నారు. దీంతో హైదరాబాద్ సంస్థానం కమ్యూనిస్టుల వశం కాబోతుందనే భయంతో నాడు కేంద్రం ఆపరేషన్ పోలో చేపట్టగా ఇటు వైపు గానీ అటువైపు గానీ చుక్క రక్తం బొట్టు నేల రాలకుండానే సెప్టెంబర్ 17న కేంద్రం ముందు నిజాం మొకరిల్లిన విధానమే చీకటి ఒప్పందంలో భాగమనేది స్పష్టమైందని పేర్కొన్నారు.



కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారానే నిరకుంశ నిజాం పాలన పతనమై హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని, ఎవరూ అవునన్నా, కాదన్నా చరిత్రే ఇందుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గానీ, దేశ స్వాతంత్రోద్యమంలో గానీ పాల్గొన్న చరిత్ర లేని బిజెపి కమ్యూనిస్టులను, మాజీ ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రూను తప్ప మిగిలిన గాంధీ మొదలు గాడ్సే వరకు వివేకానంద నుంచి విప్లవ కెరిటం భగత్‌సింగ్ వరకు అంతా తమ వారే అంటూ సొంతం చేసుకునే కుట్రకు తెరలెపిందని విమర్శించారు. కమ్యూనిస్టులు అన్నా, ఎర్రజెండా అన్నా ఇప్పటికీ ప్రజల గుండెల నిండుగా ప్రేమాభిమానాలు ఉన్నాయని వాటిని ముందుకు తీసుకువెళ్లడమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరులకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు.

జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌తో పాటు రాజ్యాంగబద్ధ సంస్థలను





చెరబట్టడంతో దేశంలో తీవ్ర సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాజ్యాంగంతో పాటు వ్యవస్థల పరిరక్షణకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టులు మరో అవిశ్రాంత పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు.



ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ సాయుధ పోరాటం ప్రభావం తెలంగాణ సమాజంపై ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ పోరాటం ప్రేరణ విప్లవోద్యమంలో ఉన్న నాయకులు మొదలుకుని, మేధావులు, కవులు, కళాకారులు, పౌర సమాజం నిండి ఉందని పేర్కొన్నారు. అంత గొప్ప పోరాటంతో ఏ సంబంధం లేని బిజెపి ఆ చరిత్రను వక్రీకరించడం హాస్యాస్పదమన్నారు.



కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో సాధించుకున్న స్వేచ్ఛ మన తెలంగాణ అని, ఈ తెలంగాణ ప్రపంచంలో పేరెన్నిక గల తెలంగాణగా అభివృద్ధి సూచికగా నిలబడాలంటే అందుకు శ్వాస సాయుధ పోరాటమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దినోత్సవం వేదికగా ఉద్ఘాటించారని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికీ కమ్యూనిస్టుల ప్రాబల్యం, త్యాగనిరితి ప్రజలలో నెలకొని ఉన్నందునే సిఎం ఆ మాటలు చెప్పారన్నారు. అయితే అంతటి చరిత్ర గల కమ్యూనిస్టుల ఉద్యమం చీలిక వల్ల బలపడిందో బలహీనపడిందో అని కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. తాగ్యాలు, ఉద్యమాలు కమ్యూనిస్టులవైతే, వాటి ఫలితాలను బుర్జువా పార్టీలు అనుభవిస్తున్నాయని, ఇప్పటికైనా కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు తాత్కాలికంగా సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు.



కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో అధికారికంగా నిర్వహించాలని అనేక ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం, మరో వైపు కేంద్ర ప్రభుత్వం వారి రాజకీయాలకు అనుగుణంగా ఎదో ఒక పేరుతో వేడుకలు నిర్వహించడం కొంత మేరకు సంతోషమేనన్నారు.



విమలక్క మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులతో పాటు సామాజిక రుగ్మతలకు కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం తగ్గడం కూడా ఒక కారణమన్నారు. ఇప్పటికైనా అన్ని వామపక్ష పార్టీలు ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేయాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యా పుస్తకాలలో చేర్చడంతో పాటు నాటి వీర యోధుల త్యాగాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు స్మృతి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూంమొహియుద్దీన్ విగ్రహాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని ఐదు తీర్మానాలను బహిరంగ సభ ఆమోదించింది.

# ఇవిఎం బ్యాలట్‌పై అభ్యర్థుల కలర్ ఫొటోలు

## డిజైన్‌లో మార్పులు చేసిన ఎన్నికల సంఘం
## కొత్త మార్గదర్శకాలు విడుదల

**న్యూఢిల్లీ:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకోసం ఇవిఎం బ్యాలట్ పత్రాల డిజైన్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. ఓటర్లు ఎలాంటి గందరగోళానికీ గురికాకుండా అభ్యర్థుల ఫొటోలు స్పష్టంగా, సులభంగా గుర్తుపట్టడంకోసం పెద్ద పెద్ద ఫొటోలను బ్యాలట్ పత్రాలలో ముద్రిస్తారు. ఈ ఫొటోలు కూడా కలర్‌లో ఉంటాయి. అందువల్ల ఓటర్లు చాలా సులభంగా అభ్యర్థులను గుర్తుపట్టగలుగుతారు. బ్యాలట్‌పత్రంలో మూడువంతులు స్థలం ఈ ఫొటోలే ఆక్రమిస్తాయి. ఎన్నికలసంఘం ఈ మేరకు బుధవారం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. గడచిన ఆరునెలలుగా ఈ మార్గదర్శకాలకు సంబందించి 28 చొరవలను ఇప్పటికే అమలు చేయగా, అదేమార్గంలో మిగిలిన చొరవలను కూడా అమలు చేస్తారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా విధానపరమైన మెరుగుదల చర్యలు ఓటర్లకోసం తీసుకున్నామని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలియజేసింది. అభ్యర్థుల పేర్లు సీరియల్ నెంబర్లు కూడా అంతర్జాతీయ ప్రామాణికతల ప్రకారం భారతీయ సంఖ్యల్లో ముద్రితమవుతాయిఇ. అభ్యర్థుల పేర్లు పెద్ద అక్షరాల్లో ముద్రిస్తారు. ఇవిఎం అసెంబ్లీ బ్యాలెట్ పత్రాలను 70 జిఎస్ఎం పింక్ కలర్ పేపర్‌పై ముద్రిస్తారు.

**త్వరలో దేశవ్యాప్తంగా 'సర్'... సగంమంది ఓటర్లకు ఇబ్బంది లేదు**

దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం త్వరలో ఓటర్ల జాబితాల ప్రక్షాళన కార్యక్రమం చేపడుతుంది. దీనికి సంబంధించి త్వరలో ఒక తేదీని ఎన్నికల సంఘం నిర్ణయిస్తుంది. దేశంలోని పలు రాష్ట్రాలలో సగంమంది ఓటర్లు ఎలాంటి ఆధారాలను సమర్పించే అవసరం ఉండకపోవచ్చునని కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బుధవారం చెప్పారు. ఇంతకుముందు జరిగిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సమీక్ష సందర్భంగా వారందరూ తగిన ఆధారాలు సమర్పించినవారేనని పేర్కొన్నారు. 2002 నుండి 2004 వరకూ జరిగిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) సమీక్షా కార్యక్రమాలలో సగంమంది ఓటర్లు తమ తమ అర్హతపత్రాలను అందజేసిన వారే ఉన్నారని తెలిపారు. ఇక తదుపరి నిర్వహించే ప్రత్యేక ముమ్మర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలకు 2002, 2004 సంవత్సరాలలో చేసిన సవరణలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమాలకు త్వరలో ఒక తేదీని ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు చెప్పారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేస్తారు. త్వరలో దీనికి ఒక తేదీని ఎన్నికల సంఘం నిర్ణయించి ప్రకటిస్తుంది. వివిధ రాష్ట్రాలలో ఎన్నికల సంఘాల ప్రధానాధికారులు ఇంతకుముందు ప్రత్యేక ముమ్మర సవరణ తర్వాతనాటి ఓటర్ల జాబితాలను ముద్రించి సిద్ధంగా ఉంచాలని కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలోని ఎన్నికల అధికారులు ఈ విధంగా సిద్ధంచేసిన ఓటర్ల జాబితాలను వెబ్‌సైట్లలో ప్రచురించి ఉంచారని తెలిపింది. ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి 2008 నాటి ఓటర్ల జాబితాను వెబ్‌సైటులో ప్రచురించి అందరికీ అందుబాటులో ఉంచారు. 17 సంవత్సరాలక్రితం ఈ ఓటర్ల జాబితాల ముమ్మర తనిఖీ కార్యక్రమం పూర్తయింది. ఇక ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కూడా 2006లో ఓటర్ల ముమ్మర ప్రక్షాళన పూర్తయింది. ఈ జాబితాలను కూడా ఆ రాష్ట్రం వెబ్‌సైటులో ప్రచురించి సిద్ధంగా ఉంచింది.

**బీహార్‌లో 60 శాతం ఓటర్లు ఆధారాలు ఇవ్వక్కరలేదు**

బీహార్‌లో 60 శాతం మంది ఓటర్లు ఎలాంటి ఆధారాలను సమర్పించాల్సిన అవసరం లేదు. ఎన్నికల సంఘం ఈ ప్రకటన చేసింది. బీహార్‌లో మొత్తం 4.96 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 2003వ సంవత్సరంలో బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సమీక్ష నిర్వహించారు. వీరిలో 60 శాతం ఓటర్లు తర్వాత ప్రచురించిన సవరణ జాబితాలో ఉన్నారు. అందువల్ల వారంతా తమ పుట్టిన ప్రదేశం లేదా పుట్టిన తేదీలను రుజువుచేసుకునేందుకు ఎలాంటి ఆధారాలూ సమర్పిచాల్సిన అవసరం లేదని తెలిపింది. ఐతే మిగిలిన 40 శాతం ఓటర్లు ఎన్నికల సంఘం ప్రకటించిన విధంగా 12 రకాల ఆధారాలలో ఏదో ఒక ఆధారం చూపొంచాల్సి ఉంటుంది. దీంతోపాటు అదనంగా కొత్తగా ఓటర్ల జాబితాలో చేరాలనుకునేవారు లేదా ఇతర రాష్ట్రాల నుండి తమ ఓటును స్వరాష్ట్రానికి బదిలీ చేసుకోవాలనుకునే వారికోసం ఒక యోగ్యతా పత్రాన్ని ప్రవేశపెట్టారు.

# డిజిపి కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర డిజిపి కార్యాలయంలో బుధవారం ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజిపి(రోడ్ సేఫ్టీ రైల్వేస్) కె.రమేష్ నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ ఐజిపి ఎం.శ్రీనివాసులు, లీగల్ ఎస్‌పి సతీష్, శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిఎస్‌పిలు యోగేశ్వరరావు, వేణుగోపాల్, ఉదయ భాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా డిజిపి కార్యాలయానికి చెందిన మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరులకు నివాళులు అర్పించిన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జాతీయ నాయకులు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com